www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 232 | సోమవారం 12-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

పోలవరానికి ఎన్ని గ్రహణాలో

మాట తప్పిన కేంద్రం

- విదిలింపు ధోరణిలో నిధుల విడుదల
- ప్రతిదానికి కొర్రీలే
- కాఫర్‌డామ్ ఎందుకంటూ ప్రశ్నలు
- ఖర్చులకు లెక్కలు చూపని రాష్ట్ర ప్రభుత్వం
- అంతిమంగా నష్టపోతున్నది రైతులే



విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి :
పోలవరం.... తెలుగు రాష్ట్రాల విభజన అనంతరం ఏపీకి వరంగా మారిన ఈ ప్రాజెక్ట్‌కు అన్నీ అవరోధాలే..ఎన్నో గ్రహణాలు..ఇప్పుడు కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదానికి సైతం కేంద్ర బిందువుగా మారింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను విడదీసినప్పుడు పార్లమెంట్‌లో చేసిన ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం జాతీయ హోదా దక్కిన పోలవరంను పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. తెలుగుదేశం పార్టీకి, ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంగా మారిన ఈ ప్రాజెక్ట్‌కు నిధులిచ్చే విషయమై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ మీనమేషాలు లెక్కిస్తూ ప్రాజెక్ట్‌కు కొద్దికొద్దిగా నిధులు విదిలిస్తున్నది, ఇలా చూసుకుంటే ఈ ప్రాజెక్ట్ ఏపీకి వరంగా మారే అవకాశాలు సమీప భవిష్యత్తులో ఏ మాత్రం కన్పించడం లేదు. నిధుల లేమితో అష్టకష్టాలు పడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిచేయాల్సిన బాధ్యతను కేంద్రానికి ఎప్పటికప్పుడు గుర్తుచేస్తూనే ఉంది. నీటి ప్రాజెక్టులకు ముఖ్యంగా పోలవరం అధిక ప్రాధాన్యత ఇస్తున్న టీడీపీ ప్రభుత్వం ఇందుకోసం గడువు విధించుకుని కూర్చున్నది. కేంద్రం కేటాయిస్తున్న నిధులు, దానికి లెక్కలు చూపని రాష్ట్ర ప్రభుత్వం వైఖరి కారణంగా ఇప్పటికే ఒక వ్యవసాయ సీజన్ పూర్తయిపోయింది.

1930-40 దశకంలో ఊపిరి పోసుకున్న ఈ ప్రాజెక్టుకు ఎన్నోమార్లు శంకుస్థాపనలు జరిగాయి. కానీ నిక్కచ్చిగా దీనికి పునాదిరాయి పడింది మాత్రం 1980లోనే అనుకోవాలి. అయితే పనులు ప్రారంభమైంది మాత్రం 2004 సంవత్సరంలోనే.. 2012 వరకు మందకొడిగా సాగిన పనులు.. 2014-15 సంవత్సరాల మధ్యకాలంలో ఊపందుకున్నాయి. 2013-14 మధ్యకాలంలో 140లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకం పనులు జరిగాయి. అవి 2014-15 సంవత్సరకాలంలో 220 లక్షల క్యూబిక్ మీటర్లకు పెరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి సోమవారం ఈ ప్రాజెక్టు పనులను సమీక్షిస్తుంటారు. మొన్న 5వతేదీన జరిగిన సమీక్ష సమావేశం ప్రకారం ఆ రోజునాటికి ప్రాజెక్టులో 53శాతం పనులు పూర్తయ్యాయన్నది సారాంశం. అలాగే గోదావరి-కృష్ణా నదులు అనుసంధానానికి ఉద్దేశించిన కుడి మెయిన్ కెనాల్ పనులు 90శాతం పూర్తయినట్లు అధికారులు చెప్పారు. కానీ ఇంకొక లెక్క ప్రకారం స్పిల్‌వే కాంక్రీట్ పనులు 14శాతమే పూర్తయ్యాయని, అలాగే ప్రాజెక్ట్‌కు ప్రధానమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్డ్ ఛానల్ పనులు అసలు ప్రారంభం కాలేదని తెలిసింది. జాతీయ ప్రాజెక్టుగా - మిగతా 2 లో

ఇక తెగదెంపులే?

- బీజేపీ సంకేతాలు... హరిబాబు కవ్వింపు ప్రకటనలు
- అధినేత అంతర్మథనం
- స్వపక్షంలో విపక్షంగా టీడీపీ ఎంపీలు
- వేచిచూద్దామంటోన్న చంద్రబాబు

విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి
రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ పరిణామాలను గమనిస్తుంటే మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీతో తెగదెంపులు చేసుకోవడానికి బీజేపీ సిద్ధపడుతున్నదా..? అనిపిస్తున్నది. గడచిన రెండురోజులుగా జరుగుతోన్న పరిణామాలు దీన్ని ధృవీకరిస్తున్నాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ అయిన హరిబాబు శనివారం నాడు ఢిల్లీలో చేసిన ప్రకటనపై తెలుగుదేశం పార్టీలో అంతర్మథనం ఆరంభమైంది. విభజనానంతరం ఆంధ్రప్రదేశ్‌కి చాలా చేశామని, స్వాతంత్ర్యం వచ్చాక ఏ రాష్ట్రానికి ఇంత చేయలేదని ఆయన పేర్కొనడం, అకౌంట్లవారీగా కేంద్రం చేసిన సహాయ, సహకారాలపై వివరించడంపై తెలుగుదేశం నాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దీనికి కౌంటర్ గా ఆదివారం నాడు మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ కేంద్రం నుంచి వచ్చింది ఎంత, బీజేపీ చేస్తోన్న ప్రచారంలో నిజమెంత అనే అంశాలపై వివరణ ఇచ్చింది. అన్నీ అబద్ధాలను ప్రచారం చేస్తూ బీజేపీ రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని తెలుగుదేశం నాయకత్వం తీవ్రస్థాయిలో మండిపడుతోంది. మరోవైపు తెలుగుదేశం పై హరిబాబు ఆదివారం నాడు మరింత ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల సంఖ్యను పెంచకపోవడం వల్లనే తెలుగుదేశం పార్టీ తమపై నిందలు - మిగతా 2 లో



కూలిన రష్యా విమానం
71 మంది దుర్మరణం
11లో



కాషాయం పూసుకుంటే చేతులు కలపను
రజనీతో పొత్తుపై కమల్
9లో



అవినీతికి చిరునామా బీజేపీ
రాహుల్‌గాంధీ ధ్వజం

తుది రూపు దాల్చని

రాజధాని డిజైన్లు

- గడువు దాటినా పూర్తి చేయని నార్మన్ ఫోస్టర్స్
- కేంద్రానికి చేరడానికి మరింత సమయం
- సార్వత్రిక ఎన్నికల తర్వాతే నిర్మాణం?



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
అమరావతి రాజధానిలో ప్రభుత్వ భవనాల డిజైన్లలో మళ్లీ ప్రతిష్టంభన నెలకొంది. లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్స్, పార్టనర్స్ సంస్థ రూపొందించిన శాసనసభ, హైకోర్టు డిజైన్లకు గత డిసెంబరు 16న జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఆమోదం తెలుపగా, బాహుబలి దర్శకుడు రాజమౌళి డిజైన్లలో కొన్ని సూచించగా, చంద్రబాబుతోపాటు పలువురు మంత్రులు మరిన్ని సలహాలను అందచేశారు. టవర్ ఆకారంలోని అసెంబ్లీ, స్థూపాకారంలోని హైకోర్టు భవనాల్లో తెలుగు సంస్కృతీసంప్రదాయాలు, వారసత్వ చిహ్నాలను జోడించాలన్నారు. వీటన్నింటినీ మేళవించి అన్ని వివరాలతో తుది డిజైన్లను నాలుగు వారాల్లో అందచేయాలని చంద్రబాబు రూపకర్తలను కోరారు. తుది డిజైన్లను కేంద్రానికి పంపించి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి, ఆర్థికశాఖ, పట్టణాభివృద్ధిశాఖల మంత్రులతోపాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులకు - మిగతా 2 లో

44 మాసాలుగా మీ చిత్తశుద్ధి ఏమైంది?

- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
- హరిబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బహిరంగ లేఖ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర సాయంపై మీరు ఈ నెల 10న 27 పేజీల నివేదిక సమర్పించారు. పరస్పర విరుద్ధ ప్రకటనలతో 44 మాసాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేయడంలో మీ ప్రకటనలు కూడా ప్రముఖ స్థానం పొందాయి. ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా, నాటి కేంద్రమంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు తదితరులంతా పూటకోమాట చెప్పి, అమలుకు నోచుకోని ప్రకటనలతో ప్రజలను మోసం చేశారు. అదంతా వినీవినీ విసిగిపోయిన ఏపీ ప్రజలకు మళ్ళీ పాతపాటే మీరు వినిపిస్తున్నారు. రానున్న 2019 ఎన్నికల ఎత్తుగడలలో భాగంగా, ఏపీ ప్రజలను మరోసారి ఫూల్స్ చేసేందుకు బీజేపీ పావులు కదుపుతున్నదని మీ ప్రకటనలతో అర్ధమవుతున్నది. రాష్ట్ర ప్రజల ఆశలను, ఆకాంక్షలను తుంగలోతొక్కిన బీజేపీ విధానాలపై రాష్ట్ర ప్రజల తరఫున మేం అడిగే ప్రశ్నలకు మీ నుంచి సమాధానాలను ఆశిస్తున్నాం.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి 10 ఏళ్ళు ప్రత్యేక హోదా కల్పిస్తామని బీజేపీ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాట వాస్తవమా కాదా? ఆ హామీని అడ్డుపెట్టి ఏపీలో బీజేపీ 2 ఎంపీ సీట్లు, 4 ఎమ్మెల్యే సీట్లు గెలిచిందా లేదా? 44 మాసాలైనప్పటికీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన విషయంలో మీ చిత్త శుద్ధి ఏమైంది? రాష్ట్ర విభజన అనంతరం రెవిన్యూ లోటు రూ.16 వేల కోట్లు ఉందని కాగ్ చెప్పగా, ఇప్పటికి కేంద్రం రూ.3,979 కోట్లు మాత్రమే ఇచ్చిందని, 2020 నాటికి రూ.22,113 కోట్లు ఇస్తుందని చెబుతున్నారు. దాదాపు నాలుగు సంవత్సరాలుగా ఇవ్వలేని నిధులు 2020 నాటికల్లా కేవలం రెండేళ్లలో ఇస్తామంటే జనం నమ్మాలా?

వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికిగాను రూ.24,350 కోట్ల రూపాయలు కావాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా కేంద్రం కేవలం జిల్లాకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున గత మూడేళ్ళలో రూ.1050 కోట్లు - మిగతా 2 లో



సీపీఐ విశాఖ జిల్లా సమితి కార్యదర్శిగా బాలేపల్లి

విశాలాంధ్ర -పాడేరు(విశాఖపట్నం):
ఇక్కడ జరిగిన విశాఖ జిల్లా సీపీఐ సమితి మహాసభల్లో రెండోరోజు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శులుగా జేవీ ప్రభాకర్, పొట్టిక సత్యనారాయణ ఎన్నిక య్యారు. సీపీఐ జిల్లా సమితి నుండి 74, కార్యవర్గం 19 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఏ.జె. స్టాలిన్, చలసాని రాఘవేంద్రరావు, బి.వెంకటరమణ, ఆర్.వి. జగ్గారావు, ఏ.విమల, డి.సి.హెచ్ రాజుబాబు, కూడా భూషణ రావు, డి.బిమలమ్మ, మాకిరెడ్డి రామునాయుడు, ఎం. పైడి రాజు, దేవరకొండ మార్కండేయులు, ఆర్ దొరబాబు, ఎస్.విష్ణు మూర్తి, కె.సత్యాంజనేయ, ఇరువాడ దేముడు, జి.గురుబాబు, ఎం.రాజుబాబు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

'అగ్రి' ఉద్యమం ఉధృతం

- బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లకు పట్టు
- అవసరమైతే చలో అసెంబ్లీ
- 15, 16 తేదీల్లో జీపు యాత్రలు
- 19, 20, 21 తేదీల్లో రిలే దీక్షలు
- దేశంలో ఇదే పెద్ద ఉద్యమం : ముప్పాళ్ళ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి
రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లను అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించేందుకు కేటాయించాలంటూ అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏజీసీఏడబ్ల్యుఏ) చేపట్టిన ఆందోళన ఉధృతం అవుతోంది. పలు రూపాలలో అసోసి యేషన్ నాయకులు ఆందోళన చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19.32 లక్షల మంది బాధితులను ఉద్యమంలో భాగస్వామ్యం చేసేందుకు అసోసియేషన్ నేతలు 'బాధితుల ఇంటి తలుపు తట్టుదాం - ఆత్మస్థైర్యాన్ని కల్పిద్దాం' అనే నినాదంతో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. అందులో భాగంగానే ఈ నెల 15, 16 తేదీలలో అన్ని మండలాల్లో జీపు యాత్రలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలోనూ బాధితుల సభలు నిర్వహించాలని అసోసియేషన్ నాయకులు నిర్ణయించారు. అలాగే ఈ నెల 19, 20, 21 తేదీలలో అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద లేక కూడళ్లలో అగ్రిగోల్డ్ బాధిత కుటుంబ సభ్యులతో రిలే నిరాహార దీక్షలు కూడా చేపట్టనున్నారు. ఇప్పటికే ఇంటింటా నిర్వహిస్తున్న చైతన్య యాత్రకు బాధితుల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో, బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లను కేటాయించేంత వరకు ఉద్యమించాలని అసోసియేషన్ కార్యవర్గ సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే బడ్జెట్ సమావేశాల్లోనే బాధితులతో - మిగతా 2 లో

ఇదీ లోకం!



నీట్ అర్హతతోనే

విదేశాల్లో మెడిసిన్!

కేంద్ర ప్రభుత్వం యోచన



న్యూఢిల్లీ :
విదేశీ యూనివర్సిటీలలో ఎంబీబీఎస్ చదవాలని కోరుకుంటున్న విద్యార్థులు సైతం నీట్ పరీక్షల్లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. నీట్ పరీక్షల్లో అర్హత సాధించడాన్ని తప్పనిసరి చేయాలని భావిస్తోంది. అయితే ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. 2016 నుంచి నీట్ అమలులోకి వచ్చింది. ప్రస్తుతం దేశంలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మెడిసిన్ చదవాలని కోరుకుంటున్న విద్యార్థులు నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు(నీట్)లో అర్హత సాధించాల్సిందే. భారతదేశంలో ఈ విధానం ఇప్పటికు అమలులో ఉన్నది. విదేశీ వర్సిటీల్లో మెడిసిన్ చదవాలని కోరుకుంటున్న విద్యార్థులు నీట్‌లో ఉత్తీర్ణత సాధించాలన్న ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నాయని, ఇది పురోగతి దశలో ఉందని ఆరోగ్యశాఖ సీనియర్ - మిగతా 2 లో

పండ్లు, కూరగాయలకు

మార్కెట్ సెస్ మాఫీ..!

- నోటిఫికేషన్ దశలో చట్టం
- ప్రతిపాదించిన నీతి ఆయోగ్
- పరిశీలిస్తున్న ప్రభుత్వం
- తగ్గనున్న మార్కెటింగ్ ఆదాయం
- తెరపైకి మళ్లీ సెస్ మినహాయింపు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు ప్రస్తుతం వసూలు చేస్తున్న మార్కెట్ ఫీజు (సెస్) నుంచి పండ్లు, కూరగాయలకు మినహాయింపు లభించనుంది. ఆరుగాలం పంటలు పండించిన రైతులు వాటిని అమ్ముకోవాలంటే ప్రభుత్వానికి సెస్ చెల్లించాల్సి వస్తోంది. పచ్చి సరుకుపై సెస్‌ను మాఫీ చేయాలని ఎనిమిదేళ్ల క్రితమే ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే సెస్ లేకపోతే మార్కెట్ కమిటీల నిర్వహణ కష్టంగా మారుతుందనే ఉద్దేశంతో ఏ ప్రభుత్వం కూడా సెస్ వసూళ్ల నిలుపుదలపై ధైర్యం చేయలేకపోయాయి. అన్ని రాష్ట్రాల్లోనూ పండ్లు, కూరగాయలకు సెస్ మినహాయింపు ఇవ్వాలని ఇటీవల నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. దీనిపై సీఎం చంద్రబాబుతో సమగ్రంగా చర్చించిన తర్వాతగానీ జీఓ తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలిసింది. ఇప్పటికే సెస్ మినహాయింపునకు సంబంధించిన చట్టం నోటిఫికేషన్ దశలో ఉన్నట్లు సమాచారం. రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయించుకోవాలంటే మార్కెటింగ్ శాఖకు సెస్ చెల్లించాల్సి ఉంటుంది. విలువ ఆధారంగా ఒక్క శాతాన్ని మార్కెట్ సెస్‌గా వసూలు చేస్తారు. ఇదిలావుండగా, 14 రాష్ట్ర ప్రభుత్వాలు సెస్ మినహాయింపును రెండేళ్ల క్రితం నుంచి అమలు చేస్తున్నాయి. మహారాష్ట్ర, నాగాలాండ్, కర్నాటక, అసోం, - మిగతా 2 లో

మా హెలికాప్టర్‌ను కుర్దులే కూల్చేశారు : ఎర్దోగన్



ఇస్తాంబుల్ : ఉత్తర సిరియా పట్టణమైన ఆఫ్రీన్ వద్ద టర్కీకి చెందిన హెలికాప్టర్‌ను సిరియాలోని కుర్దిష్ వైపీజీ యోధులు పేల్చివేశారని అధ్యక్షుడు తయ్యిబ్ ఎర్దోగన్ వెల్లడించారు. హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు సైనికులు మరణించినట్టు టర్కీ సైన్యం పేర్కొంది. వైపీజీ వర్గాలు సైతం తాము ఆ హెలికాప్టర్‌ను కూల్చినట్టు వేరొక ప్రకటన విడుదల చేశాయి. 'ఇటీవల మా హెలికాప్టర్ ఒకటి కూలిపోయింది. యుద్ధంలో భాగంగా ఇలాంటివి జరుగుతుంటాయి. మేం ఒక హెలికాప్టర్‌ను కోల్పోయి ఉండవచ్చుగానీ దీనికి వారు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది' అని ఇస్తాంబుల్‌లో ఏకే పార్టీ సభ్యులతో ఎర్దోగన్ అన్నారు. తమ హెలికాప్టర్‌ను కుర్దులు ఎందుకు కూల్చివేశారన్నది మాత్రం టర్కీ సైన్యం వెల్లడించలేదు. దీనిపై తమ టెక్నికల్ సిబ్బంది విచారణ చేపట్టినట్టు తెలిపింది. వేరొక ప్రకటన ద్వారా ఆఫ్రీన్‌లో కుర్దులతో సాగుతున్న పోరులో తొమ్మిది మంది సైనికులు చనిపోయారని మరో 11 మందికి గాయాలయ్యాయని వివరించింది. 39 మంది తీవ్రవాదులను మట్టుబెట్టినట్టు పేర్కొంది.

మాల్దీవులు నుంచి వెళ్లిపోండి..

ఇద్దరు 'భారతీయ' జర్నలిస్టులకు ఆదేశం



మాలె: మాల్దీవుల్లో నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని జర్నలిస్టులైన భారత్‌కు చెందిన మణిశర్మ, భారతీయ మూలాలున్న బ్రిటన్ జాతీయుడైన అతిశ్ రావి పటేల్‌ను ఆ దేశ ప్రభుత్వం ఆదేశించింది. ఇద్దరు జర్నలిస్టులను పోలీసులు ఇమిగ్రేషన్ అధికారులకు అప్పగించారు. వారిద్దరు పర్యాటక వీసా మీద మాల్దీవులు వెళ్లారు. వలస చట్టం నిబంధనలకు విరుద్ధంగా న్యూస్ ఏజెన్సీ కోసం వార్తలు సేకరిస్తున్నారని గుర్తించి అధికారులు వారిని అరెస్టు చేశారు. అయితే వీరిపై న్యాయపరమైన చర్యలేమీ తీసుకోకుండా దేశం విడిచిపెట్టివెళ్లమని ఆదేశాలు జారీచేసింరారు. కొన్ని రోజుల క్రితం రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించడంతో మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే.

విశాలాంధ్ర ప్రపంచం

అమెరికాతో చర్చిస్తేనే...





కిమ్ స్నేహ ప్రస్తావనపై మూన్

ప్యాంగ్యాంగ్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్.. దక్షిణ కొరియాకు స్నేహహస్తాన్ని అందించారు. ప్యాంగ్యాంగ్‌లో శిఖరాగ్ర సమావేశానికి రమ్మంటూ ఆ దేశ అధ్యక్షుడు మూన్ జే ఇన్‌ను ఆహ్వానించారు. తన సోదరి కిమ్ యో-జాంగ్ ద్వారా ఓ లేఖను దక్షిణ కొరియాకు పంపారు. వీలైనంత త్వరలో దక్షిణకొరియా అధ్యక్షునితో భేటీ కావాలని కిమ్ భావిస్తున్నారని, మీరు వీలుచూసుకొని మా దేశానికి రావాలని కిమ్ యో జాంగ్ ... మూన్ జే ఇన్‌కు తెలిపారు. తన సోదరుడి లేఖను ఆయనకు అందజేశారు. అయితే ఉత్తర కొరియా నుంచి తమకు ఆహ్వానం వచ్చిన విషయం వాస్తవమేనని దక్షిణ కొరియా ప్రతినిధి కిమ్-కెయిూమ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. భవిష్యత్ పరిస్థితుల దృష్ట్యా తగు చర్యలను చేపట్టి, ఆపై దీన్ని సాధ్యం చేద్దామని మూన్ అన్నట్టు తెలిపారు. దక్షిణ-ఉత్తర కొరియాల మధ్య స్నేహం కుదరాలంటే ముందుగా ఉత్తకొరియా.. అమెరికాతో చర్చలను పునరుద్ధరించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఏదిఏమైనా కిమ్ ఈ విధంగా మూన్‌కు స్నేహహస్తాన్ని అందించడం స్వాగతించదగ్గ పరిణామమని, నిర్మాణాత్మక చర్య అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శ్రీలంక స్థానిక ఎన్నికల్లో రాజపక్సె విజయకేతనం



కొలంబో: శ్రీలంకలో శనివారం జరిగిన స్థానిక ఎన్నికల్లో కోటి 50లక్షల మందికిపైగా ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించు కున్నారు. పాలక సంకీర్ణప్రభుత్వంలోని రెండు ప్రధాన భాగస్వామ్య పార్టీల మధ్య పోరు తీవ్రరూపం దాల్చినా పాలకపార్టీకి తీవ్రమైన పరీక్షగా మారాయి. శ్రీలంక మాజీ ప్రధానమంత్రి మహింద్ర రాజపక్సె శ్రీలంక పీపుల్స్ పార్టీ(ఎస్‌ఎల్‌పిపి) 45శాతం మెజారిటీ ఓట్లతో ముందంజలో ఉన్నట్లు స్థానిక మీడియా ప్రకటించింది. దేశవ్యాప్తంగా 340 స్థానిక సంస్థల్లో 8300 మంది ప్రతినిధులను ఎన్నుకోనున్నారు. తాజా ఫలితాల ప్రకారం రాజపక్సెకు చెందిన శ్రీలంక పీపుల్స్ పార్టీ(ఎస్‌ఎల్‌పిపి) లెక్కించిన 182 కౌన్సిళ్లకు 143స్థానాలు గెలుపొందగా విక్రమ్‌సింఘెకు చెందిన యునైటెడ్ నేషనల్ పార్టీ(యుఎన్‌పి) రెండస్థానంలో 17కౌన్సిల్ సీట్లకు పరిమితమైంది. ఎస్‌ఎల్‌పిపి అన్ని ప్రాంతాల్లో విజయానికి చేరువలో ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీలంక ఫ్రీడం పార్టీ (ఎస్‌ఎల్‌ఎఫ్‌పి) అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన, ప్రధానమంత్రి, యునైటెడ్ నేషనల్ పార్టీకి చెందిన రనిల్ విక్రమ్‌సింఘె ఇద్దరూ ఈ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినట్లు తెలుస్తోంది. యుఎన్‌పికి కేవలం 10కౌన్సిళ్లు మాత్రమే చేజిక్కుంచుకోగా తమిళపార్టీ అయిన తమిళ నేషనల్ అలయన్స్(టిఎన్‌ఏ) 10కౌన్సిల్‌సీట్లు లభించాయి. ఈ ఎన్నికల్లో ఓటర్ల ఓట్లు 65 శాతం దాటాలని భావిస్తున్నట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు. రాజపక్సె ఎక్కువ శాతం ఓట్లతో ఘన విజయాన్ని సాధించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2015 ఆగస్టులో ప్రస్తుత ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక ఎన్నికలు ఇవే..ఇప్పుడుజరిగే ఎన్నికల్లో అత్యంత ఘన విజయంతో మళ్లీపదవి చేపట్టేఅవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా రాజపక్సె మాట్లాడుతూ, తన విజయానికి కారణమైన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తమిళ్ నేషనల్ ఎలయన్స్ (టిఎన్‌ఏ) 10కౌన్సిల్‌సీట్లు కైవశంచేసుకుంది.

ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన సంస్కరణల ఎజెండా ముందుకు సాగాలంటే ఈ ఎన్నికల్లో విజయం సాధించడం కీలకంగా మారింది. కొత్త రాజ్యాంగాన్ని రూపొందిస్తామని, యుద్ధ నేరాలపై అంతర్జాతీయ దర్యాప్తుకు వెసులుబాటు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అవినీతి నిర్మూలన చర్యలు తీసుకుంటామని వాగ్దానం చేసింది. స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భాగస్వామ్య పార్టీలు పరస్పరం నిందారోపణలు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 340 స్థానిక సంస్థల్లో 8300మంది ప్రతినిధులను ఎన్నుకోనున్నారు.

ఇండోనేషియా చర్చిపై ఖడ్గంతో దాడి

పోలీసు కాల్పుల్లో దుండగుడికి గాయాలు



ఇండోనేషియా : ఇండోనేషియాలోని ఓ చర్చిపై 22 ఏళ్ల దుండగుడు ఖడ్గంతో దాడికి పాల్పడ్డాడు. ఏసుక్రీస్తు, మేరీమాత విగ్రహాలను ధ్వంసం చేశాడు. ఆదివారం ప్రార్థనల సందర్భంగా జరిగిన ఈ ఘటనలో జర్మన్ మతబోధకుడితో సహా నలుగురు గాయపడ్డారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఖడ్గంతో దాడికి తెగబడ్డ వ్యక్తిపై కాల్పులు జరిపారు. దాంతో అతను గాయపడ్డాడు. స్లేమన్ జిల్లా యోగ్యాకర్త ప్రాంతంలోని చర్చిపై జరిగిన ఈ దాడికిగల కారణాలు తెలియరాలేదు. దీనిపై కౌంటర్ టెర్రరిజం పోలీసులు దర్యాప్తు చేపట్టినట్టు స్థానిక పోలీసు డిటెక్టివ్ ఫెండీ తైమూర్ తెలిపారు. అక్కడున్న కెమెరా ఫుటేజిలో దుండగుడు చర్చి లోపల విగ్రహాలను ధ్వంసం చేస్తూ, చర్చిలో ఉన్న వారిపైకి దూసుకెళుతుండగా వారు ఆత్మరక్షణ కోసం అతనిపై పుస్తకాలను విసురుతున్నట్టు కనిపిస్తోంది. గాయపడిన వారిలో 81ఏళ్ల మతబోధకుడు కార్ల్ ఎడ్‌మండ్ ప్రయర్, ఓ పోలీసు అధికారి ఉన్నారని, వారికి ప్రాణాపాయం లేదని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పోలీసు కాల్పుల్లో గాయపడిన దుండగుడ్ని సులియోనోగా గుర్తించారు. అతడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మాట తప్పిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించిన పోలవరంకు కేంద్రం 90శాతం, రాష్ట్రం 10శాతం నిధులు ఖర్చు చేయవలసి ఉంది. అయితే తెలుగుదేశం మిత్రపక్షంగా ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసుకోవడానికి ఆ ఖర్చు మొత్తం కేంద్రం భరించడానికి అంగీకారం కుదిరింది. ఈ ప్రాజెక్టుకు పిఐపి పద్ధతితో నిధులు అందించడానికి అందులో భాగంగా నాబార్డ్ నుంచి దీర్ఘకాలిక రుణం ఇప్పించేందుకు కేంద్ర జలవనరుల శాఖ నిర్ణయించింది. గత ఏదాది మార్చి 15న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో ఇందుకు ఆమోదం కూడా లభించింది. అనంతరం జరిగిన సమావేశంలో నాబార్డ్‌నుంచి రూ.23,814 కోట్ల రుణం ఇప్పించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా ఏడాదికి ఎంత కేటాయిస్తారో నాబార్డ్ ఒక ప్రణాళిక అంద చేసింది. ఈ పద్ధతిలో 2016-17లో 2,414కోట్లు, 2018-19లో 9,000కోట్లు, 2019-20లో మరో 9,000కోట్లు ఇస్తామన్నది. ఈ ప్రణాళిక సారాంశం. ఇంత కచ్చితమైన ప్రణాళిక ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదానికి కేంద్రం విడుదల చేస్తున్న నిధులకు పొంతన ఉండడంలేదు.

పిఐపి పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబరు 31వ తేదీ నాటికి 12,915కోట్లు రూపాయలను ఖర్చు చేసింది. కాని కేంద్రం మాత్రం 7,779కోట్లు మాత్రమే విడుదల చేసింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తంలో ఇంకా 4,375 కోట్ల రూపాయలను కేంద్రం ఇవ్వవలసిఉంది. ఈ ఖర్చుల విషయంలో కేంద్ర,రాష్ట్ర అధికారుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా నిధుల విడుదలలో జాప్యం జరగడంతో పోలవరం పనులకు అంతరాయం కలుగుతున్నది. ఈ కారణంగా 2018-19 ఖరీఫ్ సీజన్‌కు కృష్ణా డెల్టాకు, ఏలేరు రిజర్వాయర్‌కు నీటిని అందచేయవలసి ఉండగా, అందే సూచనలు మాత్రం కన్పించడంలేదు. ఈ కారణంగా రైతులు ఒక సీజన్ నష్టపోవలసివచ్చింది. ఇదిలా ఉండగా కేంద్రం నిపుణుల బృందం పెట్టిన కొర్రి కూడా ఇందుకు కారణంగా చెప్పుకోవాలి. ఇసిఆర్‌ఎఫ్ డ్యామ్‌కోసం కాఫర్‌డ్యామ్ నిర్మాణం అవసరమేమిటన్నది ఒక కొర్రి కాగా పనులవల్ల ఏమాత్రం శ్రద్ధ చూపని కాంట్రాక్టర్‌ను మార్చాలన్న ప్రతిపాదనకు కేంద్ర బృందం వ్యతిరేకించింది. పనులు అసలు జరగడం లేదని తెలిసి కూడా కాంట్రాక్టర్‌ను ఎందుకు మార్చాలని నిలదీసింది. ఈ కొర్రీలలో కాఫర్‌డ్యామ్‌ను నిర్మించి వచ్చే ఏడాదికి సాగుకు నీరివ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది.

మార్కెట్ సెస్ మాఫీ..!

(మొదటిపేజీ తరువాయి)

హిమాచల్ ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, రాజస్థాన్, చత్తీస్‌గడ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో మార్కెట్ కమిటీ చట్టాలను సవరించటంతోపాటు పండ్లు, కూరగాయలకు మార్కెట్ సెస్ నుంచి మినహాయింపు లభించింది. అదేరీతిలో రాష్ట్రంలోనూ మినహాయింపునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఆదాయంలో సగం వీటి ద్వారానే..

రాష్ట్రంలో సుమారు 200 వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా, ఏటా కమిటీలకు రూ.500 కోట్లపైనే ఆదాయం సమకూరుతోంది. ఇందులో సగానికి పైగా ఆదాయం పండ్లు, కూరగాయల ద్వారానే లభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సెస్‌కు మినహాయింపు ఇస్తే మార్కెట్ కమిటీలు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోయే అవకాశం ఉంది. దీంతో జీఓను తీసుకురావటంలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఆ నిధులతోనే గ్రామాల్లో లింక్ రోడ్ల నిర్మాణంతోపాటు మార్కెటింగ్ యార్డులలో గోదాములు, కోల్డ్ స్టోరేజీలను ప్రభుత్వం నిర్మిస్తోంది. సెస్ మాఫీ వల్ల కమిటీలు ఆదాయాన్ని కోల్పోతే నిర్వహణ పరిస్థితి ఏంటని అధికారులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో పండ్లు, కూరగాయలకు మాత్రమే సెస్ నుంచి మినహాయింపు ఇచ్చే ఆలోచన ఉన్నందున ఆదాయానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. పండ్లు, కూరగాయలు అమ్ముకునే వారు ఎక్కువగా చిన్న రైతులే ఉన్నందున వారికి ఉపశమనం కల్పించే ఉద్దేశంతోనే నీతి ఆయోగ్ ఈ ప్రతిపాదన చేసినట్లు సమాచారం. అయితే ఎగుమతి అయ్యే పండ్లు, కూరగాయలపై మాత్రం యూజర్ చార్జీలను వసూలు చేయాలనే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. యూజర్ చార్జీల ద్వారా వచ్చే ఆదాయంతో మార్కెట్ కమిటీలను నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కొందరు అధికారులు చెబుతున్నారు.

రాయలసీమ జిల్లాలపై ప్రభావం

సెస్ మినహాయింపు వల్ల రాయలసీమ జిల్లాల్లోని మార్కెట్ కమిటీలే పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోయే అవకాశాలు ఉన్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయా జిల్లాల్లో పండ్లు, కూరగాయల మార్కెట్‌లే ఎక్కువగా ఉన్నాయి. అలాంటి మార్కెట్‌ల నుంచి ఇతర రాష్ట్రాలకు సరుకును ఎగుమతి చేసే సమయంలో విలువ ఆధారంగా యూజర్ చార్జీలను వసూలు చేసుకునే అవకాశం కల్పించాలనే అంశం కూడా ప్రతిపాదనలో ఉంది. పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి పండ్లు, కూరగాయలను కొనుగోలు చేస్తారని, అలాంటపుడు సెస్‌ను వసూలు చేసేలా జీవోలో పొందుపరిచేలా చర్యలు చేపట్టాలని, దానివల్ల మార్కెట్ యార్డులలో రైతులకు సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని మార్కెటింగ్ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

ఐదేళ్ల క్రితమే ప్రతిపాదన

మార్కెట్ కమిటీలు పండ్లు, కూరగాయలపై వసూలు చేసే సెస్ మినహాయింపు ప్రతిపాదన ఎనిమిదేళ్ల క్రితమే కార్యరూపం దాల్చింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న శరద్ పవార్ దేశంలో ఎక్కడైనా ఒక్కచోటే సెస్ వసూలు చేసే విధానాన్ని తీసుకురావాలని భావించారు. అందులో భాగంగానే మహారాష్ట్ర సహకార శాఖ మంత్రి హర్షవర్ధన్ పాటిల్ చైర్మన్‌గా 11 మంది సభ్యులతో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో అసోం, ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు సభ్యులుగా ఉన్నారు. కమిటీ తొమ్మిదిసార్లు సమావేశమవ్వగా, చిట్ట చివరి సమావేశం రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీల చట్టాన్ని సవరణ చేయటంతోపాటు పండ్లు, కూరగాయలపై సెస్ మినహాయింపుపై కమిటీ నివేదిక కూడా ఇచ్చింది. అదే నివేదికను ఇపుడు ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది.

ఇక తెగదెంపులే?

(మొదటిపేజీ తరువాయి)

వేస్తోందని ఆయన మండిపడ్డారు.. బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కి ఎక్కడా అన్యాయం జరగలేదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ప్రభుత్వం సరైన డిపిఆర్‌లు సమర్పించకపోవడం వల్లనే అమరావతికి నిధులు కేటాయించలేదని ఆయన వివరణ ఇచ్చారు. మరో కీలకమైన ప్రకటన కూడా హరిబాబు చేయడంతో తెలుగుదేశం పార్టీ మరింత ఆలోచనలో పడింది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో175 నియోజకవర్గాల్లో పోటీచేస్తామని కూడా ఆయన చేసిన ప్రకటన తెలుగుదేశంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ అవినీతి కార్యక్రమాలపై పోరాటం చేస్తామని హరిబాబు చేసిన ప్రకటన కూడా పెద్ద దుమారం లేపింది. ఇప్పటి వరకూ ా పార్టీ నేతలు సోమువీర్రాజు, విష్ణుకుమార్‌రాజు, పురందేశ్వరిలు కూడా తెలుగుదేశం పార్టీపై ఘాటుగానే విమర్శలు చేశారు. దీనిపై తెలుగుదేశం నాయకత్వం కొంత స్పందించే సాహసం చేయబోతే పార్టీ అధినేత చంద్రబాబు వారించారు. కానీ ఇపుడు పరిస్థితులు శృతిమించాయి. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి కాకుండా చేసేది తామేనని తెలుగుదేశం అబాండం వేసే ప్రమాదం ఉందని బీజేపీ శంకిస్తున్నది. అందుకే అగ్రనేతల అనుమతి తీసుకొని హరిబాబు 27 పేజీలతో కూడిన వివరాలు మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకూ కేంద్రం చేసిన సహాయం ఎంత, ఏయే అంశాల కింద సహాయం అందించింది అనే వివరాలను ఆయన సమగ్రంగా వివరించడంతో తెలుగుదేశం అధినాయకత్వానికి మింగుడు పడటం లేదు. దీంతో మైత్రీబంధం తెగేవరకు వచ్చినట్లు తెలుస్తోంది.

స్వపక్షంలోనే విపక్షం!

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి ఇపుడు కొత్త సమస్యలు వచ్చిపడుతున్నాయి. స్వపక్షంంలోనే విపక్షం తయారయింది. బీజేపీ నేతలు చేసే విమర్శలను తిప్పికొట్టే విషయంలో తెలుగుదేశం పార్టీ కేంద్ర మంత్రులు, ఎంపీలు సరైన పాత్ర పోషించడం లేదని ముఖ్యమంత్రి అభిప్రాయ పడుతున్నారు. శనివారం నాడు హరిబాబు చేసిన ప్రకటన తర్వాత ఆదివారం నాడుముఖ్యమంత్రి అందుబాటులో ఉన్న ఎంపీలను ఆహ్వానించి, భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. కానీ దీనికి కొంత మంది ఎంపీలు అనుకున్నంతగా స్పందించలదని తెలిసింది. దీంతో ఇద్దరు ఎంపీలతోనే ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ఎంపీలు గల్లాజయదేవ్,రామ్మోహన్‌నాయుడులు మాత్రమే ముఖ్యమంత్రితో సమావేశం అయ్యారు. అందుబాటులో ఇంకో నలుగురు ఎంపీలు ఉన్నావారుముఖ్యమంత్రి సమీక్షకు వెళ్లలేదు. కేంద్రంలోని ఒక మంత్రి పట్ల కూడా ముఖ్యమంత్రి అసహసనంగా ఉన్నట్లు తెలుస్తోంది. సదరు మంత్రి పట్ల ముఖ్యమంత్రి ఆరంభం నుంచీ కూడా అసంతృప్తిగానే ఉన్నారని,ఆయనకు అనుకూలంగా మరో ఐదుగురు ఎంపీలు కూడా ఉన్నారని వారు కూడా కేంద్రంలో సరైన పాత్ర పోషించలేదనే అభిప్రాయం ముఖ్యమంత్రిలో ఉంది. శనివారంనాడు కంభంపాటి హరిబాబు ఢిల్లీలో మీడియాతో సమావేశం పెట్టి తెలుగుదేశం పార్టీపై నిందలు వేసినా సరే కేంద్ర మంత్రి గానీ, ఎంపీలు గానీ ఏమాత్రం స్పందించలేదని అందుకే ఆదివారం నాడు స్వయంగా తను రంగంలోకి దిగాల్సి వచ్చిందని కూడా ముఖ్యమంత్రి ఇద్దరు ఎంపీల దగ్గర ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వీరు కాకుండా మరోముగ్గురు నలుగురు ఎంపీలు బీజేపీతో సన్నిహితసంబంధాలు కొనసాగిస్తున్నారని,అందుకే వారు కూడా పార్లమెంటులో సరైన పాత్ర పోషించడం లేదనే అంశాన్ని కూడా ముఖ్యమంత్రి గుర్తించారు. దీంతో ఇపుడు బీజేపీతో తెగదెంపులు చేసుకోవడమా, కలిసుండ పోరాటం కొనసాగించడమా అన్నది ఇంకా తేల్చుకోలేకపోతున్నారు. ఇద్దరు ఎంపీలు కూడా ముఖ్యమంత్రి దగ్గర మాత్రరా పార్టీకి దూరమైతేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే దీనికి ముఖ్యమంత్రి చూద్దాం..అనే సమాధానం ఇచ్చారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

మొత్తం మీద బీజేపీ-టీడీపీ ల మైత్రి బంధం ఇంకా ఎక్కువ కాలం కొనసాగేలా లేదు. బీజేపీ వేగం పెంచింది. నేరాన్ని తమపై నెట్టే యత్నం చంద్రబాబు చేస్తున్నారనే అంశాన్ని గుర్తించిన ఆ పార్టీ అధినాయకత్వం ముందుగానే చంద్రబాబు కోర్టులోకి బాల్‌ను నెట్టేసింది. వచ్చే ఎన్నికల్లో అన్ని సీట్లలోనూ పోటీచేస్తామని కూడా కాషాయ పార్టీ ప్రకటించిందంటే తెలుగుదేశం పార్టీ అవసరం తమకు లేదనే సంకేతాలు ఇచ్చినట్లేనని భావిస్తున్నారు.

వీడుతున్న 'గర్భిణి' మృతి మిస్టరీ

కీలక నిందితులు అరెస్టు

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : కొండాపూర్ బొటానికల్ గార్డెన్ సమీపంలో వెలుగుచూసిన గర్భిణి హత్య కేసు మిస్టరీ వీడుతోంది. పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ద్వారా కీలక నిందితులను గుర్తించారు. మృతదేహాన్ని బైక్‌పై తీసుకువచ్చి పడేశారని గుర్తించిన పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బొటానికల్ గార్డెన్ వద్ద మృతదేహాన్ని వడేసిన ద్విచక్ర వాహనం, మసీద్ బండ వద్ద ఉన్న కెమెరాలో నిందితుల దృశ్యాలు చిక్కడంతో కేసు మిస్టరీ వీడుతోంది. దర్యాప్తులో మృతురాలు అసోం వాసి అని తెలియడంతో కొండాపూర్‌లోని సిద్ధిఖ్ నగర్, అంజయ్య నగర్‌లో నివాసముంటున్న అస్సాం వాసులను పోలీసులు విచారిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గతనెల 30న మహిళను చంపి ముక్కలు ముక్కలుగా నరికి గోనె సంచుల్లో కుక్కి బొటానికల్ గార్డెన్ సమీపంలో పడేశారు. గోనె సంచుల నుంచి దుర్వాసన రావడంతో బొటానికల్ గార్డెన్‌లో వాచ్‌మన్ చూసి సమాచారం అందించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. కీలక ఆనవాళ్లను గుర్తించారు. బొటానకల్ గార్డెన్ రోడ్డులో ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీని నిశితంగా పరిశీలించారు. చనిపోయే సమయానికి ఎనిమిది నెలల గర్భిణిగా ఉన్న మృతురాలి కడుపులో మగ శిశువు ఉన్నట్లు గుర్తించారు. మహిళ ఎవరనేది చెప్పిన వారికి లక్ష రూపాయల నజరానా ఇస్తామంటూ సైబరాబాద్ పోలీసులు ప్రకటించారు. 12 రోజుల తర్వాత సీసీటీవీ కెమెరాల్లో ఏపీ 10 ఏఎల్ 9947 నంబర్ ఉన్న యమహాపై ఇద్దరు వ్యక్తులు వచ్చి బొటానికల్ గార్డెన్ వద్ద గోనె సంచులు పడేసినట్లు గుర్తించారు. నెంబరు ఆధారంగా ఆ వాహనం బొద్దనగర్‌లోని ఆనంద్ కుటీర్‌కు చెందిన గర్దే విజయ్‌కుమార్‌దని గుర్తించి, అతనిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మీ చిత్తశుద్ధి ఏమైంది?

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే విదిలించింది. కేవలం ఏడాదికి రూ.50 కోట్ల ముష్టితో ఒక జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమా?

పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి 2019 కల్లా పూర్తిచేస్తామని చెప్పారు. 2014-15 అంచనాల ప్రకారం రూ.54 వేల కోట్లు ఖర్చయ్యే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇప్పటికి రూ.4,662 కోట్లు ఇచ్చిందని మీరే చెబుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో పోలవరానికి కేటాయించిన నిధులెన్ని? అరకొర నిధులు కేటాయిస్తే 2019 కల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎలా పూర్తవుతుంది? నిర్వాసితుల పునరావాసం కింద రూ.33 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా, కనీసం ఒక్క రూపాయైనా చెల్లించారా?

కేంద్ర రైల్వేమంత్రి సురేష్‌ప్రభు రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికైన సమయంలో విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ ఇస్తామన్నారు. కాని నేటివరకు విశాఖ రైల్వేజోన్ ఊసేలేదు. ఇది రాష్ట్ర ప్రజల ఆశలపై నీళ్ళు చల్లడంకాదా? విశాఖ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మీరు ఓటర్లను మోసం చేయడం కాదా?

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారు. దీని విషయంలో కనీసం ప్రస్తావనే లేకపోవడం రాయలసీమ ప్రజలను మోసగించడం కాదా?

రాష్ట్రంలో కేంద్రీయ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తామన్న మీ ప్రభుత్వ వాగ్దానాలు ఏ మేరకు అమలు చేశారు? బడ్జెట్‌లో వాటి కోసం అరకొర నిధులు కేటాయించడం నిజం కాదా? రూ.11,670 కోట్ల నిధులు అవసరమవ్వగా, కేవలం రూ.520 కోట్లు ఇస్తే సరిపోతాయా? ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిలో రాజధాని నిర్మాణం, రాజ్‌భవన్, హైకోర్టు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలకు రు.42,935 కోట్లు అవసరమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా, కేంద్రం రు.1,500 కోట్లు మాత్రమే విదిల్చింది. ప్రధాని మోడీ ఇచ్చిన ముంత మట్టి, చెంబుడు నీళ్లతో రాజధాని ఏర్పడుతుందా?

ప్రకాశంజిల్లా దుగ్గిరాజుపట్నం లేదా రామాయపట్నంలో కొత్త సీపోర్టు, చెన్నై-వైజాగ్ కారిడార్, అనంతపురం జిల్లాను చేర్చి చెన్నై-బెంగళూరు కారిడార్ ఏర్పాటుపై ప్రాథమికమైన చర్యలు కూడా లేకపోవడం నిజంకాదా? రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు చేసేవారికి రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తామన్న కేంద్రం హామీలు ఏ మేరకు అమలు చేశారు? ఇప్పటివరకు రాష్ట్రంలో కొత్తగా ఎన్ని పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి?

కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగు సంవత్సరాల కాలం పూర్తవుతున్నా విభజన హామీలను అటకెక్కించడం వాస్తవం కాదా? ఎంతో ఘనంగా ప్రకటించిన ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ అమలు ఏ మేరకు జరిగింది?

కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో మాట్లాడుతూ ఏపీ విభజన హామీల అమలు విషయమై ఆయా శాఖలతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. అర్ధాంతరంగా విభజించబడిన ఒక రాష్ట్రం పరిస్థితి గత 44 నెలలుగా ఇంకా చర్చల స్థాయిలోనే ఉందని చెప్పడం అతిశయోక్తి కాదా? ఇది ఏపీకి కేంద్రం చేస్తున్న ద్రోహం కాదా? వాస్తవాలను మరుగుపరచే విధంగా మీరు కాకి లెక్కలు ప్రకటించడాన్ని మోసంకాక ఇంకేమనాలి?

ఏపీ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా 10 ఏళ్ళపాటు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది. ఆ మోసానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్రం నుంచి గెలిచిన ఇద్దరు బీజేపీ పార్లమెంటు సభ్యులు, నలుగురు ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామాలు చేయడం ద్వారా రాజకీయాలలో విలువలు కాపాడాలని కోరుతున్నాను.

విదేశాల్లో మెడిసిన్!

(మొదటిపేజీ తరువాయి)

అధికారి ఒకరు చెప్పారు. విదేశాల్లో మెడిసిన్ చదవాలని కోరుకున్న విద్యార్థులు ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్(ఎఫ్‌ఎంజీఈ)లో అర్హత సాధించాలని, 12 నుంచి 15శాతం మంది దీనికి వెళుతున్నారని ఆ అధికారి తెలిపారు. ఎఫ్‌ఎంజీఈని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తుంది. వాస్తవంగా విదేశాల్లో మెడిసిన్ పూర్తి చేసి స్వదేశానికి తిరిగి వచ్చిన గ్రాడ్యుయేట్లు ఎఫ్‌ఎంజీఈలో అర్హత సాధించాల్సి ఉంటుంది. లేకపోతే భారత్‌లో ప్రాక్టీస్‌కు ఆ డాక్టర్ల పేర్లు రిజిస్ట్రేషన్ చేయరు. ఇలాంటి కేసుల్లో అంటే విదేశాల్లో మెడిసిన్ చదివి ఇక్కడ రిజిస్ట్రేషన్ కాకుండా ప్రాక్టీస్ చేయడం చట్టవిరుద్ధం. ఇది చాలా ప్రమాదకరం. అందుకే విదేశీ వర్సిటీల్లో మెడిసిన్ చదివిన విద్యార్థులలో పోటీతత్వం పెంచేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నట్లు ఆ అధికారి తెలిపారు. ఇప్పటి దాకా అమలులో ఉన్న విధానం ఏమిటంటే...భారతదేశం వెలుపల ఏ మెడికల్ కాలేజీలో ప్రవేశం కావాలన్నా మెడికల్ విద్యార్థి ఎంసీఐ నుంచి సర్టిఫికెట్ తీసుకోవాల్సిందే. ప్రతి ఏడాది ఏడు వేల మంది విద్యార్థుల వైద్య విద్యకోసం విదేశాలకు వెళుతున్నారు. అందులో ఎక్కువ మంది చైనా, రష్యా వెళుతున్నారు. గడచిన ఐదేళ్లలో విదేశాల్లో చదివి... ఎఫ్‌ఎంజీఈ పొందిన విద్యార్థుల శాతం 13 నుంచి 26.5గా నమోదైంది. ఇంతపెద్దమొత్తంలో విద్యార్థులు విదేశాలకు వెళ్లడం ఆందోళనకరమే. విద్యార్థులు పెద్దమొత్తంలో డబ్బు వృధా చేసుకుంటున్నారు. స్వదేశానికి తిరిగి వచ్చిన వైద్య విద్యార్థులు కనీసం భారత్‌లో తమ సేవలు అందించడం లేదని ఆ అధికారి వివరించారు.

ఉద్యమం ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

చలో అసెంబ్లీని చేపట్టాలని కూడా నిర్ణయించారు. అగ్రిగోల్డ్ ఆర్థిక కుంభకోణంతో రాష్ట్రంలో సుమారు 150 మందికిపైగా ఏజెంట్లు, ఖాతాదారులు ఆత్మహత్యకు పాల్పడగా, కొందరు గుండెపోటుతో మృతి చెందారు. మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని మూడేళ్లగా అసోసియేషన్ చేపట్టిన ఆందోళనకు ప్రభుత్వం దిగి వచ్చింది. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింపునకు రెండు దశలలో రూ.5 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే అందుకు కొన్ని నిబంధనలు విధించటంతో గత ఏడాది డిసెంబర్‌లో రెండు రోజులపాటు బాధిత కుటుంబాలు 30 గంటల సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ నేపధ్యంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 2న జరిగిన మంత్రివర్గ సమావేశంలో మృతి చెందిన అగ్రిబాధితుల కుటుంబాలలో తొలి విడతగా 96 మందికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు తీర్మానం చేశారు. ఒకటీ రెండు రోజులలో ఇందుకు సంబంధించిన జీఓను కూడా ప్రభుత్వం విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసోసియేషన్ పలు దఫాలుగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రరూపం దాల్చుతున్న క్రమంలో ప్రభుత్వంలో కదలిక వస్తుండటంతో, అసోసియేషన్ ఈసారి ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టింది.

దేశంలో ఇదే పెద్ద ఉద్యమం : ముప్పాళ్ల

అగ్రిగోల్డ్ బాధితులు చేపడుతున్న ఉద్యమం దేశంలోనే పెద్దదని, సుదీర్ఘకాలంగా నిర్వహించిన ఉద్యమం మరొకటిలేదని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మూడేళ్ల నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాల్లో ఉద్యమం కొనసాగుతోందన్నారు. గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అగ్రి బాధితులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నేటి వరకు అమలు కాలేదన్నారు. దీంతో గత సంవత్సరం ఆగస్టు 16 నుంచి నెల రోజులపాటు బాధితుల చైతన్య యాత్ర చేపట్టామన్నారు. యాత్ర జరుగుతున్న సమయంలోనే ప్రభుత్వం మృతి చెందిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించేందుకు రూ.5 కోట్లను కేటాయించిందన్నారు. అదే స్ఫూర్తితో ఇపుడు ఇంటింటికీ వెళ్లి బాధితులను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. 96 మంది బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టటంతో, తాము దాచుకున్న సొమ్ము తిరిగి వస్తుందన్న ఆశ ఖాతాదారులలో పెరిగిందన్నారు. దీంతో అసోసియేషన్‌తో కలిసి ఉద్యమంలో పాల్గొనేందుకు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉద్యమం ఊపందకుంటోందని, ఈ నేపథ్యంలో బాధితులకు అసలు చెల్లించేందుకు బడ్జెట్‌లో రూ.4 కోట్లను కేటాయించాలని ఆయన డిమాండు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బీ విశ్వనాథ్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈవీ నాయుడు, ప్రధానన కార్యదర్శి వీ తిరుపతిరావు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, కోశాధికారి జీ శేషగిరిరావు, మహిళా కార్యదర్శి ఎస్ నాగలక్ష్మీ తదితరులు అగ్రిగోల్డ్ ఉద్యమంలో బాధితులను భాగస్వాములను చేసేందుకు మూడేళ్లగా కుటుంబాలను వదిలి మరీ ఉద్యమిస్తున్నారని తెలిపారు. బాధితులకు చివరి పైసా ఇప్పించేంత వరకు అసోసియేషన్ పోరాటం చేస్తుందని ముప్పాళ్ల వివరించారు.

రాజధాని డిజైన్లు

(మొదటిపేజీ తరువాయి)

చూపిస్తామని మంత్రివర్గ సమావేశంలో సీఎం తెలి పారు. గడువు ప్రకారం మార్పులు, చేర్పులతో కూడిన డిజైన్లు జనవరి రెండో వారంలో ఫోస్టర్స్ సంస్థ ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. అయితే గడువు ముగిసినప్పటికీ డిజైన్లు రాకపోవడంతో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) అధికారులు వాటికోసం ఎదురు చూస్తున్నారు. పరిపాలన నగరంలో ఆయా ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు కేటాయించిన స్థలం, కొలతల ఆధారంగా తుది డిజైన్లను రూపొందించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డిజైన్లు తమకు అందిన తర్వాత ప్రభుత్వ నిబంధనల మేరకు ప్లాన్లను రూపొందించాల్సి ఉంది. డిజైన్లపై ఆయా రంగాలకు చెందిన నిపుణుల అభిప్రాయాలను కూడా సేకరిస్తామన్నారు. డిజైన్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాతే టెండర్ల ప్రక్రియను చేపడతామన్నారు. అనంతరం ఎంపికైన నిర్మాణ సంస్థలు ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు పూర్తి చేసే విధంగా కార్యాచరణ చేపడతామన్నారు. కాగా శాసనసభ, మండలితోపాటు హైకోర్టు డిజైన్లను ఖరారు చేసినా నిర్దేశించిన కొలతల్లో తుది డిజైన్లను రూపొందించడానికి 8 నెలల నుంచి ఏడాది సమయం పడుతుందని నిర్మాణ రంగానికి చెందిన నిపుణులు పేర్కొంటున్నారు. టవర్ ఆకృతి, స్థూపాకారంలో నిర్మాణాలు కొంచెం కష్టంతో కూడుకున్నవని, అనుకున్న విధంగా రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేయడం కష్టమేనని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలైన రాజ్‌భవన్, సీఎం కార్యాలయం, సచివాలయం డిజైన్లను ప్రభుత్వం ఇంకా ఖరారు చేయలేదు. ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే జాప్యం చేస్తుందనే విమర్శలూ లేకపోలేదు. ఎన్నికల ముందు వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టి, మళ్లీ తమకే అధికారాన్ని అప్పగిస్తే ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తామని అధికారపార్టీ చెప్పడం ఖాయమంటున్నారు. కాగా ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవసరమయ్యే నిధులను కేంద్రం ఇవ్వకుండా ప్రపంచబ్యాంకు నుంచి రుణాన్ని ఇప్పిస్తామని చెప్పడంతో రాజధాని నిర్మాణానికయ్యే అప్పును రాష్ట్రం ఏవిధంగా తీరుస్తుందనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. డిజైన్లు మరింత ఆలస్యమైతే సార్వత్రిక ఎన్నికల తర్వాతే నిర్మాణానికి నోచుకోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



రాజధాని భూములు మత సంస్థలకు కేటాయించొద్దు : హేతువాదులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని భూములను మత సంస్థలకు, బాబాలకు కేటాయించొద్దని హేతువాద సంస్థ పూర్వకార్యదర్శి, దళిత నేత కత్తి పద్మారావు పేర్కొన్నారు.గుంటూరు జిల్లా మంగళగిరి దగ్గర గల నిడమర్రు చార్వాక ఆశ్రమంలో 26వ జాతీయ నాస్తిక మేళా సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా 'నేటి రాజ్యంలో మతోన్మాద ప్రచారం' అంశంపై ఆయన ప్రసంగిస్తూ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోడీ, చంద్రబాబు దేశ ద్రోహులని పేర్కొన్నారు.హిందూత్వం, మనువాదం పేరుతో దళితులపైనా, ప్రశ్నించే వారిపైనా దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. దేశంలో ఒక రాచరిక పరిపాలన కొనసాగుతోందని చెప్పారు. బాబాలు, సన్యాసులు మంత్రులుగా వున్నారని ఎద్దేవా చేశారు.భగవద్గీతను జాతీయ గ్రంథాలయంగాను, విశ్వ విద్యాలయాల్లో జ్యోతిష్యం, వాస్తు వంటివి పాఠ్యాంశాలుగా పెడుతున్నారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక యోగాలంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. 'జాషువా సాహిత్యం, హేతువాద భావజాలం' అంశంపై కోదాడ ప్రభుత్వ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ చరిత్రలో వేమన నుంచి గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, పెరియార్, త్రిపురనేని తదితర కవులు హేతువాద సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు.సభలో విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.వరలక్ష్మి, కార్మిక సంఘం నాయకులు జె.కిశోర్‌బాబు ప్రసంగించారు. నాస్తిక సమాజం కార్యకలాపాలపై కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్ నివేదిక ద్వారా వివరించారు.సమాజం అధ్యక్షులు కె.అయ్యన్న, బి.సుధాకర్, ఎంఎస్ బుద్ధ, గృహలక్ష్మి, జె.సత్యనారాయణ, పలువురు నాస్తిక సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.



సుప్రీం తీర్పు అమలు కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమాన పనికి సమాన వేతనమివ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కోసం కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని ఇఫ్ట్యూ జాతీయ కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విజయవాడ స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఆదివారం ఇఫ్ట్యూ ఆధ్వర్యాన రాష్ట్ర సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం చూపడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. సూచించారు.రెండేళ్లు గడుస్తున్నా సుప్రీం తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయట్లేదని వాపోయారు.ఇఫ్ట్యూ రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వమూ సుప్రీం తీర్పును అమలు చేయకుండా, కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఎద్దేవా చేశారు.ఈ సదస్సులో ఇఫ్ట్యూ రాష్ట్ర నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, ఎన్.ఫణి, ఆర్.మోహన్, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు ఎ.కృష్ణ ఏసు, జే.రమేష్, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. సదస్సులో ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సమావేశంలో తీర్మానించారు.

స్పీడ్ అందుకున్న విమాన సర్వీసులు

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రంలో విమానాశ్రయాలను అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, డొమెస్టిక్ సర్వీసుల పెంపు వంటి బాధ్యతలను ఈ అథారిటీకి అప్పగిస్తారు. పుట్టపర్తిలో ఫ్లయింగ్ అకాడమీని కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రం పారిశ్రామిక, పర్యాటక, ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, వైద్యం తదితర రంగాలలో బహుముఖంగా అభివృద్ధి చెందడానికి విమానాశ్రయల అభివృద్ధి, విమాన సర్వీసులు అందుబాటులో ఉంచడం అత్యవసరం. ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతి అంతర్జాతీయ స్థాయిలో మహానగరంగా రూపుదిద్దుకోవాలంటే విమాన సర్వీసులు అందుబాటులో ఉండాలి. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయాల అభివృద్ధిపై, విమాన సర్వీసులు పెంపుదలపై దృష్టి పెట్టింది. అంతేకాకుండా రాష్ట్రంలో పెరుగుతున్న విమాన ప్రయాణికులను, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాకో విమానాశ్రయం ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాన్ని విమానయాన హబ్‌గా రూపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న క్రమంలో రోజురోజుకు విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతోరది. దాంతో రాష్ట్రంలో వీలైనన్ని విమాన సర్వీసులను నడపడం ద్వారా ఎయిర్ కనెక్టివిటీ పెంచడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. నిర్దిష్ట కాలవ్యవధిలో రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, విమానయాన సర్వీసుల పెంపు జరిగేలా ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. రాజధాని అమరావతికి 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న గన్నవరం విమానాశ్రయం నుంచి జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఇక్కడ నుంచి దేశంలోని అన్ని నగరాలకు విమాన సర్వీసులు అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్‌ని అందుబాటులోకి రావడంతో అంతర్జాతీయ విమానాశ్రయ హోదా లభించింది. గన్నవరం – విశాఖపట్నం, గన్నవరం –



హైదరాబాద్, గన్నవరం – తిరుపతి, గన్నవరం – కడప మధ్య సర్వీసులు పెంచే ఆలోచన కూడా ఉంది. రాష్ట్రం నుంచి అన్ని విమానాలు 90 నుంచి 95 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సర్వీసులను పెంచవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. రాజధాని నుంచి దేశంలోని ఇతర నగరాలకు కనెక్టివిటీ పెంచడం కోసం కేంద్రంపై వత్తిడి పెంచాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని విమానాశ్రయాలను ప్రాంతీయంగా అనుసంధానం చేస్తారు. ఈ మేరకు ఎయిర్ పోర్ట్ అథారిటీ – పౌర విమానయాన శాఖ –ప్రభుత్వాల మధ్య ఒప్పందం కూడా జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో విమానాశ్రయాల మధ్య తక్కువ ఛార్జీలతో ప్రాంతీయ పౌర విమాన సర్వీసులు పెరుగుతాయి. మరిన్ని విమాన సర్వీసులను నడపడం ద్వారా రీజనల్ కనెక్టివిటీ పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విజయవాడ–కడప మార్గంలో రోజుకు రెండు పర్యాయాలు, విజయవాడ–పుట్టపర్తి మార్గంలో రోజుకు ఒక పర్యాయం చొప్పున విమాన సర్వీసులు నడిపే ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్–విజయవాడ–హైదరాబాద్ మార్గంలో మరిన్ని విమాన సర్వీసులను నడపడానికి ఎయిరిండియా, జెట్ ఎయిర్‌వేస్, ఇండిగో వంటి విమానయాన సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. తిరుపతి విమానాశ్రయం నుంచి త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తాయి. విజయవాడ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా దక్కిన నేపథ్యంలో కోడ్–ఇ తరహా ఎయిర్ క్రాఫ్టులు నడిపేందుకు వీలుగా ప్రస్తుత రన్‌వే విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే మంజూరైన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాల నిర్మాణాన్ని రెండున్నరేళ్లలో పూర్తిచేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. కుప్పం, దొనకొండ, నాగార్జునసాగర్, పుట్టపర్తిలలో ప్రస్తుతం ఉన్న బ్రౌన్‌ఫీల్డు ఎయిర్‌పోర్టుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దొనకొండ విమానాశ్రయానికి సంబంధించి చిన్నతరహా విమానాల రాకపోకలకు వీలుగా ప్రస్తుతం ఉన్న రన్‌వేను విస్తరించడానికి అనుమతి కోరుతూ ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు లేఖ రాశారు. విజయనగరం జిల్లా భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ఇప్పటికే అన్నిరకాల పర్యావరణ అనుమతులు లభించాయి. 280.4 ఎకరాల ప్రైవేట్ భూములు సహా మొత్తం 493ఎకరాల భూమి ఈ విమానాశ్రయానికి సమకూర్చవలసి ఉంది. దగదర్తి విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి మొత్తం 1399 ఎకరాల భూమిలో 1095 ఎకరాల స్థలం స్వాధీనం చేశారు. ఓర్వకల్లు విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన అన్ని పర్యావరణ అనుమతులు లభించాయి. ఈ విధంగా విమానాశ్రయాలు, సర్వీసులు పెంచడం ద్వారా పౌరవిమానయాన రంగంలో 2022 నాటికి రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చాలన్న ధ్యేయంతో ప్రభుత్వం ఉంది. ఎంపిక చేసిన పట్టణాలకు విమాన సర్వీసులు అందుబాటులో ఉంచడం ద్వారా సమతౌల్య అభివృద్ధికి మార్గం ఏర్పరచనున్నారు. రాజమండ్రిలోని మధురపూడి విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రన్‌వేని విస్తరిస్తున్నారు. ఇందుకోసం 850 ఎకరాలు సేకరించి, ప్రస్తుతం ఉన్న 1750 మీటర్ల రన్‌వేను 3,165 మీటర్లకు పొడిగిస్తున్నారు. రూ.181 కోట్ల ఖర్చుతో ఈ రన్‌వే విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ విమానాశ్రయానికి 3 అదనపు పార్కింగ్ బేస్‌కు సంబం ధించిన యాప్రాన్ నిర్మాణం పూర్తయింది. హైదరాబాద్‌కు రెండు, బెంగళూరు, చెన్నైలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 సర్వీసులు నడపనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతానికి ఇక్కడ స్పైస్ జెట్, ట్రూజెట్‌లు ఒక్కొక్కటి, జెట్ ఎయిర్ వేస్ రెండు సర్వీసులు మొత్తం 4 సర్వీసులు అందుబాటులో ఉన్నాయి



సమాజ నిర్మాతలుగా 'జడ్జీలు' మారాలి

- సుప్రీంకోర్టు జడ్జి రంజన్ గొగాయ్
- బెజవాడ బార్ అసోసియేషన్ 111వ వార్షికోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమాజ నిర్మాతలుగా జడ్జీలు మారాలని, సామాజిక రుగ్మతల్ని తొలగించేందుకు క్రియాశీలక భూమిక పోషించాలని సుప్రీంకోర్టు జడ్జి రంజన్ గొగాయ్ సూచించారు.విజయవాడ ఏ–1 కన్వెన్షన్ సెంటరు హాలులో ఆదివారం బెజవాడ బార్ అసోసియేషన్ 111వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు.దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుప్రీంకోర్టు జడ్జి మాట్లాడుతూ, సామాజిక సేవలో బార్ అసోసియేషన్లు భాగస్వామ్యం కావాలని కోరారు.గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టపరంగా ఎదుర్కొంటున్న సమస్యల్ని గుర్తించి, వారికి దేశ వ్యాప్తంగా బార్ అసోసియేషన్లు సహకరించాలని కోరారు.బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.

తెలుగులో న్యాయపరిపాలన కొనసాగించాలి: సుప్రీంకోర్టు జడ్జి వెంకట రమణ

తెలుగులో న్యాయపరిపాలన కొనసాగించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు జడ్జి ఎల్.వెంకట రమణ కోరారు.గ్రామీణ ప్రాంతాల నుంచి ఎన్నో న్యాయ సమస్యలు కోర్టులకు వస్తున్నాయని వివరించారు. న్యాయపరిపాలన తెలుగులో లేనందున గ్రామీణులు అసౌకర్యానికి గురవుతున్నారని వాపోయారు.తెలుగుభాష అభివృద్ధితోపాటు గ్రామీణుల కోసం న్యాయపరిపాలన్ని తెలుగులో కొనసాగించాల్సిన ఆవశ్యకత నెలకొందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ అంశాన్ని వేదికపై వున్న హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీలు పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.ఏపీలో ట్రిబ్యునల్ హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి అనేక మంది వివిధ మేథావులుగా ఎదిగారని గుర్తుచేశారు.పేద ప్రజలకు న్యాయసేవలు అందించేందుకు బార్ అసోసియేషన్లు ప్రముఖ పాత్రలు పోషించాలని పేర్కొన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోము కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, హైకోర్టు జడ్జి వి.రామసుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజనపై మోడీ వ్యాఖ్యలు అభ్యంతరకరం

- కేంద్రంలో రాజ్యాంగ విరుద్ధ పరిపాలన
- ప్రధానికి బహిరంగ లేఖ
- పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర విభజనపై ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీకి ఆదివారం పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ఒక లేఖ రాశారు.పార్లమెంటు సమావేశంలో భారత రాష్ట్రపతి ఉపన్యాసానికి ధన్యవాదాలు తెలిపే సమయంలో ప్రధాని చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని వాపోయారు. స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ అనేక సందర్భాల్లో 15ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభించారని గుర్తుచేశారు. 70 ఏళ్లలో కాంగ్రెస్ అనేక ప్రధానులను సూచించిందని, వారి నడవడిక, మాట తీరు ప్రధాని పదవి హోదాను ఏనాడూ తగ్గించలేదని తెలిపారు.నాలుగేళ్లయినా ఏపీకి కేంద్రం న్యాయం చేయలేదని, విభజన చట్టంలోని అంశాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. తిరుపతి ఎన్నికల సమయంలో ఢిల్లీని మించిన రాజధాన్ని నిర్మిస్తామని ప్రజలకు మోడీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబుకు 16 నెలల నుంచి అపాయింట్‌మెంటు ఇవ్వకపోవడం బాధాకరమని, కేంద్రంలో రాజ్యాంగ విరుద్ధమైన పాలన కొనసాగుతోందని రఘువీరా వాపోయారు. రాష్ట్రానికి కొనసాగుతున్న అన్యాయమే ఇందుకు నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.

ఐటీ హల్‌చల్ !

- నోటీసుల మీద నోటీసులు
- వణికిపోతున్న అపార్ట్‌మెంట్ వాసులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం బ్యూరో : శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఆదాయపన్ను శాఖ (ఇన్‌కమ్ ట్యాక్స్) అధికారులు నోటీసుల మీద నోటీసులతో హల్‌చల్ చేస్తున్నారు. అపార్ట్‌మెంట్లలో నివాస ముంటున్న వారి ఇళ్లకు వెళ్లి వీటిని కొనుగోలు చేయడానికి మీకు డబ్బెలా వచ్చిందంటూ నోటీసు లిస్తున్నారు. వారం రోజుల్లో గుజరాతీపేట, పీఎన్. కాలనీ, తోటపాలెం, బైపాస్ ప్రాంతాల్లో ఇటీవల కాలంలో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లన్నింటికీ స్వయంగా వెళ్లి ఈ తాఖీదులిచ్చారు. అపార్ట్‌మెంట్లలో అద్దెకుంటున్న వారికి సైతం వారివారి యజమానులకు నోటీసులు అందజేయాలంటూ స్పష్టం చేశారు. 15 రోజుల్లోపు వీటిపై లిఖితపూర్వకమైన సమాధానం ఇవ్వాలని, వీటి పట్ల సంతృప్తి చెందకపోతే తామే స్వయంగా దర్యాప్తు చేస్తామని కూడా ఆయా యజమానులకు స్పష్టం చేశారు. హౌసింగ్ లోన్లు తీసుకుని, పైసా, పైసా కూడబెట్టి వీటిని కొన్ని మధ్యతరగతి ప్రజలంతా ఈ నోటీసులతో బెంబెలేత్తిపోతున్నారు. తమ ఆదాయ వనరుల వివరాలు వెల్లడించడానికి ఏముంటుందని ప్రశ్నిస్తున్నారు. వాస్తవంగా వీరిలో 80 శాతం మంది ఇప్పటి వరకూ ఎలాంటి వార్షిక ఆదాయపు పన్నును చెల్లించిన దాఖలాలు లేవు. అసలు ఆదాయపు పన్ను అని పేరు వినడమే గానీ, దానిపై సరైన అవగాహన కూడా లేని వారెందరో వున్నారు. నూతనంగా నిర్మించిన వాటిల్లో మాత్రమే నోటీసులిచ్చి పాత అపార్ట్‌మెంట్లను విడిచిపెట్టేయ డంతో చాలా మంది బతుకు జీవుడా అంటూ ఊపిరి పిల్చుకున్నారు. పీఎన్.కాలనీ 1వ లైనులో ఒక్కో అపార్ట్‌మెంట్‌ను రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షల వరకూ ఇటీవల విక్రయాలు జరిపారు. ఏడవ లైనులో నిర్మాణంలో వున్న అపార్ట్‌మెంట్ సైతం ఇదే స్థాయి ధర పలుకుతోంది. ఒక్క పీఎన్.కాలనీలోనే 200 వరకూ అపార్ట్‌మెంట్లున్నాయి. అంటే వీటి విలువే దాదాపు రూ.60కోట్లు. మరి ఈ మొత్తానికి ఆదాయపు పన్ను కింద తక్కువలో తక్కువ రూ.25 లక్షలైనా ఆ శాఖకు జమ కావాల్సి వుండగా. ఒకరిద్దరు మినహా ఎవ్వరూ అటువైపే చూడలేదని తెలుస్తోంది. పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రతీ లావాదేవీని నిశితంగా ఆదాయపుపన్ను శాఖ పరిశీలిస్తోంది. అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసేవారు జీఎస్‌టీ కింద నిర్ధేశిత మొత్తాన్ని చెల్లించిన వెంటనే సదరు వ్యక్తుల వివరాలు ఆదాయపు పన్ను శాఖకు చేరిపోతున్నాయి. ఆధార్‌కార్డుతో అను సంధానంతో కూడిన బ్యాంకు లావాదేవీలు, పాన్‌కార్డు ద్వారా జరిపిన లావాదేవీలు బేరీజు వేసుకుని ఐ.టీ.శాఖ ఇలా నోటీసులు జారీ చేస్తోంది. నిజాయితీగా తమ ఆదాయ వివరాలను వెల్లడించే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ భయ పడాల్సిన పనే లేదని, ఒకవేళ ఇప్పటికైనా ఏడాదికి అతి తక్కువ మొత్తం పన్నును చెల్లించడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవచ్చని నగరానికి చెందిన ఒక ఆడిటర్ చెబుతున్నారు.

సీనరేజీ లెక్కేంటి?

మరోవైపు భారీగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లకు అవసరమైన ఇసుక, కంకర, మట్టి తదితరాలను ఎక్కడి నుంచి తెచ్చారంటూ? నోటీసులిచ్చేందుకు గనులు, భూగర్భశాఖ అధికారులు సమాయత్త మవుతున్నారు.



ప్రభుత్వానికి భారీ ఎత్తున సీనరేజీ ఎగ్గొట్టి వీటిని అక్రమంగా తీసుకొచ్చి వినియోగించారని తాము భావిస్తున్నామని, వీటికి ఖచ్చితంగా ఆయా బిల్డర్లు సమాధానం చెప్పి తీరాల్సి వుంటుందని గనుల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అనుమతిక ఉన్న ఇసుక రీచ్‌లు, క్వారీల నుంచి మెటీరియల్‌ను తీసుకొచ్చేవారు సంబంధిత బిల్లులను కలిగి వుంటే ఏ ఇబ్బందీ లేదని లేదంటే నాలుగు రెట్లు జరిమానా విధిస్తామని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తమ్మునాయుడు స్పష్టం చేస్తున్నారు. 'విశాలాంధ్ర'తో ఆయన మాట్లాడుతూ క్యూబిక్ మీటరుకు రూ.50లోపు రాయల్టీ చెల్లించి బిల్డింగ్ మెటిరీయల్‌ను తెచ్చుకుని వుంటే ఎలాంటి నష్టమూ లేదని సరైన రికార్డులు లేకుంటే మాత్రం రూ.లక్షల్లో జరిమానా చెల్లించేందుకు సిద్ధంగా వుండాల్సిందేనని స్పష్టం చేసారు.

నోటీసులతో నిద్ర లేదు : సురేంద్ర వర్మ, పిఎన్.కాలనీ

చిలకపాలెంటోని ఓ ప్రయివేటు పరిశ్రమలో పనిచేస్తున్నా. పదేళ్ళుగా పైసా పైసా కూడబెట్టుకుంటూ. దానికి బ్యాంకులోనుతో కలిపి ఓ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశా. అయితే దీన్ని ఎలా కొనుగోలు చేసారంటూ ఆదాయపు పన్ను శాఖ నుంచి ఇటీవల నోటీసులొచ్చాయి. వీటికి ఎలా స్పందించాలో తెలియడం లేదు. ఆడిటర్‌ను సంప్రదించాలని కొందరు, ఐటీ అధికారులను కలవాలని ఇంకొందరు, వారు ఏం చెప్పినా వినరంటూ మరికొందరు ఇలా ఎవరికి తోచింది వారు చెప్పేస్తున్నారు. ఇప్పుడేం చేయాలో తెలియడం లేదు.

ఆలస్యంగా ఏపీ టెట్ హాల్‌టిక్కెట్ల జారీ..

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) హాల్ టిక్కెట్లను ఒకరోజు అలస్యంగా వెబ్‌సైట్లో పొందుపరిచారు.ఏపీ టెట్ పేపర్–1,2,3 విభాగాలకు పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఈ నెల 10 నుంచి వెబ్‌సైట్లో హాల్‌టిక్కెట్లను అందుబాటులో వుంచుతామని ఉన్నతాధికారులు వెల్లడించిన విషయం విదితమే. టెట్ కోసం ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు పూర్తిగా సిద్ధమవ్వనందున హాల్‌టిక్కెట్ల జారీలో కొంత జాప్యం నెలకొంది.దీనిపై మీడియాల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు.ఏపీ టెట్ పేపర్–3కి ఈ నెల 10వ తేదీ రాత్రి నుంచి, పేపర్–1,2 లకు 11వ తేదీ ఆదివారం రాత్రి నుంచి టెట్ హాల్‌టిక్కెట్లను అప్‌లోడ్ చేస్తామని పాఠశాల అధికారులు ప్రకటించారు. పేపర్–3 హాల్‌టిక్కెట్లు 10వ తేదీ శనివారం రాత్రి వరకూ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయలేదు.దీంతో హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడింగ్ లింక్ కన్పించనందున అభ్యర్థులు అసౌకర్యానికి గురయ్యారు. టెట్ హాల్ టిక్కెట్లను ఆదివారం రాత్రి నుంచి 'ఏపీటెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె.సంధ్యారాణి తెలిపారు.ఈ నెల 21 నుంచి మార్చి 3వరకూ ప్రతిరోజూ షెడ్యూలు ఆధారంగా రెండు విడతలుగా టెట్(పేపర్–1,2,3) పరీక్షల్ని ఆన్‌లైన్లో నిర్వహిస్తారు.



మాఫీ పేరుతో మోసం చేశారు: జగన్

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో: మాఫీ పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఆయన సంకల్ప యాత్ర 84 వ రోజు ఆదివారం నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం, దగదర్తి మండలం బోదగుడిపాడు శివారులోని క్యాంప్ వద్ద ప్రారంభమై జక్కేపల్లి గూడూరు క్రాస్ రోడ్స్, కొత్తపాలెం, తూర్పు గుడ్లదోన క్రాస్ రోడ్స్, పడమట గుడ్లదోన మీదుగా అనంతాపురం వరకు కొనసాగింది. కొత్తపాలెం వద్ద జలదంకి మండలం ఉదయగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించారు. . ఈ సందర్భంగా ఆయనను కలుసుకున్న వృద్ధులు, వికలాంగులు, మహిళలు తమ బాధలు చెప్పుకున్నారు. తమకు అన్ని అర్హతలున్నప్పటికీ పింఛను ఇవ్వడం లేదని వారు గోడు వెళ్లబోసుకున్నారు. అందరినీ ఊరడించిన ఆయన, పార్టీ అధికారం చేపట్టిన వెంటనే తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

అప్‌డేట్ పేరుతో కోట్లు దండుకునే ప్రయత్నం ?


- సహకార సంఘాల్లో దస్త్రాల కంప్యూటరైజేషన్
- వ్యతిరేకిస్తున్న సహకార సంఘ ఉద్యోగులు, షేర్ హోల్డర్లు

విశాలాంధ్ర అమరావతి : దేశంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలోని అన్ని దస్త్రాలను కంప్యూటరైజేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. దస్త్రాల కంప్యూటరైజేషన్ ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే అంతకన్నా ముందే 2017 సంవత్సరానికి సంబంధించిన రికార్డులను కంప్యూటరైజేషన్ చేయాలన్న ప్రయత్నం రాష్ట్రంలోని పలు సంఘాల్లో జరుగుతోంది. దీని ద్వారా మరో రెండేళ్ళపాటు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించే కంప్యూటరైజేషన్ పథకాన్ని తమకు దక్కేలా ముందుగానే కొన్ని ప్రైవేటు ఏజన్సీలు వ్యూహాలు రచించాయి. ఇందుకు సహకార సంఘాల అధికారులు, కొన్ని జిల్లాల్లో పాలకవర్గ పెద్దలు ఒప్పందాలు చేసుకున్నట్లు అర్థమవుతోంది. దీనివల్ల కోట్ల రూపాయల నిధులు దండుకునేందుకు అవకాశం ఉందని గ్రామాలలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న కంప్యూటరైజేషన్‌కు దాదాపు రూ.60కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలుస్తోంది. గతేడాది రికార్డుల కంప్యూటరైజేషన్ పేరుతో



సొసైటీల నుండచి భారీగా దండుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రధానంగా గుంటూరు జిల్లాలో సహకార సంఘాల ఉద్యోగులపై ఒత్తిడి పెరిగింది. గుంటూరు జిల్లా సహకార బ్యాంకు ఉన్నతాధికారులు మార్చి 31లోపు సహకార సంఘాలలోని రికార్డులను కంప్యూటరైజేషన్ చేయించి అప్‌డేట్ చేయించాలని ఓ ప్రైవేటు ఏజన్సీ ప్రతినిధులను సహకార సంఘాల సిబ్బంది సమావేశంలో పరిచయం చేశారు. వెంటనే ఆ ఏజన్సీ ప్రతినిధులు రంగంలోకి దిగి రికార్డులను కంప్యూటరైజేషన్ చేసేందుకు ఒప్పంద నిబంధనలు ఇవ్వాలంటూ సహకార సంఘాల ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నారు. వారు చేసే కంప్యూటరైజేషన్‌కు తీసుకునే ఫీజుల వివరాలు కూడా అందజేశారు. సహకార సంఘాలలో డ్యూస్ లిస్ట్, ఇంట్రస్ట్ సబ్‌వెన్షన్, డే బుక్, డిమాండు నోటీసులు, జనరల్ లెడ్జర్లు, స్టాక్ స్టేట్‌మెంట్లు, లెడ్జర్లు, షేర్ క్యాపిటల్ లెడ్జర్లు, గోల్డులోను, ఆడిట్ రిపోర్టు ఎంట్రీలు చేస్తామని, దీనికి గాను ఫిక్స్‌డ్ ఛార్జీల క్రింద 10వేలు (సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టలేషన్, సిబ్బందికి శిక్షణ, డెవలప్‌మెంట్, సపోర్ట్ ఛార్జీలు, తదితరాలు), సంఘ సిబ్బంది డేటా ఎంట్రీకి రూ.5,500లు, ఏజన్సీ ఉద్యోగి డేటా ఎంట్రీ చేస్తే నెలకు రూ.8,500లు చెల్లించాలని, ఇవి కాకుండా 31–03–2017 నాటి ఆడిట్ రిపోర్ట్ ప్రకారం డేటా ఎంట్రీకి రికార్డుకు ఐదు రూపాయల చొప్పున చెల్లించాలంటూ సహకార సంఘాలకు ఏజన్సీ లేఖలు పంపింది. ఆ లేఖల్లో పేర్కొన్న వివరాల ప్రకారం సహకార సంఘం దాదాపు రూ.1.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 1959 సహకార సంఘాలు ఉన్నాయి. కంప్యూటరైజేషన్ నిమిత్తం ఏజన్సీలకు ఒప్పంద నిబంధనల క్రింద పాలకవర్గ తీర్మానంతో పాటు స్టేషనరీ సొసైటీ భరించేలా రెండేళ్ళు అగ్రిమెంట్ ఖరారు చేస్తూ మూడు నెలల ఖర్చులను ముందుగానే చెల్లించాలి. రెండేళ్ళపాటు అగ్రిమెంట్ ఇవ్వటంతో ఆ అగ్రిమెంట్ ప్రకారం 2020 వరకు సదరు ఏజన్సీ సంబంధిత సహకారం సంఘం కంప్యూటరైజేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. మరో రెండేళ్ళపాటు సహకార సంఘాల కంప్యూటరైజేషన్ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే ఏజన్సీలు రంగంలోకి దిగారు. గుంటూరు జిల్లాలో కంప్యూటరైజేన్ చేస్తామని చెప్తున్న ఓ ఏజన్సీ ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో సహకార సంఘాల డేటా ఎంట్రీ చేసిన అనుభవం ఉందని, తూర్పు, పశ్చిమగోదావరి, చిత్తూరు జిల్లాల్లో సహకార సంఘాల్లో పనిచేస్తున్నామని ఉద్యోగులకు పంపిన ఆ లేఖలో పేర్కొంది. ఇదిలా ఉండగా సహకార సంఘాల కంప్యూటరైజేషన్‌కు కేంద్రం 60శాతం నిధులు ఇస్తుండగా 35శాతం రాష్ట్ర ప్రభుత్వం, ఐదు శాతం ఆప్కాబ్, డీసీసీబీలు భరించాలి. మరో నెలలో అధికారికంగా ప్రారంభం కానున్న కంప్యూటరైజేషన్‌కు ముందు ఈ బాదుడు ఏమిటంటూ ఉద్యోగులు, సంఘాలలోని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. కంప్యూటరైజేషన్ పేరిట కోట్లు దండుకునేందుకు జరుగుతున్న ప్రయత్నంగా రైతుల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. సహకారశాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని సహకార సంఘాల షేర్ హోల్డర్లు కోరుతున్నారు.

ఏపీకి బోలెడు నిధులిచ్చాం : కేంద్రమంత్రి ఆర్కే సింగ్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినన్ని నిధులు మరే రాష్ట్రానికి ఇవ్వలేదని కేంద్ర విద్యుత్‌శాఖ సహాయమంత్రి రాజ్‌కుమార్ సింగ్ (ఆర్కే సింగ్) అన్నారు. ఢిల్లీ నుంచి ఆదివారం ఆయన విజయవాడ వచ్చారు. మచిలీపట్నంలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విభజన హామీలను నెరవేర్చేందుకు కేంద్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. ప్రధాని మోడీ ఏపీని ప్రత్యేక దృష్టితో చూస్తున్నారని తెలిపారు. లోటును బర్తీ చేసే క్రమంలో ఇప్పటి వరకూ రూ. 3,900 కోట్లను ఏపీకి అందచేయడం జరిగిందన్నారు. తమకు రావలసిన నిధుల కోసం ఎంపీలు ఆందోళన చేయడంలో తప్పులేదన్నారు. దానిని కేంద్రం తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్కే సింగ్‌తో రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి కిమిడి కళా వెంకట్రావుతోపాటు వైద్యఆరోగ్యశాఖమంత్రి కామినేని శ్రీనివాస్, బీజేపీ ఎంపీ కంభంపాటి హరిబాబు భేటీ అయ్యారు. రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిపై ఆశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అజయ్‌జైన్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో జల,థర్మల్,పవన,గ్యాస్, సోలార్ విద్యుదుత్పత్తులకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను తెలియచేశారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్తుపై సింగ్ ఆరాతీయడమే కాకుండా పలు సలహాలు, సూచనలు చేసినట్లు సమాచారం.

సాహితి

పుస్తకపఠనం - ఆవశ్యకత

రావెల సాంబశివరావు
✆ : 9959089630

సాహితీవేత్తలలో, సాహితీ ప్రియులతో నిండిన ఈ సభకు ముందుగా నమస్కారం.దక్షులైనసభాధ్యక్షులుసాహిత్యవిద్యార్థి మోదుగుల రవికృష్ణ గారూ-

మాట్లాడవలసిన అంశంపై తయారు కావటానికి కావలసినంత సమయాన్ని ఇచ్చి వక్తలకు వెసులుబాటు కల్పించిన అజో-విభో- కందాళం ఫౌండేషన్ వారికి కైమోడ్పులు. ఈ సంస్థ రజతోత్సవ సమారోహంలో పాలు పంచుకునే అవకాశం కల్పించిన వారందరికీ పేరు పేరునా ధన్యవాదములు. సహపంక్తిలోని వక్తలకు సాధువాదములు.

ఈ పూట ఈ వేదికను చూస్తే అందరూ వ్యక్తి కేంద్రంగా ప్రసంగిస్తూం డగా నేనువిషయాన్ని కేంద్రంగా చేసుకుని ప్రసంగించాల్సినట్లుగా కన్పిస్తూంది. నేను ఓ ఐదేళ్ళపాటు నాగార్జున విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణాధికారిగా పనిచేసిన మాట నిజమే కాని ఇటువంటి పరీక్షను ఎదుర్కొనవలసి వస్తుందని భావించలేదు. అయితే విషయాన్ని, సందర్భాన్ని బట్టి చూస్తే ఈ పుస్తక పఠనము పరీక్షలకు సంబంధించినది కాదు. బతుకుబండి సాఫీగా సాగేందుకు పఠించవలసిన పుస్తకాలను గురించి అని అర్థమయ్యింది.

"మేధావులు తరతరాల మానవాళికి అందించే వారసత్వ సంపద పుస్తకాలు" అంటారు అడిసన్ జోసెఫ్.

"పుస్తకాలే నాకు నిజమైన మిత్రులు. వారి సాంగత్యంలో నిరాశకు తావుండదు." అంటారు థామస్ కార్లైల్.

"అమర వీరులు చిందించే రక్తపు చుక్కల కన్న వివేకి కలంలోని సిరాచుక్క విలువైంది" అన్నది అరేబియన్ సామెత.

అవును జీనియస్సూ జీవని శిల్పి సంజీవదేవ్ ఏ విశ్వవిద్యాలయ పరీక్షా రాయలేదు. అలాగే జ్ఞానపీఠ్అవార్డుగ్రహీత డా॥రావూరి భరద్వాజగారున్నూ.

వారిద్దరి చదువులు ఆరేడు తరగతుల వద్దే ఆగిపోయాయి. వారిద్దరు క్లాసు పుస్తకాలు వదిలేసి ఇతర పుస్తకాలు బాగా చదివారు. వారికి బతుకు పుస్తకం ఎలా చదవాలో బాగా తెలుసు. అందుకే వారికి లోకం తేలికగా అర్థ మయ్యింది. ఎంతటిజటిలమైన విషయాన్నయినా తేటతెల్లం చేయగల కౌశలం వారికి అలవడింది. అందువల్లనే కళాశాల గడపైనా తొక్కని వారిరువుర్నీ విశ్వవిద్యాలయాలు ఆహ్వానించాయి. వివిధ విషయాలపై ప్రసంగింపజేశాయి. గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. థామస్ కార్లైల్ చెప్పిన ప్రకారం "పుస్తకాలు నిరాశపరచని నేస్తాలుగా" వారి వెన్నంటి నిలిచాయి.

పుస్తకపఠనం అనగానే ఎటువంటి పుస్తకాలు చదవటం అనే ప్రశ్న తలెత్తు తుంది. ప్రశ్న మెదడుకుమేత, మనసుకుపదును, ప్రశ్నించటంజాగృతి, ప్రశ్నించటం మేలుకొలుపు. ప్రశ్నించటం నేర్చినవాళ్ళు మానవజాతికి మహో పకారం చేశారు. అటువంటి ప్రశ్న విషయంలో ప్రముఖ పాత్రికేయులు నార్ల వారన్న దేమిటి?-

"ప్రశ్ననుండిప్రశ్న ప్రభవింపకున్నచో/ నరుని జ్ఞానతృష్ణపెరగబోదు" అని చెప్పి "ప్రశ్నలేని బతుకు పసరంపు బతుకురా/ నవయుగాల బాట నార్లమాట" అని తేల్చారు.

ఏనాడో "విద్యలేనివాడు వింతపశువు" అనేది పద్యాల్లోకి ఎక్కింది. బహుశా ఆ కాలంలో విద్యను ప్రశ్నల ద్వారా పొందేవాళ్ళేమో. ఇప్పుడేముంది- బతుకంతా సమాధానపడిపోవటమే!

అసలు ఎటువంటి ప్రశ్నలకైనా సరైన సమాధానాలు దొరకాలంటే పుస్తక పఠనంతప్పనిసరి. పుస్తకాన్ని తొలిసారిచదవటం, కొత్త స్నేహితుణ్ణి పరిచయం చేసుకోవటం వంటిది, రెండోసారి చదవటం పాత మిత్రుణ్ణి మళ్ళీ కలుసు కోవటం లాంటిదనేది చైనావారి సామెత. ఆలోచనలు పురుడు పోసుకునే ప్రసవశాలలు గ్రంథాలయాలు అంటారు నార్మన్ కజిన్స్. అందుకే పుస్తక పఠనానికి సూర్యనారాయణగారి వంటి పలుకులమ్మ తోటమాలుల అవసరం ఎంతైనా ఉంది. వాళ్ళు తేనెటీగల వంటివారు. గ్రంథాల రూపంలో మధువును ప్రోది చేస్తారు.అయితే మధువును ఒడుపుగాతాగటంకూడ తెలిసిన మధుపము వంటివారు సూర్యనారాయణగారు. పుస్తకం రాయటం ఎంత ముఖ్యమో ,చదవటం ఎంత ముఖ్యమో, దానిని అర్థం చేసుకోవటమూ అంతే ముఖ్యం. వీటన్నింటి కంటే ముఖ్యం కావలసిన పుస్తకాలు అందుబాటులో ఉండటం, ఉంచటం. మంచి మంచి పుస్తకాలు చదవటం ఒక యోగం. వాటిని చది వించటం ఒకభోగం. అసలేమీ చదవకపోవటం ఒక రోగం!...అంతేనా సూర్య నారాయణగారూ! విద్యనుగురించి మనంభర్తృహరి కంటె బాగా చెప్పగలమా? ఏనుగు లక్ష్మణకవికి మించి భాషాంతరీకరణ సాధ్యమా? "విద్య నిగూఢ గుప్తమగు విత్తము" అంటూ ప్రారంభించి "విద్య నెఱుంగనివాడు మర్త్యుడే?" అంటూ ముగిస్తారు. అటువంటి విద్యను మనకు అందిస్తుంది పుస్తక పఠనం.

ఎవరయినా విద్య వలన తమకు జీవితంలో ఒకస్థాయి సమకూరుతుందని తలపోస్తారు. దానివలన ఒక గుర్తింపు పొందాలని చూస్తారు. జీవితంలో ముందడుగు వెయ్యాలని ఉవ్విళ్లూరుతారు. తమ జీవితాలను గౌరవప్రదం గావించుకోవాలని కలలుకంటారు. తమని చూచి జనంమెచ్చేలా అది ఉండా లని ఉబలాటపడతారు. అటువంటి ఉబలాటంమంచిదా కాదా అనేదాని జోలికినేనిప్పుడుపోను. అయితే దొడ్డగుణాఢ్యుల వివేకరీతి ఎడ్డెమనష్యులెరుంగ జాలరు. చదివి సారం గ్రహించటం అన్నది తెడ్డుకూరలో తిరిగినట్లుండరాదు. నాలుకకు రుచి తెలిసినట్లుండాలి. నాలుక చవి చచ్చిపోరాదు. నా మాటలు మీకు రుచించకపోతే భాస్కర శతకకారుడు మారన వెంకన్న కవిని కదిలించి చూడండి. ఎవరయినా తనకు ఆ సామర్థ్యం కలదు కనుక కలెక్టరు కావాలని కోరుకోవటంవేరు-అందరూ గౌరవిస్తారు కనుక కలెక్టరు కావాలని కోరు కోవటంవేరు. అదే విధంగా న్యాయశాస్త్రాన్ని అవలోకనం గావించిన న్యాయ వాది తాను న్యాయాధీశుడు కావాలనుకోవటం వేరు. వాదనల మధ్య మాటి మాటికీ "మిలాడ్" అనిపించుకునేందుకు న్యాయాధీశుడు కావాలనుకోవటం వేరు. అటువంటి వ్యత్యాసాలను మనకు విడమర్చి చెప్పేదిగా ఉంటుంది పుస్తక పఠనం. పుస్తకాలలో మంచివి ఉండవచ్చు, చెడ్డవి ఉండవచ్చు. ఏదో ఒకటి ముందు వాటిని చదవటానికి అలవాటయితే ఏవి మంచివో, ఏవి చెడ్డవో వింగడించుకునే శక్తిని తరువాత సంపాదించుకొనవచ్చు. సూర్యనారాయణ గారు సేకరించిన 1,05,200 పుస్తకాలు క్షుణ్ణంగా చదివి ఉండకపోవచ్చును. అయితే తమకు నచ్చినవి చదువుకునే స్వేచ్ఛను ఆయన కాపాడుకోగలిగారనే నేను భావిస్తాను.

సూర్యనారాయణగారు గ్రంథరచనకు ఎందుకు పూనుకోలేదో తెలియదు. నాలుగు కాలాలపాటు నిలబడే పుస్తకాలు రాయాలంటే కాలపరీక్షకు నిలిచిన పుస్తకాలను చదవాలి. చదివినంత మాత్రాన చాలదు. అక్షరం అక్షరం తరచి తరచి అధ్యయనం చేయాలి. చదివింది మననం చేసుకోవటాన్ని రసవత్తరం గావించుకోవాలిగాని అది రసాభాసగా మారరాదు.

రస్కిన్ మహాశయుడు పుస్తకాలను రెండురకాలుగా విభజిస్తారు. 1. అప్పటి కప్పుడు ఆ గంట సమయానికి పనికివచ్చేవి. 2. శాశ్వత ప్రయోజనం కలిగి ఉండేవి.

మనం ఎవరి ప్రసంగమైనా వినాలనుకొని అది కుదరకుండాపోయినపుడు, ఆ ప్రసంగం ప్రసంగ పాఠంగానో, ప్రసంగ వ్యాసంగానో అచ్చయితే అది ఆ గంటకు పనికి వచ్చే రచన అవుతుంది. యాత్రానుభవాలు, హాస్యప్రసంగాలు, సుఖాంత లేదా దుఃఖాంత కథలు, నవలలు వంటి వాటిని ఈ కోవలోకే చేర్చుతాడు రస్కిన్. ఇటువంటిరచనలుకూడ నిర్లక్ష్యం చేయబడటం సిగ్గుచేటు. దినపత్రికలు, వారపత్రికలు కాఫీతాగుతూనో, ఉపాహారం తీసుకుంటూనో చదవదగ్గవే. అయితే స్నేహితునివద్దనుండివచ్చే లేఖతాత్కాలికమా? శాశ్వతమా?

సంజీవదేవ్ వంటి వారినుండి పొందే సాంస్కృతిక లేఖలు యిలా చదివి అలా పారేసేవిగా ఉండవే. అది దాచుకుని మళ్ళీ మళ్ళీ చదువుకునేట్లుగా ఉంటాయి. రస్కిన్ దృష్టిలో మాత్రం లేఖలు, దినపత్రికలు, ఆ గంటకు పనికివచ్చే రచనలే. షోపెన్‌హోవర్‌కు కూడ వార్తాపత్రికల్లోని ఎంతటి లీడింగ్ ఆర్టికల్స్ అయినా ఆనాటి సంఘటనల కోరస్‌గానే కన్పిస్తుంది. మిణుగురులు కన్పిస్తే చాలు పాత్రికేయులు ఇళ్ళు తగులబడిపోతున్న కల్పనలు చేయగలరు అంటాడాయన!

రస్కిన్ దృష్టిలో పుస్తకం అంటే ప్రసంగం వంటిది కాదు. పుస్తకం ఒక శాశ్వత ప్రయోజనం కోసం చేపట్టే రచన. దాచుకుని చదువుకోవాల్సిన రచన. అంతకు పూర్వం ఎవ్వరూ చెప్పని రీతిలో, ఇంకెవ్వరూ అలా చెప్పలేనంతగా ఉంటుందా రచన. అందులో వాస్తవికత ప్రతిఫలిస్తుంది. ప్రయోజనకరంగా ఉంటుంది. మనోజ్ఞంగా ఉంటుంది. ఎక్కడా స్పష్టతను కోల్పోదు. ఎవరు చదువుతూంటే అది వాళ్ళకోసమే రాసినట్లుంటుంది. తమ బతుకంతటికీ ఆ ఒక్క రచనే చాలన్నట్లుగా ఉంటుంది. అటు రాసేవీరికీ, ఇటు చదివే వారికీ అందులోని విషయాలు ఎల్లవేళలా జ్ఞప్తికి వచ్చేట్లుగా ఉంటాయి. అదీ పుస్తకం అంటే! అంతేగాని ఒకళ్ళు ఒక విషయాన్ని గురించి చెబితే ఇంకొకళ్ళు దాన్నే కాస్త మార్చి చెప్పినందువల్ల ఏం ప్రయోజనం?

"పదరబోతు" పుస్తకం వ్యాస సంపుటే అయినా అందులోని మాటలు కొన్ని మాటిమాటికీ గుర్తుకొస్తాయి.


మందునూరినవారెల్ల వైద్యులు కానట్లే కందము రాసిన వారెల్ల కవులుగారు!

గడ్డము పెంచినంత మాత్రమున మహర్షి కాగలరా?!

వివేకము నేర్పని విద్య వ్యాసుని కడ నేర్చినను వ్యర్థమే!

పుణ్యమునకు, పురుషార్థమునకు రాని విద్య బుద్ధికి కష్టమేగాక నూనెకు నష్టము. (ఇది విద్యుచ్ఛక్తిలేని నాటిమాట)

కనుక మంచివిద్యను అందిపుచ్చుకోవాలంటే రస్కిన్ చెప్పిన శాశ్వత



ప్రయోజనంగల పుస్తకంలభించాలి. అయితే అటు వంటి పుస్తకాలు అసలు ఉంటాయా అని కొందరికి సందేహం కలుగవచ్చు. వారికి రస్కిన్ ద్వారా నేను చెప్పగలిగింది ఒక్కటే-పుస్తకం అంతటా రచయిత వివేకం ప్రతిఫలించకపోయినా అలా ప్రతిఫలించిన తావులుచాలు. అధికభాగం చదివింది మరచిపోయినా మనసులో మిగిలిందిచాలు మనల్ని బలవర్ధకంగా నిలిపేందుకు. ఈ విధమైన పుస్తకాలను అన్నికాలా ల్లోనూ గొప్పగొప్పవాళ్ళు మనకోసం రచిస్తారు.

వాళ్ళల్లో గొప్ప నాయకులు ఉండవచ్చు. గొప్ప గొప్ప పరిపాలనా దక్షులు ఉండవచ్చు. గొప్ప గొప్ప చింతనాపరులు ఉండవచ్చు. గొప్ప గొప్ప హృదయ జీవులు ఉండవచ్చు. ప్రతి తరంలోను ఒకరో ఇద్దరో ఇటువంటి వాళ్ళు ఉంటారు. అందువల్లనే కొన్ని నిత్య పఠనీయ గ్రంథాలు మన ముందు పోగు పడతాయి. మన జీవిత కాలం వాటన్నింటినీ చదవగలిగినంతటి సుదీర్ఘమైనది కాకపోవచ్చు. ఇది చదివితే అదీ చదవాలా అనే మీమాంసలో మన సమయం కొంతవృథా కావచ్చును. అలా వృథాఅయిన సమయంతిరిగి మనకు లభించదు.

అయితే రచయితలలోని రసజ్ఞత పాఠకుల్లోకి ప్రవహించాలి. లేకుంటే ఆ పఠనం వృథా. అందుకే భాస్కర శతకకారుడు యిలా చెప్పటం;

"చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుత లెవ్వరు మెచ్చ రెచ్చటం
బదునుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా!" రచయితలు అలా జాతికి ఉప్పు అందించాలి!

మేధావులతో ముచ్చటించే అవకాశం లభించిన వాళ్ళు చౌకబారు వాళ్ళ దరికి చేరరు. మేధావుల ప్రాంగణంలోకి ఒకసారి ప్రవేశం లభిస్తే, మనకు మన తాహతు విషయంలో సందేహం అక్కర్లేదు. కేవలం ప్రతిభ, ఆసక్తి, శ్రమ ఆధారంగానే వాళ్ళ జ్ఞానమందిరాల్లోకి మనకు ప్రవేశం లభిస్తుంది. అక్కడ లంచావతారులు పీడించరు, భయపెట్టేవాళ్ళుండరు. మోసాలుండవు. కృత్రిమత్వానికితావుండదు. అక్కడ ఎవరినిపరికించినా కారుణ్యమే, మంచి తనమే, మమకారమే! ప్రతిభ, మైత్రి మిలమిల మెరుస్తుంటాయి. అటువంటి తెలివిగల వాళ్ళతో మైత్రినెరపాలంటే మనం తెలివితక్కువవాళ్ళమైతే కుదరదుగా! మనం వాళ్ళ స్థాయికి ఎదగపోతే వాళ్ళు మన స్థాయికి దిగటం అంటే కుదరని పనే.

పుస్తక ప్రేమికులకు భేషజాలుండరాదు. ఏదో సాధించి తీరాలనే ఆలోచన అక్కర్లేదు. పుస్తకాల పట్ల వల్లమాలిన అభిమానం ఉంటే చాలు. వాటి నుండి నేర్చుకోవాలనే తపన ఉంటే చాలు. రచయితల ఆలోచనల్లోకి చొచ్చుకుపోయే చొరవ ఉంటే చాలు. వాళ్ల ఆలోచనలు మన తెలివికి మించినవిగా లేకుంటే ఆ రచనల్ని మనం చదవాల్సిన పనిలేదు!మంచి పుస్తకం ఎప్పుడూ తిప్పితిప్పి ఏదో ఒకటి రాసినట్లుండకూడదు. కవిరాజు త్రిపురనేని ప్రశ్నించినట్లు "నూతనాంశ మొకటేని యుం దెలుపనో పని గ్రంథసమూహమేటికో?! అప్రియంగాతోచిన రచనలో సత్యనిష్ఠ తొణికిసలాడాల్సిందే. రచన పటిష్ఠంగా, సార్వజనీనంగా ఉండాలి. "అబ్బ! ఈ పుస్తకం ఎంత బాగుంది. విషయం అంతా నా ఆలోచనలకు అనుగుణంగా ఉందనుకుంటే చాలదు. అబ్బ! ఈ పుస్తకం ఎంత బాగుంది ఈ విధంగా ఆలోచించవచ్చని దీన్ని చదవకముందు నాకు తట్టలేదు" అని మనం అనుకోగల పుస్తకమే మంచి పుస్తకం.

పుస్తకం అలా రాయటం నేర్పితే వచ్చేది కాదు, అది స్వతహాగా జీనియస్ లలో కన్పించేలక్షణం. అటువంటి పుస్తకాలు చదివేప్పుడు రచయితల మేధ తోనే కాక హృదయస్పందనతోను పరిచయం పెరగాలి. వాళ్ళు చెప్ప దలిచిం దంతా ఒక్కచోట కుప్పగా పోయరు. కొంచెం కొంచెంగా రుచి చూపుతారు. అటువంటిరచనల్ని అర్థంచేసుకోవటం గనుల నుండి బంగారాన్ని పొందటం వంటి చర్య. గని కార్మికుని మాదిరిగా ఖనిజాన్ని తవ్వితీసి శుద్ధపరచినట్లుగ ఆ గ్రంథసారాన్ని పొందాల్సిఉంది. అటువంటి శ్రమజీవన సౌందర్యాన్ని అలవర్చు కొనక తప్పదు. ఇటువంటి విషయాల్లో దగ్గర దారులుండవు. వాళు చెప్పేది జాగ్రత్తగా వినాలి. వాళ్ళ శబ్దప్రయోగాలను జాగ్రత్తగా పరిశీలించాలి. అక్షరం అక్షరంవెతికి సరైనఅర్థాన్ని రాబట్టాలి. రచనల్లో ఆరితేరిన వాళ్లను ఆంగ్లేయులేమంటారు? "మెన్ ఆఫ్ లెటర్స్" అంటారే గాని 'మెన్ ఆఫ్ బుక్స్" అనరే! వాళ్ల దేశంలో మనకు మెన్ ఆఫ్ లెటర్స్ కనిపిస్తారే తప్ప శతాధిక గ్రంథకర్తలు కన్పించరు!! ఏది ఏమయినా అటువంటి మెన్ ఆఫ్ లెటర్స్ మన హృదయా లను ఉర్రూతలూపేట్లుగా, మనమనసుల్లో మహా కల్లోలం రేగేట్లుగా మాటలకు ప్రాణం పోస్తారు. వాళ్ళే అక్షర శిల్పులు! మంచి పుస్తకాలు చదవాలంటే చెడ్డ పుస్తకాలు చదవటం మానెయ్యాల్సిందే.

ఎవరైనా అన్నమయ్య గ్రంథాలయంలోని లక్ష పైచిలుకు గ్రంథాలను బడబడా చదివినా చదువురాని వాళ్ళుగానే మిగిలిపోవచ్చు. ఏదయినా మంచి పుస్తకాన్ని ఒక్కదానిని ఎంచుకొని మనసుపెట్టి అక్షరం అక్షరం చదివి క్షుణ్ణంగా అర్థం చేసుకుంటూపోతే అటువంటి వాళ్ళు చదువుకున్న వాళ్ళుగా పరిగణింప బడవచ్చు. మాతృభాషలో ఆరితేరిన వ్యక్తికి అనేక భాషలు రాకపోవచ్చు. బహు కొద్ది పుస్తకాలే చదివి ఉండవచ్చు. అయితే తెలిసిన భాషలో ఆయనకు తిరుగుండదు. చెప్పేతీరులో నేర్పు, స్పష్టత ఎక్కువగా ఉంటుంది. వాక్య నిర్మాణంలో, పద ప్రయోగంలో అవకతవకలుండవు. అతని రచన మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తుంది. ఆ రచన అతని మేధోఫలం. అతని అధ్యయన లక్ష్యం. పబ్లిసిటీ మీద ఆధారపడక ప్రతిభతో కూర్చిన పుస్తకం రోజు రోజుకూ ప్రాచుర్యం పెంచుకుంటుంది. సాహిత్యాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ విహరిస్తూంటుంది. కాలాతీత రచన అంటే అదే. అటువంటి పుస్తకాలను పఠించటం మనం అలవాటు చేసుకోవాలి. అప్పుడే మనలోని వెధవాయిత్వా నికి మనం దూరంగా జరగగలిగేది. ఏదయినా ఒక భాషపై పట్టు సాధించా లంటే కొందరికి జీవితకాలం తెచాలకపోవచ్చు. నిఘంటువుల సాయంతో చదువుకొనేప్పుడు లవణం అంటే ఎక్కడ సౌందర్యం అవుతుందో, ఎక్కడ ఉప్పు అని అర్థం చేసుకోవాలో తెలియరావాలి. అలా తెలియవచ్చినా ఒక్కోసారి లవణం గోరాగారిఅబ్బాయి అని తెలియకపోతే నిఘంటువులు వెతికినా ప్రయోజనం ఉండదు!

రచయితలు ముఖ్యంగా మూడురకాలు అని చెప్తారు. 1. తోకచుక్కల్లా తళుక్కున మెరిసి మాయమయ్యేవాళ్ళు. 2. సమకాలికుల్లో మాత్రమే మహా రచయితలనిపించుకునే గ్రహాలవంటి వాళ్ళు. 3. అనంతంగా వెలిగే నక్షత్రాల వంటివాళ్ళు. ఈ నక్షత్రాల వంటివారి పుస్తకాల్ని పఠించటమే మనకు అత్యంత లాభదాయకం.

అయితే మిత్రులారా! ఒక్కమాట..గ్రంథ పఠనం సంగతి మనకెందుకు అనుకునేవారు గ్రంథాలు చదవలేరు. అటువంటి వాళ్ళు పుస్తకం తెరిస్తే అంతా అలికినట్లు కన్పిస్తుంది. వాళ్ళని వాళ్ళే మోసగించుకుంటూ వారు అత్యంత లాభదాయకం అని భావించే మరో వ్యాపకంవైపుకు పరుగులు పెడతారు. అయితే కేవలం ధనం చుట్టూ తిరిగే జనంతో ఏ దేశమూ ప్రగతి సాధించజాలదు. సాహిత్యాన్ని ప్రక్కనపెట్టి, శాస్త్ర విజ్ఞానాన్ని కాదని, కళల పట్ల పెదవి విరిచి, మానవత్వ లక్షణాల పట్ల మక్కువ జూపక ధనదాహంతో పరుగులు తీసే ప్రజ ఎంత దూరమని అలా పరుగుపెట్టగలదు?

జాతి మనుగడకు వ్యాపారవేత్తలు ఎంతముఖ్యమో, ఆలోచనాపరులూ అంతే ముఖ్యం. పొట్టకుతిండి ఎంత అవసరమో మెదడుకు మేతా అంతే అవసరమని గ్రహించాల్సిఉంది. నవ్వులేకాదు "సర్వ దుఃఖదమనాలు, వ్యాధులకు దివ్యౌ షధాలు" - పుస్తకాలు కూడ!

అసలు ఎడ్లపందేల మీద ఖర్చుపెట్టేంత గ్రంథాలయాలమీద ఖర్చుపెడు తున్నామా? గుర్రప్పందేలమీద మోజు గ్రంథాలయాలమీద ఖర్చుపెడు తున్నామా? గుర్రప్పందేల మీద మోజు గ్రంథాలయాల మీద ఉంటున్నాదా? హోటళ్ళలో మన ఖర్చులెంతెంత? పుస్తకాల మీద మనం ఖర్చుపెట్టేదెంత? ఆహారం శరీరానికేనా? మనసుకు అవసరంలేదా? జనం సారామీద ఖర్చు చేస్తున్నదెంత? దానిపై ప్రభుత్వ ఆదాయం ఎంత? ప్రభుత్వ నిధుల కోసం ఏండ్ల తరబడి గ్రంథాలయాలు ఎందుకలా కునారిల్లటం?! "తినాలనిపించిన తినుబండారాన్ని కొన్నంత సులువుగా చాలామంది. చదవాలనుకున్న పుస్తకాన్ని కొనరేం?!" అని విస్తుపోతాడు రస్కిన్. సంపన్నదేశాలు అనుకునే వాటిల్లోకూడ సంచార గ్రంథాలయాలేమిటి అని ముక్కుమీద వేలుంచుకున్న వాడు జాన్ రస్కిన్.

అసలు సూర్యనారాయణగారు అంత పెద్ద యెత్తున పుస్తకాలు ఎందుకు సేకరించినట్లు? ఈయన తనడబ్బు ఏం చేయాలో తోచక పుస్తకాలపై వెచ్చిం చిన ధనవంతుడు కాదు. పుస్తకాలు వద్దంటే వచ్చిపడేందుకు ఏ పత్రికకు సంపాదకత్వం నెరపినవాడు కాదు. పత్రికలకు సమీక్షలు అందజేసే అలవాటున్నవారు కాదు; వృత్తిరీత్యా గ్రంథపాలకుడూ కాదు. ఇవేవీ కాకుండా యింత పెద్ద గ్రంథాలయాన్ని ఒంటిచేతిమీద ఎలా నెలకొల్పగలిగారు? ఎక్కడా దొరకని ఎన్నెన్నో పుస్తకాలు అందరికీ అందించగలుగుతున్నారు?!

సూర్యనారాయణగారికి పుస్తక పఠనం విలువ తెలుసు.

అవసరమైన పుస్తకాలను తాము చదువుతూ యితరులతో చదివించటం సేవగా భావించారు. ఆ దిక్కుగా ఎనలేని కృషి సలుపుకుంటూ పోయారు. అందువల్లనే సూర్యనారాయణగారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి హంస పురస్కారం లభించటం.అజో-విభో-కందాళంట్రస్టు నుండి జీవన సాఫల్యంగా ప్రతిభామూర్తి పురస్కారాన్ని పొందగలగటం అదీ ఆ ట్రస్టు రజతోత్సవ సమారోహం వేళ!

పుస్తకాన్ని విస్తరించకు, సంక్షిప్తంగా ఉంటేనే ముద్దు అంటాడు బొల్తజార్ గ్రేషియన్. మరి ప్రసంగమైనా అంతే కదా! అయితే నేనీ ప్రసంగాన్ని ముగించే ముందుగా ఒక్క ముక్క మీకు చెప్పాల్సి ఉంది. ఇంటినిండా ఈ పుస్తకాల సంతేమిటని మా అక్క మూతిముడిస్తే కథ కంచికి ఏనాడో పోయేది. ఆమెకు అటువంటి భావన కలగకుండా నెట్టుకొచ్చిన మా బావను అక్షర లక్షలతో అభినందిస్తూ పుస్తక పఠనం గురించి యింతసేపూ విన్న మీకు, ఇటువంటి అవకాశాన్ని నాకు కల్పించిన వారందరికీ కృతజ్ఞతలు!

(అజో-విభో-కందాళం ఫౌండేషన్ 25వ వార్షిక సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గుంటూరులో 7జనవరి 2018న జరిగిన ప్రతిభామూర్తి పురస్కార గ్రహీత శ్రీలంకా సూర్యనారాయణ కృషి సమాలోచన సదస్సులో సమర్పించిన ప్రసంగ పత్రం) ✪

వినూత్న ఆధునిక లఘు కవితాప్రక్రియ 'కిరణాలు'

మినీ కవితాఉద్యమంలో కవిగా ప్రసిద్ధుడైన డా॥రావి రంగారావు రూపకల్పన చేసిన ఆధునిక లఘుకవితారూపం 'కిరణాలు'. ఆధునిక లఘు కవితా రూపాలుగా నానీలు, నానోలు, రెక్కలు, వ్యంజకాలు వంటి రూపా లెన్నో వచ్చాయి. వీటి నానీలు, రెక్కలు మాత్రం శతాధిక కవులను ప్రభావితం చేశాయి. నానీలు, రెక్కలు కంటే భిన్నంగా అక్షరనియమం కాకుండా పదనియమంతో రావి రంగారావు సృష్టించిన ఈ కొత్త లఘు కవితా ప్రక్రియలో నాలుగు పాదాల్లో ఒక్కో పాదానికి మూడుపదాల చొప్పున ఉంటాయి. 12పదాల్లో కిరణం భావ ప్రసరణ చేస్తుంది. కవులు అక్షరాల మీద కాకుండా కవితా శక్తి మీద దృష్టిని కేంద్రీకరించి మంచి కవితా కిరణాలు ప్రసరింజేస్తారన్న ఆశతో రూపొందించారు.

రావి 'కిరణాలు' కవితా సంపుటిలో 258 సామాజిక సమస్యలను ప్రరింపజేసే వైవిధ్య భరితమైన కవితా కిరణాలున్నాయి. రైతు సమస్యలపై కవితీకరణలున్నాయి. మానవ సంబంధాలపై వ్యంగ్యాస్త్రాలున్నాయి. అవినీతి పై అధిక్షేపణలున్నాయి. రాజకీయ వ్యవస్థపై చుర్రుమనిపించే తీక్షణ కిరణాలున్నాయి.

రైతుకు గుండెకోత కలిగించే ప్రభుత్వ



నిర్ణయాలను నిరసిస్తూ, "రోడ్డుకు బైపాస్/ మళ్ళీ తప్పదు/ పచ్చని పొలానికి/ గుండె కోత"- పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాసే ప్రభుత్వ నిర్ణయం రైతులకు గుండెకోత కలిగిస్తుందని అధిక్షేపించాడు. యాంత్రికంగా సాగుతున్న జీవనయానాన్ని యాంత్రిక ఉప మానాలతో కవిత్వీకరిస్తూ "జీవితం వెహికల్/ నాన్న డ్రైవర్/ అమ్మ కండక్టర్/ పిల్లలు పాసింజర్లు"/ అంటూ చమత్కరించాడు. ఆధునిక యువత మొబైలే జీవితంగా బతుకుతున్న స్థితిని చమత్కరిస్తూ "దేహం మొబైల్/ ఆహారం చార్జింగ్/ గుండెకాయ/ బ్యాటరీ/ మనసు సిమ్‌కార్డు/ అంటూ కవిత్వీ కరించారు. మొబైల్‌తో తాదాత్మ్యం చెంది జీవిస్తున్న యువతను నిరసిస్తూ "స్మార్ట్‌ఫోన్/ మరవడు/ కాలేజీ స్టూడెంటు/ ప్రతిరోజూ పెన్నును/ మరచిపోతాడు' అంటూ అధిక్షేపిం చడంలో అతిశయోక్తి లేదు.

కల్తీ అవినీతిమయమైన వస్తువులతో పాటు రాజకీయ పార్టీల కల్తీ ఫిరాయింపులను అధిక్షేపిస్తూ "గుంటూరుమిర్చి/ తెలుగుదేశం పార్టీ/ యథేచ్ఛగాకల్తీ"- గుంటూరు మిర్చి సంస్కారానికి ప్రతీక. అటువంటి మిర్చీ కల్తీ జాతీయస్థాయిలో సంచలనాన్ని సృష్టిం చింది. గుంటూరు మిర్చీ కల్తీతోపాటు అవినీతి మయంగా ఫిరాయింపులను ప్రోత్సహించి తెలుగుదేశంపార్టీ కల్తీమయమైంది. అత్యుత్తమ భారత ప్రజాస్వామ్యంలో పార్టీ ఫిరాయింపులూ, ఫిరాయింపుదార్లకు మంత్రి పదవులిచ్చి భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడాన్ని ఎన్నుకో బడని ప్రజాప్రతినిధి వంటి కవి కవితాకిరణం తో చురుక్కుమని పించడం ఔచిత్యంగా ఉంది.

మానవ సంబంధాల్లో స్వార్థ సంకుచిత భావాలవల్లవచ్చే మార్పులను సహజసిద్ధంగా కవిత్వీకరిస్తూ "కొడుకుగా/రాజీనామాచేశాడు/ కోడలికి/ మొగుడిగా/ కొలువు తీరాడు/" భార్యా వ్యామోహంతో తల్లిదండ్రు లను నిర్లక్ష్యం చేసే కొడుకులను నిరసించాడు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను పౌరులు వివక్షతో గుర్తించాలని కవిత్వీకరిస్తూ "ఓటు బ్రహ్మాస్త్రం/ ప్రయోగిస్తు న్నారు కాని/ శత్రువును మాత్రం/ కనిపెట్టలేక పోతున్నారు" ప్రజాస్వామ్యంలో అవినీతి పరులు, దోపిడీదార్లు వ్యవస్థకు శత్రువులు. పౌరుల్లో వివక్ష లోపించినందున శత్రువులే పాలకులవుతున్నారని అధిక్షేపించాడు.

శ్రమజీవి ప్రాధాన్యాన్ని గుర్తించలేని సంపన్నులను నిరసిస్తూ "పువ్వును చూస్తున్నారు/ కాడనిచూడరు/ సంపదను/ శ్రమజీవి మోస్తున్నాడు"సంపద సృష్టికి కారకుడు శ్రమజీవి. పరిమళభరితమైన పువ్వు అందంతో పరవశింపజేసేందుకు ఆధారమైన కాడను చూడరని నిరసించాడు.

పెద్దనోట్లు రద్దు నల్లధనాన్ని వెలికితీయా లని చేస్తే, ఆశించిన ప్రయోజనం నెరవేర లేదని అధిక్షేపిస్తూ, బాణం/ గురిపెట్టి / పెద్ద నోట్లను కొడితే/ నల్లరాక్షసుడిదేహం/ బక్క జనంపై పడిందని కవిత్వీకరించాడు. ఆంధ్రులకు, అరవలకు మాతృభాషాభిమానం లో ఉన్న వ్యత్యాసాన్ని తులనాత్మకంగా చెపుతూ "మాతృభాష మీద/ అభిమానం/ అరవలకు/ అతివృష్టి/ ఆంధ్రులకు అనావృష్టి" అంటారు. అతివృష్టి-అనావృష్టి పదాలతో చమత్కరించారు. ప్రకృతిలో పిచ్చుకలు అంత రించిపోతున్నాయి. కానీ ప్రజల రక్తం పీల్చే రాజకీయనాయకులనే దోమలు అంతరించటం లేదని నిరసించాడు. సమకాలీన సమస్యలను అధిక్షేపాత్మకంగా కవిత్వీకరించిన కిరణాలు కవితాప్రియులు విధిగా చదవదగినవి కిరణాలు. కొంతమంది కొత్తకవులపై ప్రభావితం చేయ గలవని ఆశిద్దాం.

-డా॥ పి.వి. సుబ్బారావు,
✆ : 9849177594

కిరణాలు -డా॥రావి రంగారావు,
ప్రచురణ: రావి రంగారావు సాహిత్య పీఠం, వెల:రు. 50/- ప్రతులకు: శ్రీమతి నర్రా ప్రభావతి, 101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణనగర్, గోరంట్ల గుంటూరు-522034


మహానాదం



చీకటి వెలుగుల సమరంలో సూర్యుడి వజ్రాయుధానికి
తిమిరం గుట్టలుగా గుట్టలుగా రాలింది
ఏకచత్రాధిపత్యమై ఏలిన చీకటి
శిరచ్ఛేదం చూసిన వెలుగు కాంతి పండుగ చేసుకుంటూంది!
రాజకీయం కారుచీకట్లో మునిగింది
నోటు ఓటును కొంటూంది, పదవి నోటుకు అమ్ముడౌతూంది
మతం రుద్దబడుతుంది, అవినీతి నాటబడుతుంది
వాగ్దానాలు ఆకసాన్ని నేలపై పరుస్తున్నాయి
నేలను ఆకసాన ఆవిష్కరిస్తున్నాయి
మనిషి మనిషికి పల్లకి అంటూ బోయీలను వెతుకుతున్నాయి
సరిదిద్దటం సూర్యుడు తనపని కాదన్నాడు!
చదువులు చిమ్మ చీకట్లో తచ్చాడుతున్నాయి
కొనబడుతూ అమ్మబడుతూ తులాభారం తూగుతున్నాయి
చదవకనే డిగ్రీలు పంచబడుతున్నాయి
పుట్టబోయే బిడ్డకు ఫీజంటూ పుట్టకముందే వసూళ్ల వుసిళ్ళు
పునాదుల్లేని విద్యపై కట్టడాలు కట్టబడుతున్నాయి
గ్రంథాలయం మెట్లెక్కని కాళ్లు, సుమతి పద్యం పలకని నోళ్ళు
సంస్కరణ తన కార్యం కాదన్నాడు సూర్యుడు!
న్యాయం కటికచీకట్లో చిక్కింది
హత్య జరిగింది నిజమే,
మనిషి చనిపోయింది నిజమే
చంపింది ఆ మనిషి కాదు
అరాచకం జరిగింది నిజమే,
అత్యాచారమూ నిజమే ఆ మనిషి అప్పుడు అక్కడలేడు
ఒకడు కొంపలు కాల్చుకుంటూపోతుంటాడు, కాల్చిన గృహాలు ఉండవు
ఒకడు భూముల్ని ఆక్రమించుకుంటూఉంటాడు, ఆక్రమించిన భూములుండవు
న్యాయానికి చెవులేగాని కళ్లులేవంటూ సుభాషితం
దిద్దుబాటు తన ధర్మం కాదన్నాడు సూర్యుడు!
మరో ప్రపంచానికి మహానాదమై
మనిషి సూర్యుడైన ముక్తిప్రస్థానం

-అడిగోపుల వెంకటరత్నమ్, ✆ : 9848252946

నిజంగుట్టు



మోహం మనసుని కలవరపెడుతుంది
వ్యామోహం పరులను కలతపెడుతుంది
పతనానికి గొప్ప రహదార్లవి
దారిపొడవునా 'ఆకర్షణ' పరిమళాలు వెదజల్లి
ఆలోచనల్ని కరిగిస్తుంది
కంటి వెలుగును అడ్డగించికీర్తిపొరలను కాలుస్తుంది
నగుమోములోంచి కా(మ)లకూటం
ఒలుకుతుందని ఎవరూహించగలరు!
దేవతావస్త్రం వంటి ముసుగు
మానవత్వం గుండెలో చురకత్తిని
దించుతుందని ఎవరనుకోగలరు!
తేనెబిందువుల మాధుర్యంలోంచి
చేదుతనం పుడుతుందని ఎవరికెరుక!
అందమైన గజల్ గుండెలోంచి
వికారం జనిస్తుందని ఎవరికి తెలుసు!
భయం పాతాళానికి దారిచూపుతుంది
ధైర్యం తూటాలాగ శత్రువు గుండెలోకి దూసుకుపోతుంది
సాహసం దేశగౌరవాన్ని నిలిపే
గెలుపుకేతనమౌతుంది
వేదన రగిలించిన ధైర్యం
సాహసమనే ఉచ్చును పరుస్తుంది
నమ్మశక్యంగాని నిజంగుట్టు బిగుసుకుంటుంది
ధైర్యానికి, సాహసం తోడుంటే
ప్రతి అడుగువెంట ఆత్మవిశ్వాసం జీవిస్తుంది

-ఎస్.ఆర్. పృథ్వి, ✆ : 9989223245

కొలకలూరి సాహిత్య పురస్కారాలు-2018

కొలకలూరి సాహిత్య పురస్కారాలు-2018కు సంబంధించి ఆచార్య మధురాంతకం నరేంద్ర, ఆచార్య యన్. మునిరత్నమ్మ, డా.వి.ఆర్. రాసానిలు 'కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం'కు శ్రీ అంకం లింగమూర్తి (అమ్మ-నాన్న నాటికల సంపుటి, రూ.10,000/-), శ్రీ జీడి గుంట రామచంద్రమూర్తి (మూడు నాటికలు-నాటికల సంపుటి, రూ.5,000/-)లను ఎంపికచేశారు.

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ఆచార్య జి. దామోదరనాయుడు, ఆచార్య మేడిపల్లి రవికుమార్‌లు 'కొలకలూరి భాగీరథి కవితా పురస్కారం'కు శ్రీ ఈతకోట సుబ్బారావు (కాకిముద్ద-కవితాసంపుటి, రూ.10,000/-, శ్రీ అడిగోపుల వెంకటరత్నం (ముందడుగు- కవితా సంపుటి, రూ. 5,000/-)లను ఎంపికచేశారు. ఈ పురస్కారాలను 26.02.2018 సాయంకాలం 6 గంటలకు ఎన్.టి.ఆర్. కళాప్రాంగణం, తెలుగువిశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లోజరిగే సభలో ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
12 ఫిబ్రవరి 2018

అద్దాల సొగసు చూడతరమా!

ఎంబ్రాయిడరీ, లేసులు, జర్దోసీ వర్క్, జ్యూట్ వర్క్ అని చీరల మీద వచ్చే వర్క్‌లు ఎన్నిరకాలో. వీటన్నింటిలోకీ అతి ప్రత్యేకమైనదీ, చూడగానే కొట్టొచ్చినట్టు కంటికి ఆనేది, మెరుపుతో మురిపించేదీ అద్దాల వర్క్, ఇది చాలా కాలం నుంచి వాడుకలో ఉన్నదే. అయినా ఎప్పటికప్పుడు కొత్తగానే అనిపిస్తుంది. ఎన్నాళ్ళైనా మగువల మనసు దోచే అద్దాల వర్క్ శారీసే ఇవి. చూడముచ్చటైన ఈ అద్దాల కోకలపై మీరూ ఓ లుక్కేయండి మరి!



పెరుగు పూత వేయండి!



ఆరోగ్యకరమైన, మెరిసే చర్మం కోసం చాలామంది మహిళలు స్పాలు, సెలూన్లకు వెళు తుంటారు. లేదంటే సౌందర్య పోషణ పేరుతో బయట మార్కెట్‌లో దొరికే ఉత్పత్తుల కోసం చాలా ఖర్చు చేస్తుంటారు. ఇవేమీ లేకుండానే ఇంట్లో ఉండే, సహజమైన పదార్థాలతోనే మీ ముఖానికి కొత్త కాంతిని తెచ్చుకోవచ్చు. రోజూ ఇంట్లో ఉండే పెరుగే ఇందుకు బాగా ఉపయోగపడుతుంది. ఇది జీవం కోల్పోయిన, కళావిహీనంగా ఉన్న చర్మానికి నూతన తేజస్సును ఇస్తుంది. పెరుగును ఉపయోగించుకునేందుకు చాలా మార్గాలున్నాయి. నిమ్మ, ఆలివ్ ఆయిల్ లాంటి ఇతర పదార్థాలతో కలిపి వాడుకోవచ్చు. మరి ముఖానికి పెరుగు పూతలు ఎన్ని రకాలుగా వేయవచ్చో తెలుసుకుందామా!

•• ఒక టీ స్పూన్ పెరుగులో అర టీ స్పూన్ నిమ్మరసం కలపండి. దీనిని ముఖమంతా సమానంగా రాయండి. పదినిముషాల తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోండి. వారానికి రెండుసార్లు ఈ పూత వేసుకోవచ్చు.

•• గిన్నె నీళ్ళల్లో గుప్పెడు మెంతులు వేసి రాత్రిపూటే నానబెట్టండి. ఉదయాన్నే నీళ్ళు వంపేసి మెంతిగింజలు మెత్తగా చేసి ఇందులో ఒక టీ స్పూన్ తాజా పెరుగుని కలపండి. దీనిని ముఖానికే కాదు చేతులు, కాళ్ళకు కూడా వేసుకోవచ్చు. పది నిముషాలు ఆగిన తర్వాత గోరువెచ్చని నీళ్ళతో శుభ్రం చేసుకోండి. డల్‌గా అయిపోయిన చర్మానికి జీవం కల్పించేందుకు వారానికి ఒకసారి ఈ పూత వేయండి.

•• ఒక టీ స్పూన్ పెరుగులో అర టీ స్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి పలచగా ముఖానికి పూతలా వేయండి పావుగంట తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోండి.

•• రెండు టీ స్పూన్‌ల పెరుగులో అర టీ స్పూన్ మంచి తేనె కలిపి ముఖం, మెడకు బాగా రాయండి. పావుగంట, 20 నిముషాల తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారానికోసారి ఈ పూత వేస్తే మంచి ఫలితం ఉంటుంది

•• ఒక గిన్నెలో ఒక టీ స్పూన్ పెరుగు, ఒక టీ స్పూన్ అలోవెరా గుజ్జు వేసి బాగా కలిపి ముఖానికి పట్టించి రాత్రంతా అలాగే ఉంచండి. ఉదయానికి మీ ముఖానికి కొత్త కాంతి వస్తుంది.

పోషకాల ఖజానా.. వాల్‌నట్స్



వాల్‌నట్స్ రుచిగా ఉండటమే కాదు, ఇవి పోషకాల ఖజానాగా చెప్పవచ్చు. నట్స్‌లో కొవ్వు ఎక్కువగా ఉంటుందనేది సాధారణ అపోహ. ముఖ్యంగా వాల్‌నట్స్ అత్యంత ప్రయోజనకరమైనవి. నిద్రకు ఉపకరించే మెలాటోనిన్ అనే హార్మోన్ వాల్‌నట్స్‌లో ఉంటుంది. అందువల్ల బెడ్ టైమ్ స్నాక్‌గా తీసుకుంటే మంచి నిద్ర పడుతుంది. వాల్‌నట్స్‌లో ఫ్యాట్స్ ఆరోగ్యవంతమైనవి. పీచు, ప్రొటీన్లకు మంచి ఆధారం. వాల్‌నట్స్ తినడం వల్ల కడుపు నిండిన సంతృప్తికర భావం కలుగుతుంది. అందువల్ల డైటర్లకు మంచి ఆహారం. యూంటీ-ఇన్‌ఫ్లమేటరీ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్‌కు మంచి ఆధారం. ఇది శరీరం ఉత్పత్తి చేయని అత్యవసర ఫ్యాటీ యాసిడ్. ఫ్రీ ర్యాడికల్స్ నుంచి



పరిరక్షిస్తుంది. ఎగ్జిమా, సొరియాసిస్, ఆస్తమా, రుమటాయిడ్, ఆర్థరైటిస్‌ల నుంచి కాపాడటంలో సహకరిస్తుంది. మంచి 'హెయిర్‌ఫుడ్' కూడా. వీటిలోని బయోటిన్ శిరోజాలను దృఢతరం చేయడంలో ఉపకరిస్తుంది. బి విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి కాబట్టి చర్మం ముడతలు పడటం, వార్ధక్య లక్షణాలు తగ్గుతాయి. ఆహారంలో వాల్‌నట్స్, వాల్‌నట్ ఆయిల్‌ను భాగం చేసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని పరిశోధనల్లో గుర్తించారు.

పొడవుగా కనిపించాలంటే...!

కొంతమంది చూడగానే చాలా పొడవుగా ఉన్నట్టు కనిపిస్తారు. మరికొంతమంది బాగా పొట్టిగా కనిపిస్తారు. ఈ విషయంలో మన ఆహార్యం, దుస్తుల అలంకరణ కూడా ప్రభావం చూపిస్తుందనే విషయం తెలుసా! ఇవన్నీ మన వ్యక్తిత్వం మీద కూడా ప్రభావం చూపిస్తాయి. పొట్టిగా ఉన్న వాళ్లకు పొడవుగా కనిపించాలనే ఆశ ఉంటుంది. దుస్తుల విషయంలో కొద్దిపాటి మార్పులు చేసుకోవడం ద్వారా కొంచెం పొడవుగా కనిపించవచ్చు. అందుకేం చేయాలంటే...

▸▸ పుట్టుకతోనే మనం కోరుకున్నట్టుగా ఉండడం ఎవరికీ సాధ్యమయ్యేది కాదు. పొట్టిగా ఉన్నంతమాత్రాన కుంగిపోనవసరం లేదు. పొడవుగా కనిపించాలంటే స్టైల్‌గానే ఉండనక్కర్లేదు. సింపుల్‌గా ఉంటూనే పొడవుగా కనిపించే ప్రయత్నం చేయవచ్చు. నిటారుగా నిలబడడం వల్లా, ఆత్మవిశ్వాసంతో మెలగడం ద్వారానూ పొడవుగా కనిపించవచ్చు.

▸▸ పలు రంగులు కలిసి ఉన్న చీర లేదా డ్రస్ ధరించడం ద్వారానూ పొడవుగా కనిపించవచ్చు. అవి ముదురు రంగులు అయితే మరింత ధాటిగా కనిపిస్తారు.

▸▸ పొడవుగా కనిపించాలంటే మరీ వదులుగా ఉన్న దుస్తులు వేసుకోకూడదు. ఒంటికి పట్టినట్టుగా ఉండే బిగుతైన దుస్తులు వేసుకోవాలి. వదులుగా ఉండే దుస్తులు సహజంగానే పొట్టిగా ఉన్నట్టు కనిపించేలా చేస్తాయి. పలాజో, హరేమ్, ధోటీ ప్యాంట్లు పొడవుగా ఉన్నవారినీ పొట్టిగా ఉన్నట్టు అనిపిస్తాయి. బిగుతైన దుస్తులు పొట్టిగా ఉన్నవారిని పొడవుగా కనిపించేలా చేస్తాయి.

▸▸ ప్యాంట్లు వేసుకునేవాళ్ళు మోకాళ్ళ దగ్గర ముడతలు పడని ప్యాంట్లు వేసుకోండి

▸▸ నిలువు చారలు లేదా గీతలు ఉన్న డ్రస్‌లు లేదా షర్ట్‌లు ధరించినా పొడవుగా కనిపిస్తారు. పొడవుగా కనిపించాలనుకునే వాళ్ళు అడ్డ చారలు లేదా గీతలు ఉన్న డ్రస్‌లు, ప్రింట్లు అసలు వేసుకోకూడదు.







డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

యీబాధలు తెలియనంతసేపు- న్యాయం, ధర్మం, సత్యం, నీతి అని నేనూ నమ్మేను. నేనూ బోధించేను. రాయపురం రైలు వంతెన చేరీలో నాలుగురోజులై అన్నం మెతుకంటే యేమిటో యెరక్క పడుకున్న ఆ ఆరుగురు పిల్లల తల్లికి-ఆది సత్యాలు ఉపదేశిస్తే ఆమెకేం అర్థం అవుతుంది? కిద్దరుపూరులో రెండు సంవత్సరాలై యెర్రని యేగాన్ని కళ్ళారా చూచిన పుణ్యం కట్టుకోక-పనికోసం రోజల్లా వెతకి, యెక్కే గుమ్మంయెక్కి దిగే గుమ్మందిగి, వీధులల్లా తిరిగి వేసారి సాయం కాలానికి ఉత్తచేతులతో యిల్లుచేరి ఆలుబిడ్డలని చూడ డానికి ధైర్యంచాలని ఆ యువకుడికి పరమ ప్రమాణాలు బోధిస్తే యేం ప్రయోజనం?

(నిన్నటి సంచిక తరువాయి)

ఢిల్లీ దర్వాజా దగ్గర తీరురేకు గుడిసెలో క్షయతో తీసుకుంటున్న పెనిమిటికి మందుకొనడం కోసం సెక్రటేరియట్టు బస్సుల దగ్గర బిచ్చం అడుక్కుంటున్న ఆ స్త్రీతో అనాశ్రిత ధర్మాలని పాటించమని శతపోరుతే ఆమెకేమేనా పాలు పోతుందా?... నేనే ఆ స్థితిలో వుంటే ఎలా ప్రవర్తిస్తానో ? సిగ్గు లజ్జలు మర్చిపోయి చెయ్యి చాచి పరాయివాళ్ళని అడుక్కోవడానికి సిద్ధపడతానా ? లేకపోతే - గుండెరాయి చేసుకుని జేబు దొంగతనానికో, రాత్రి కన్నం వెయ్యడానికో తయారవుతానా ? లేకపోతే - దుఃఖాన్ని మింగి తిట్లుపడి యెవరింట్లోనో చాకిరీకి బయలుదేరుతానా ? లేకపోతే - చాకలివాని దగ్గర పడుపు గుడ్డలు అద్దెకు తెచ్చుకుని కోమటి దగ్గర అప్పు బతిమాలి పసుపు, కుంకం, అత్తరు, పన్నీరు రాసుకుని మానం మరచి - బిడియం విడిచి - శీలాన్ని బలి యిచ్చి - దేహాన్ని అమ్ముకుని... అబ్బబ్బ ! తల్చుకొంటేనే కళ్ళు చమ్మగిల్లి, వళ్ళు జలధరించి గుండె కొట్టుకొంటూందే ! బతుకు తీపి - ఆకలిబాధ - పెనిమిటి పిల్లలపై ప్రేమ - యీ అగ్నిపరీక్షకి నా సత్యాగ్రహం నిలుస్తుందా ?.... చెప్పలేం ! శాస్త్రి లౌక్యం - ఊర్వశి కుతంత్రం - అవినాషుబాబు వాంఛ - స్త్రీ పురుషుల కక్కుర్తులు - దొరల రాజ్యకాంక్ష - స్నేహితుల పదవీ వ్యామోహం - ధనికుల పరపీడన - దేశంలో దరిద్రం - ఇవన్నీ చూస్తూంటే - యీ ప్రపంచంలో ఆదిసత్యాలు, అనాశ్రిత ధర్మాలు, పరమ ప్రమాణాలు- అంటే వున్నాయా అని నాకే సందేహం కలుగుతూంటే - అప్పటికీ యిప్పటికీ నేనెంత మారిపోయానన్నమాట !

సుభని ఇంగ్లాండుకు తీసుకెడుతున్నాం. అక్కడ అమాంతంగా ఏ 'లార్డుని' వరిస్తుందో - ఏ బస్సు నడిపేవాడిని మోహిస్తుందో - లేకపోతే ఏ నాటకం వాళ్ళతో వెళ్ళిపోతుందో ? సత్యకాలం - దానికింకా యేం తెలీదు. నేనే చెప్పాలి - తల్లి బాధ్యత నాదే. పాపాయి, సుభ - నాకు రెండు కళ్ళు లాగున్నారు. శాస్త్రితో చెబితే గాభరా పడతాడు. నేనే జాగ్రత్తగా వుండి వెయ్యి కళ్ళతో కాపాడాలి.

...ఇంగ్లాండు - ఫ్రాంసు - జర్మనీ - ఇటలీ - పోలెండు - రష్యా ! యుద్ధోన్మాదుల వికటాట్టహాసపు పిచ్చిచేష్టలు మితిమీరిపోతున్నాయి. రణభేరీ మ్రోగుతూంది. శంఖారావం వినిపిస్తూంది...మన యెన్నికల హడావుడి - మన మంత్రాంగపు హంగామాకూడా ఆ రాబోయే మహాసంగ్రామం యొక్క మొదటి నాందీ ప్రస్తావనేమో అనిపిస్తూంది నాకు. లేకపోతే - మొదటి అంకంలోనే ఒక పిల్ల సమ్మేరియా - తెర వెనుక ముసుగులో గుద్దులాటా?....దీని తరువాత - బ్రిటీషువారికీ మనకీ - పాలకులకీ పీడితులకీ - కలిమి వున్నవారకీ లేమి వున్నవారకీ - అన్నదమ్ములకీ అంతర్యుద్ధం - మరో కురుక్షేత్రం - తప్పనిసరి - అని భయం వేస్తూంది - నాకు...

నేను పిరికిపందనై దేశాన్ని వదిలి పారిపోవడంలేదు. రాబోయే యుద్ధానికి తర్ఫీదు పొంది తయారుగా వుండడానికే నే నీ ఇంగ్లండు ప్రయాణాన్ని



వినియోగించాలి. ఈసారి గోడమీద పిల్లి వాటంగా కాకుండా శాస్త్రిని నా వేపు నిలబడేటట్టే చెయ్యాలి. అర్జునుడికీ కర్ణుడికీ యుద్ధం కాని - అర్జునుడికీ సుభద్రకీ యుద్ధమా?... ఆవేళ రైల్లో కల జ్ఞాపకం వస్తూంది!

...ఈ పరిగెడుతూవున్న టెలిగ్రాపు స్తంభాలూ - కిందకీ మీదికీ తేలిపోతూండే తీగెలూ - నడుసున్న చెట్లూ - పారిపోతున్న యిళ్ళూ - వీటిలాగే - నా మనస్సులో ఆలోచనలూ, తలంపులూ, జ్ఞాపకాలు ఒకదానివెంట మరొకటి పందేలు వేసుకొని తరుముకొస్తున్నాయి! యెందునా పొందకుండా వొకదానితో ఒకటి సంబంధం లేకుండా యివన్నీ శరీరంలో యే మూల దాక్కుని వుంటాయో - మెదడులోనా - హృదయంలోనా - మనస్సులోనా - ఆత్మలోనా - అంతఃకరణలోనా?....

...లక్కమామిడి పిదత మూత తీయ్యగానే అందులోనుంచి పాము వచ్చినట్టు "ఔరా! నా స్వామి ఇటు చూడరాడాయెరా!" అన్న జావళి ఆకృతి లేని రూపంతో అప్రయత్నంగా దానంతట అదే పాడుకుంటూ వచ్చి నా బుర్రలో తిరుగుతూంది! నరసింహేశ్వరపుర సంస్థానాధీశ్వరుడైన ప్రతాపరెడ్డి ఆనంద కృష్ణవర్మ రాయణిం వారిని కృతిభర్తగా చేసి అభినయించి నర్తకి చింతామణి పాడిన జావళి.... "ధారుమగ-రిమపనిధ-మపధపాధ - సరిమ - సరిమగరిసనిధప - పాధసారి - రిధసనిధ - రిమ పధ రిసా - నిధపధపామగరి - పమాగరిస - రిమామగరిసరీమా..."

చింతామణి కా జావళీ నేర్పిన గోపయ్యగారే జ్ఞాపకం వస్తారు! నేనా రోజుల్లో చాలా చిన్నదాన్ని. నాన్నకి ఏకేశ్వరోపాసన అంటేను బ్రహ్మ సమాజం మీదను చాలా గురి. జావళీలు నోట పలికితే ఆడపిల్లలికి యెక్కడ చెడు బుద్ధులు పుడుతాయో అని ఆయనకి భయం! అంచేత జావళీలు కాదుకదా తానవర్ణాలుకూడా నన్ను నేర్చుకోనిచ్చేవారు కారు. గోపయ్యగారు కాశీయాత్ర వెలుతూ మా యింట్లో మజిలీ చేశారు. అప్పుడు ఆ జావళి నా కాయన స్వయంగా నేర్పారు. సాహిత్యం విని నాన్నకి కోపం వచ్చింది. కాని అతిథిని యేమనగలరు? అందులోకి తిక్కలోనూ సంగీతంలోనూ నారద సమానుడైన గోపయ్యగారినే?... ఆయన వీణ ముట్టుకోవడమే అరుదు. ఆయన సంగీతం యెప్పుడు వింటామా అని ఆ వూరిలో ఆబాలగోపాలం ఆయన గుమ్మంలో పడిగాపులు కాసేవారు! ఆయనకి లోపలనుంచి పుట్టుకు వస్తేనే ఆ వీణని ధరించడం. లేకపోతే - మహారాజులు ప్రార్థించినా ససేమిరా - అంతే! ఒకరోజు తెల్లవారు ఝామున ఆయన శపథం చేశాడు! మరోనాడు ఒకరింట్లో శృంగేరి వారికి భిక్ష జరుగుతుండగా పొరుగు లోగిట్లో గోపయ్యగారు "శాంతము లేక సౌఖ్యము లేదు" అని శ్యామ రాగంలో కృతి వాయిస్తూండేసరికి - అది విని స్వాములవారు నిర్వికల్ప సమాధి పొందగా - అప్పుడు సాక్షాత్తు విశ్వకవే ప్రత్యక్షమయాడని ప్రతీతి! ఏటేట గోపయ్యగారు దేవీ నవరాత్రులు చేసేవారు. ఆఖరు రాత్రి ఆయన "త్రిపుర సుందరినే తెలుసుకుంటి" అని వీణాగానం చేస్తూంటే అక్కడున్న వారందరికీ అంబాత్రయ సాక్షాత్కారం లభించేదట! కాని - ఆ సంగీత జ్ఞానం ఆయనతోనే అంతరించిపోయింది. ఆయన ఒక్కడే తరించాడు కాని మరెవ్వరికీ అందజేశాడు. కాదు - మరెవ్వరికీ ఉపకారం చేశాడు కాదు. నాదబిందుకళని మరీ స్వానుభవవేద్యం చేసేశాడాయన. జావళీ మీద నాన్న విముఖత గ్రహించి గోపయ్యగారు వీణ మీటించి "శ్రీ సుబ్రహ్మణ్యాయ నమస్తే!" అన్న దీక్షితులవారికృతి శ్లేషగా నాన్నని సంబోధించి పాడేసరికి - నాన్న తన్మయం అయిపోయారు! ఆ కృతికూడా గోపయ్యగారు నాకప్పుడే నేర్పారు.

.....కాశ్మీరం రోజుల్లో శాస్త్రి ఇంగ్లీషు పాటొకటి పాడేదు:


ఈ పుడమిలో
నీ ఒక్కర్తునే నా స్త్రీ - నీ వక్కడవే నా ప్రియుడవు
అటులైతే ప్రపంచం యెటులైనా కానీ!
అనాదినుంచీ
అదెమ్మకు మల్లె - ఆదయ్యకు మల్లె
నవ్వులతో పువ్వులతో సరసంతో సంసారం!
యీ ప్రపంచం
ఒక కందర్ప వనం - మనకిద్దరికొరకే ప్రత్యేకం
ఆశలు వూసులు కోర్కెలు రేపించే యీ లోకం!
మన్మథ పట్నం
మకరపతాకం మధురరాగం - మన సంతోషం హాయి నిరాటంకం
మన సైయ్యాటలు పాటలు నీటులు నిరాఘాటం!
యీ మేదిని
నీవే-నా వలపుల రాణిని - నా మదనకామరాజువు నీవే
రాజుగ రాణిగ మనదే - మారుని రాజ్యం!
వెన్నెల పండుగలో
పాడెదనా ప్రేమగీతిక నీ చెవిలో - వికసించును నీ నవ్వులు నా యెదలో
మన ప్రణయం మన కాహారం పంచభక్ష్య పరమాన్నం!
అటులైతే
మన కింకేం కావాలి? - ప్రపంచం తలక్రిందులు కానీ
భూచక్రం యెటులైన పోనీ!

ఆ పాటకు జవాబుగా నేను : "కమలాక్షి నిన్నే కోరియున్నది కరుణింప మంచి సమయము స్వామీ!" అని వర్ణం పాడితే - శాస్త్రి "ఇదేమిటి సానిపాట!" అని ముఖం తిప్పేశాడు - నాన్నలాగే శాస్త్రికూడా!

.....ఈ మధ్య సినీమాలో విన్న సంగీతమే జ్ఞాపకం వస్తూంది.

- ఇంకా వుంది.

ఏక కణ కేంద్రక పూర్వ జీవుల రాజ్యం ఏది ?



డీఎస్సీ బయాలజీ

1. వర్గీకరణ అంతస్తులో పెద్దది ఏది ?
1. రాజ్యం 2. వర్గం
3. కుటుంబం 4. రంగం

2. పిండోత్పత్తి శాస్త్రానికి నాంది పలికిన శాస్త్రవేత్త ఎవరు ?
1. అరిస్టాటిల్ 2. లూయిస్ పాశ్చర్
3. విలియమ్ హార్వే 4. ఆంటోనీ వాన్ లీవెన్ హుక్

3. కిందివాటిలో హైదరాబాద్‌లో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి ?
ఎ. NIN (National Institute of Nutrition)
బి. NIO (National Institute of Oceanography)
సి. ICRISAT (International Crops Research Institute for the Semi-Arid Tropics)
డి. NIV (National Institute of Virology)
1. ఎ, డి 2. బి, సి
3. బి, డి 4. ఎ, సి

4. జతపరచండి
శాస్త్రవేత్త
a. డార్విన్ b. చార్లెస్ లయెల్
c. మాల్థస్ d. రుడాల్ఫ్ విర్చోవ్
గ్రంథం
i. అమ్నిస్ సెల్యులా డే సెల్యులే ii. ఆరిజిన్ ఆఫ్ ది స్పీసిస్
iii. ప్రిన్సిపుల్స్ ఆఫ్ జియాలజీ iv. అన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పాప్యులేషన్
1. a-i, b-iv, c-iii, d-ii
2. a-iv, b-ii, c-i, d-iii
3. a-ii, b-iii, c-iv, d-i
4. a-iii, b-ii, c-i, d-iv

5. ఒక శాస్త్రవేత్త తన పరిశోధనల కోసం HCl లాంటి ఆమ్ల మాధ్యమంలో కూడా నివసించగలిగే ఏకకణ జీవులను కనుగొన్నాడు. అవి ఏ రాజ్యానికి చెందినవి ?
1. ప్రొటిస్టా 2. మొనిరా
3. ప్లాంటె 4. ఫంజి

6. ద్విపార్శ్వ సౌష్టవం మొదటిసారిగా ఏ వర్గపు జీవుల్లో కనిపించింది ?
1. గుండ్రటి పురుగులు 2. బద్దె పురుగులు
3. వానపాములు 4. కీటకాలు

7. కిందివాటిల్లో ఏ జీవుల్లో మొదటిసారిగా తల, వక్షం, ఉదరం అనే భాగాలు కనిపించాయి?
1. అనెలిడ 2. మొలస్కా
3. ఆర్థ్రోపొడ 4. ఇఖైనోడర్మట

8. అలెగ్జాండర్ ఫ్లెమింగో నోబెల్ బహుమతిని కిందివారిలో ఎవరితో కలిసి పంచుకున్నారు ?
1. విల్కిన్సన్, మేయర్ 2. ఫ్లోరీ, చైన్
3. హార్వే, ఫలాడే 4. మాల్ఫిజీ, హార్వే

9. జతపరచండి.
శాస్త్రవేత్త
a. ఎడ్వర్డ్ జెన్నర్ b. లూయిస్ పాశ్చర్
c. ఎల్లాప్రగడ సుబ్బారావు d. జోనస్ సాల్క్
ఆవిష్కరణ
i. టెట్రాసైక్లిన్ ii. రేబిస్ వ్యాక్సిన్
iii. పోలియో వ్యాక్సిన్ iv. మశూచి వ్యాక్సిన్
1. a-ii, b- iii, c-iv, d-i
2. a-iv, b- ii, c-i, d-iii
3. a-iv, b- iii, c-i, d-ii
4. a-iii, b-ii, c-i, d-iv

10. జీవశాస్త్ర పరిశీలనలో శాస్త్రీయ విధానాన్ని అవలంబించిన వారెవరు ?
1. సర్ రోనాల్డ్ రాస్ 2. లూయిస్ పాశ్చర్
3. అరిస్టాటిల్ 4. ఆంటోనీ వాన్ లివెన్ హుక్

11. కిందివాటిలో హెకెల్ తన వర్గీకరణలో లిన్నియస్ ప్రతిపాదించిన రెండు రాజ్యాలకు దేనిని కలిపాడు ?
1. ఫంజి 2. మొనీరా
3. ప్రొటిస్టా 4. ప్లాంటే

12. కిందివాటిలో పెంటా వాలెట్ వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు తోడ్పడదు ?
1. ధనుర్వాతం 2. హెపటైటిస్
3. కోరింత దగ్గు 4. టైఫాయిడ్

13. కిందివాటిలో 'జాతి'కి సంబంధించి సరికాని వాక్యం ఏది ?
1. అంతర ప్రజననం జరుపుకొనే జీవుల సమూహం
2. గతిశీలమైంది 3. స్థిరమైంది
4. ఒకే కేంద్రక నిర్మాణాన్ని కలిగిఉండే జీవుల సమూహం

14. జతపరచండి
శాస్త్రవేత్త
a. సర్ రోనాల్డ్ రాస్ b. వాట్సన్, క్రిక్
c. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ d. హరగోవింద్ ఖురానా
నోబెల్ బహుమతి పొందిన సంవత్సరం
i. 1902 ii. 1968 iii. 1945 iv. 1962
1. a-i, b-iv, c-iii, iv-2
2. a-iv, b-ii, c-i, iv-iii
3. a-iv, b-iii, c-i, iv-ii
4. a-iii, b-ii, c-i, d-iv

15. వృక్షాల ఫలదీకరణను పరీక్ష నాళికల్లో జరిపే పద్ధతిని కనుగొన్న భారతీయ శాస్త్రవేత్త ఎవరు ?
1. పంచానన్ మహేశ్వరి 2. టి.ఎస్.వెంకట్రామన్
3. బీర్బల్ సహానీ 4. ఎం.ఎస్.స్వామినాథన్

16. ఏక కణ నిజకేంద్రక జీవుల రాజ్యం ఏది ?
1. ప్రొటిస్టా 2. ఫంజి
3. మొనీరా 4. మెటాజోవా

17. పట్టుపురుగు గుడ్లను సూక్ష్మజీవులు పాడుచేస్తాయని కనుగొని, వాటి నిర్మూలించే పద్ధతిని కూడా కనిపెట్టిన శాస్త్రవేత్త ఎవరు ?
1. లూయిస్ పాశ్చర్ 2. ఆంటోని వాన్ లివెన్ హుక్
3. ఆచార్య మహేశ్వరి 4. టి.ఎస్.వెంకట్రామన్

18. పాశ్చరైజేషన్ ప్రక్రియ వల్ల సూక్ష్మజీవులు ఏ పరిస్థితుల్లో మనుగడ సాగించలేవని విద్యార్థి అర్థం చేసుకుంటాడు ?
1. అతి శీతల 2. అతి ఉష్ణ
3. సాధారణ 4. 1, 2

19. 'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత ఎవరు ?
1. నెమేమియా గ్రూ 2. రాబర్ట్ బ్రౌన్
3. ష్వాన్ 4. స్టీఫెన్ హేల్స్

20. 'స్లైమ్ మోల్డ్స్' ఏ రాజ్యానికి చెందినవి ?
1. ఎనిమేలియా 2. ప్రొటిస్టా
3. ఫంజి 4. మొనీరా

21. జంతురాజ్యంలో మొదటి నిజ శరీర కుహర జీవులు ఏవి ?
1. ప్లాటీహెల్మింథిస్ 2. నెమటోడ
3. అనెలిడ 4. పారిఫెర

22. విద్యార్థి... జీవశాస్త్రం చదవడం ద్వారా దోమల వల్ల ఏయే వ్యాధులు వ్యాపిస్తాయని తెలుసుకున్నాడు ?
ఎ. మలేరియా బి. బోదకాలు
సి. డెంగ్యూ డి. మెదడువాపు
1. ఎ, బి 2. ఎ, సి, డి
3. ఎ, బి, సి 4. ఎ, బి, సి, డి

23. కిందివాటిలో లక్నోలో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి ?
1. NBRI (National Botanical Research Institute), IARI (Indian Agricultural Research Institute)
2. CICR (Central Institute for Cotton Research), CRRI (Central Rice Research Institute)
3. NBRI, IISR (Indian Institute of Sugarcane Research)
4. IARI, IISR

24. జోనాస్ సాల్క్, అల్బర్ట్ సాబిన్ అనే శాస్త్రవేత్తలు ఏ వ్యాధి నివారణకు కృషి చేశారు ?
1. కేన్సర్ 2. టైఫాయిడ్ 3. పోలియో
4. డెంగ్యూ

25. పృష్ఠవంశం లేకుండా ఉండి అనేక వ్యాధులను వ్యాప్తిచేసే జంతువులు ఎక్కువగా ఏ వర్గానికి చెందుతాయి ?
1. మమ్మేలియా 2. ఆర్థ్రోపొడ
3. ప్రోటోజోవా 4. నెమటోడ

26. 'జాతి' అనే పదాన్ని తొలిసారిగా వర్ణించిన శాస్త్రవేత్త ఎవరు ?
1. లిన్నియస్ 2. హెకెల్
3. జాన్‌రే 4. హుకర్

27. కిందివాటిలో ఏ వర్గం జీవులు మంచినీటిలో, భూమి మీద నివసించలేవు ?
1. అనెలిడ 2. ఇఖైనోడర్మట 3. మొలస్కా 4. ఆర్థ్రోపొడ

28. నెఫ్రాన్ నిర్మాణాన్ని అంతర్నిర్మాణ శాస్త్రంలో చదివితే, మూత్రం ఏర్పడే విధానాన్ని గురించి ఏ శాస్త్రంలో చదవాలి?
1. సూక్ష్మ అంతర్నిర్మాణ శాస్త్రం 2. శరీర ధర్మ శాస్త్రం
3. అణుజీవ శాస్త్రం 4. జీవ రసాయన శాస్త్రం

29. కేంద్రకాన్ని 'సైటో బ్లాస్ట్' అంటారని ఊహించినవారు ఎవరు ?
1. రాబర్ట్ బ్రౌన్ 2. ష్లీడన్
3. గాల్టీ 4. అరిస్టాటిల్

30. జంతు కణాలకు కణ కవచం ఉండదని కనుగొన్నవారు ఎవరు ?
1. రుడాల్ఫ్ విర్చోవ్ 2. థియొడర్ ష్వాన్
3. లివెన్ హుక్ 4. లూయిస్ పాశ్చర్

31. ఫంజి రాజ్యానికి సంబంధించి కిందివాటిలో సరికాని వాక్యం ఏది ?
1. అన్నీ బహుకణ జీవులు
2. ఎక్కువ బహుకణ జీవులు, కొన్ని ఏకకణ జీవులు
3. ఎక్కువ శాతం సిద్ధ బీజాలను ఉత్పత్తి చేస్తాయి
4. పైవన్నీ సరైనవే

32. 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ షుగర్‌కేన్ రీసెర్చ్' అనే సంస్థ ఏ నగరంలో ఉంది ?
1. నాగ్‌పూర్ 2. పుణె 3. లక్నో 4. కటక్

33. కిందివాటిలో ద్వినామీకరణంలో దేనిన తిరిగి ఉపయోగించవచ్చు ?
1. కుటుంబం 2. ప్రజాతి 3. జాతి 4. తరగతి

34. జీవ పరిణామానికి ఉపయోగపడే, భూమి మీద వదిలిన గతించిన జీవుల అవశేష నిదర్శనాలు ఏవి ?
1. ఇంధనాలు 2. ఎముకలు
3. పాదముద్రలు 4. శిలాజాలు

35. 'మున్‌జెల్లి' ఏ వర్గానికి చెందినది ?
1. పొరిఫెర 2. టినోఫొర 3. ఇఖైనోడర్మట 4. నెమటొడ

36. జంతురాజ్యంలో మొదటి త్రిస్తరిత (Triploblastic) జీవులు ఏ వర్గానికి చెందినవి ?



1. అనెలిడ
2. మొలస్కా 3.ప్లాటీ హెల్మింథిస్ 4. ఆర్థ్రోపొడ

37. జంతురాజ్యంలో మొదటిసారిగా సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ ఏ జీవుల్లో కనిపించింది ?
1. మొలస్కా 2. ఆర్థ్రోపొడ
3. అనెలిడ 4. పొరిఫెరా

38. మార్షల్, వారెన్ కిందివాటిలో దేనిపై పరిశోధనలు జరిపారు ?
1. కలరా బాక్టీరియా
2. క్షయ బాక్టీరియా
3. అల్సర్ బాక్టీరియా 4. ప్లేగు బాక్టీరియా

39. నాలుగు రాజ్యాల వర్గీకరణను ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు ?

40. MMR (Measles, Mumps, and Rubella) వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు ఉపయోగిస్తారు ?
1. బాక్టీరియల్ 2. వైరల్ 3. 1, 2 4. ఫంగల్

41. కిందివాటిలో విట్టేకర్ వర్గీకరణలో ఉండి, కోప్‌లాండ్ వర్గీకరణలో లేని రాజ్యం ఏది ?
1. ప్రొటిస్టా 2. ఎనిమేలియా
3. ఫంజి 4. మొనీరా

42. 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫైకాలజీ' అని ఎవరిని పేర్కొంటారు ?
1. వెంకట్రామన్ 2. స్వామినాథన్
3. అయ్యంగార్ 4. బీర్బల్ సహానీ

43. 'ద్వినామీకరణం'లో మొదటి పదం దేన్ని సూచిస్తుంది ?
1. ప్రజాతి 2. జాతి
3. ఉపజాతి 4. కుటుంబం

44. భూమి మీద ఉన్న మొక్కలు, జంతువుల విస్తరణను తెలిపే జీవశాస్త్ర శాఖ ఏది ?
1. జంతు భౌగోళిక శాస్త్రం 2. జంతు భూ విజ్ఞాన శాస్త్రం
3. ఆర్నిథాలజీ 4. ఫైకాలజీ

45. పరాశురుడు భూచర మొక్కలను ఏ లక్షణం ఆధారంగా వర్గీకరించాడు ?
1. ఆయుర్వేద గుణం 2. పుష్ప లక్షణం
3. ఆవాసం 4. ఏదీ కాదు

46. 'ద్వినామీకరణం'ను ఏ సంవత్సరంలో ప్రతిపాదించారు ?
1. 1856 2. 1758 3. 1859 4. 1885

47. కిందివాటిలో ఏ రాజ్యానికి చెందిన జీవులు అతి పురాతనమైనవి ?
1. ప్రొటిస్టా 2. ఫంజి
3. మొనీరా 4. ప్లాంటే

48. ఏక కణ కేంద్రక పూర్వ జీవుల రాజ్యం ఏది ?
1. మోనీరా 2. ప్రొటిస్టా
3. ఫంజి 4. ఎనిమేలియా

49. నవీన జీవుల కంటే పురాతనమైన జీవులు.. ?
1. సరళమైనవి 2. సంక్లిష్టమైనవి
3. చెప్పలేం 4. అభివృద్ధి చెందినవి

50. వివృత రక్త ప్రసరణ మొదటిసారిగా ఏ జీవుల్లో కనిపించింది ?
1. ఇఖైనోడర్మట 2. మొలస్కా
3. అనెలిడ 4. ఆర్థ్రోపొడ

సమాధానాలు

1. 4	2. 1	3. 4	4. 3	5. 2	6. 2
7. 3	8. 2	9. 2	10. 3	11. 3	12. 4
13. 3	14. 1	15. 1	16. 1	17. 1	18. 4
19. 1	20. 3	21. 3	22. 4	23. 3	24. 3
25. 2	26. 3	27. 2	28. 2	29. 2	30. 2
31. 1	32. 3	33. 3	34. 4	35. 2	36. 3
37. 3	38. 3	39. 3	40. 3	41. 3	42. 3
43. 1	44. 1	45. 2	46. 2	47. 3	48. 1
49. 1	50. 4				

ఫోర్టిస్ అంశాన్ని పరిశీలిస్తున్నాం: సెబీ

ఢిల్లీ: ఫోర్టిస్ హెల్త్‌కేర్ వివాదానికి సంబంధించిన విషయాన్ని పరిశీలి స్తున్నామని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వెల్లడించింది. ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు చెందిన ఫోర్టిస్ హాస్పిటల్స్ నుంచి కంపెనీ ప్రమోటర్లుగా ఉన్న సింగ్ సోదరులకు రూ.500కోట్ల రుణం ఇవ్వడంపై వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. బోర్డు అనుమతి లేకుండా వీళ్లు రుణం తీసుకున్నారు. ఈ మేరకు సెబీ ఫోర్టిస్ అంశాన్ని పరిశీలిస్తోంది. శనివారం ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు సెబీ ఈ విషయంపై నోటీసులు కూడా పంపించింది. ఈ నోటీసులపై ఫోర్టిస్ స్పందిస్తూ.. స్వల్ప కాలిక పెట్టుబడుల కింద ఏడాది క్రితం ఈ రుణాన్ని ఇచ్చామని, పూర్తి హామీతో షరతులకు లోబడే ఇచ్చామని వెల్లడించింది. ముందుగా నిర్దేశించుకున్న గడువు ప్రకారం వారు రుణం తీర్చేస్తారని తాము విశ్వసిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

ఈ వివాదంతో ఇప్పటికే సింగ్ సోదరులు మల్వీందర్ మోహన్ సింగ్, శివీందర్ మోహన్ సింగ్‌లు కంపెనీ బోర్డుకు రాజీనామా చేశారు. అయితే రుణం తిరిగి చెల్లించడం లేదా పద్దులో చూపించేంత వరకు రెండో త్రైమాసిక ఫలితాల ఆడిట్ పత్రాలపై సంతకం చేయబోమని డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ పేర్కొనట్లు తెలుస్తోంది.

'బాబ్రీపై వెనక్కితగ్గం'

న్యూఢిల్లీ: అయోధ్య అంశంపై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) స్పష్టం చేసింది. బాబ్రీ మసీదు ఇస్లాం విశ్వాసంలో కీలక భాగమని, ముస్లింలు మసీదును ఎన్నటికీ వదులుకోరని ఓ ప్రకటనలో పేర్కొంది. మసీదు భూమిని బదలాయించడం లేదా మసీదు భూమి మార్పిడికి అంగీకరించబోమని తేల్చిచెప్పింది.

బాబ్రీ మసీదు పునర్నిర్మాణ పోరాటం కొనసాగుతుందని పేర్కొంది. మరోవైపు అయోధ్య వివాదంపై రాజీ ఫార్ములాను ప్రతిపాదించిన మౌలానా సల్మాన్ నద్వీని బోర్డు నుంచి బహిష్కరిస్తున్నట్లు ఏఐఎంపీఎల్‌బీ తెలిపింది. బాబ్రీ మసీదు వ్యవహారంపై బోర్డు రాజీలేని వైఖరిని కొనసాగిస్తుందని తేల్చిచెప్పినా సభ్యుడు సల్మాన్ నద్వీ బోర్డు వైఖరికి వ్యతిరేకంగా మాట్లాడటంతో విధిలేని పరిస్థితుల్లో ఆయనపై వేటు వేసినట్లు వెల్లడించింది. నద్వీని తొలగించాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించిందని ఏఐఎంపీఎల్‌బీ సభ్యుడు సయ్యద్ ఖాసిం రసూల్ ఇల్యాస్ చెప్పారు.

శిరోముండనంతో మహిళ లెక్చరర్ నిరసన



భోపాల్: గత కొంతకాలం నుంచి తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలంటూ గెస్ట్ లెక్చరర్లు ఆందోళన చేస్తున్నారు. కానీ మధ్యప్రదేశ్ ప్రభుత్వం మాత్రం వీరి ఆవేదనను అర్థం చేసుకోవడం లేదు. కనీసం ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తమ సమస్యలను వినడం లేదంటూ కాంట్రాక్ట్ లెక్చరర్లు వాపోతున్నారు. రాజధాని భోపాల్‌లో వందలాది గెస్ట్ లెక్చరర్లు సమావేశమై తమ డిమాండ్ల సాధన కోసం చర్చించారు. ప్రభుత్వంలో కదలిక వచ్చేవరకూ ఆందోళనను విరమించేది లేదని, తమ పోరాటాన్ని మరింత ఉధృత చేయాలని నిర్ణయించు కున్నారు. ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఓ మహిళా గెస్ట్ లెక్చరర్ గుండు కొట్టించుకుని (శిరోముండనంతో) నిరసన తెలిపారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఎన్ని పర్యాయాలు విజ్ఞప్తి చేస్తున్నా, ఆందోళన చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని మా మహిళా లెక్చరర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం శివరాజ్ సింగ్ ఇప్పటికైనా తమ సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కార మార్గం చూపించాలని కోరారు.

క్రిప్టోకరెన్సీలపై త్వరలో నిబంధనావళి

సెబీ వర్గాలు వెల్లడి



న్యూఢిల్లీ: క్రిప్టోకరెన్సీలపై త్వరలోనే ఓ నిబంధనావళితో వస్తామని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ స్పష్టం చేసింది. నిన్న మొన్నటిదాకా ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన బిట్‌కాయిన్ విలువ ప్రస్తుతం నేలచూపులు చూస్తున్న విషయం తెలిసిందే. ఎంతైతే వేగంగా పెరిగిందో, తిరిగి అంతే స్థాయిలో అమాంతం పడిపోతున్నాయి బిట్‌కాయిన్ ధరలు. ఈ నేపథ్యంలోనే మదుపరుల ప్రయోజనాల రక్షణార్థం తప్పక నిబంధనలను తీసుకురానున్నట్లు సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి తెలిపారు. బడ్జెట్ అనంతర సంప్రదాయంలో భాగంగా శనివారం ఇక్కడ సెబీ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా త్యాగీ విలేఖరులతో మాట్లాడుతూ బిట్‌కాయిన్‌సహా అన్ని క్రిప్టోకరెన్సీలు భారత్‌లో చట్టవ్యతిరేకమేనని ఇప్పటికే జైట్లీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఓ కమిటీ పరిశీలిస్తున్నదన్న ఆయన కమిటీ సిఫార్సులు వచ్చాక.. అందులో సెబీ పాత్రపై స్పష్టత వస్తుందన్నారు. కాగా, కార్పొరేట్ బాండ్ల ద్వారా 25 శాతం నిధుల సమీకరణపై సెప్టెంబర్‌కల్లా నిబంధనలను విడుదల చేస్తామని త్యాగీ చెప్పారు. ఇక బ్యాంక్ డిపాజిట్లకు మ్యూచువల్ ఫండ్స్ ప్రత్యామ్నాయం కావని, మరింత లాభాలను ఆశిస్తూ బ్యాంక్ డిపాజిట్ల నుంచి తమ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్‌లోకి డిపాజిటర్లు మార్చుతున్న నేపథ్యంలో ఈ పెట్టుబడులకు నిర్దిష్ట లాభాలు ఉంటాయనుకోరాదని త్యాగీ హితవు పలికారు. అయినప్పటికీ క్యాపిటల్ మార్కెట్లలోకి రావడానికి రిటైల్ మదుపరులకు మ్యూచువల్ ఫండ్స్ చక్కని మార్గంగా అభివర్ణించారు.

తర్వాతి సమావేశంలోనే..

కార్పొరేట్ పరిపాలనకు సంబంధించి కొత్త నిబంధనలపై చర్చ సెబీ తర్వాతి బోర్డు సమావేశంలోనేనని త్యాగీ తెలిపారు. స్టాక్ మార్కెట్‌లోని సంస్థల కోసం కార్పొరేట్ గవర్నెన్స్‌పై ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలో ఏర్పడిన సెబీ ఉన్నత స్థాయి కమిటీ.. గతేడాది అక్టోబర్ 5నే తమ నివేదికను సమర్పించింది. 177 పేజీల ఈ నివేదికలో కమిటీ కొన్ని సూచనలను చేయగా, వాటిపై ప్రజాభిప్రాయాలనూ సేకరించింది.

తిరోగమన చర్యేమీ కాదు..

విదేశాల్లో తమ సూచీల ట్రేడింగ్‌ను ఆపేయాలని దేశీయ స్టాక్ మార్కెట్లు తీసుకున్న నిర్ణయాన్ని తిరోగమన చర్యగా అనుకోవడం లేదని త్యాగీ అన్నారు. ఈ నిర్ణయాన్ని ఓ వాణిజ్యపరమైన నిర్ణయంగా అభివర్ణిస్తూ.. దేశం నుంచి విదేశాలకు వెళ్లిపోతున్న సంపదను కట్టడి చేసేందుకే ఈ చర్యని తెలిపారు. తమ ద్రవ్యలభ్యతను స్వదేశానికే పరిమితం చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు కోరుకుంటున్నాయన్నారు.

ఇంకొన్ని రోజులు స్టాక్ మార్కెట్లకు ఊగిసలాటే..

ఢిల్లీ: బడ్జెట్.. ఆర్‌బీఐ సమీక్ష.. అమెరికా మార్కెట్ల పతనం ఇలా వరుస పరిణామాలతో కొన్ని రోజులుగా దేశీయ మార్కెట్లు అల్లక ల్లోలంగా మారిన విషయం తెలిసిందే. బడ్జెట్‌కు ముందు వరకు రికార్డుల జోరు కొనసాగించిన సూచీలు.. ఆ తర్వాత భారీ నుంచి నష్టాలను మూటగట్టు కుంటూ వస్తున్నాయి. అయితే ఈ నష్టాల పరంపర మరిన్ని రోజులు ఉండొచ్చని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ అభిప్రాయపడింది. అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా మరికొద్ది రోజులు మార్కెట్లు ఊగిసలాడే అవకాశముందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. అయితే మదు పర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు. కాగా.. దీర్ఘకాల మూలధన పన్ను (ఎల్‌టీసీజీ)పై వస్తున్న వార్తలపై సెబీ వర్గాలు స్పందిచాయి. ఇప్పటి వరకు ఎల్‌టీసీజీ పన్నుకు వ్యతిరే కంగా మదుపర్ల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని, మార్కెట్లపై ఎల్‌టీసీజీ పన్ను ప్రభావం లేదన్నది మాత్రం పూర్తిగా నిజం కాదని అభి ప్రాయ పడుతున్నారు.. అయితే ఎల్‌టీ సీజీ పన్ను వల్ల కూడా మార్కెట్లు కొంత నష్టపోయాయని.. అయితే చాలా వరకు అంతర్జాతీయ మార్కెట్ల వల్లే కుదేలై నట్లు వారు చెప్పారు. ఇటీవల రూ. లక్ష పైబడిన ఈక్విటీ లాభాలపై 10 శాతం ఎల్‌టీసీజీ పన్నును విధిస్తు న్నట్లు కేంద్ర బడ్జెట్‌లో అరుణ్‌జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్కెట్లు నష్టాల బాట పట్టాయి. ఈ ప్రభావం ఉండగానే.. అమెరికా మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. దీంతో దేశీయ సూచీలు కూడా కుప్పకూ లాయి. రోజుల వ్యవధిలోనే సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా కోల్పో యింది. రూ.లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లోనూ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనే చవిచూశాయి.

సీట్ల బేరానికే బీఎస్పీ, జేడీఎస్ పొత్తు : కాంగ్రెస్

న్యూఢిల్లీ: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ-జేడీఎస్ పొత్తు కేవలం ఎత్తుడగ మాత్రమేనని కాంగ్రెస్ అభిప్రాయపడింది. బీఎస్పీ అధినేత్రి మాయావతి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి కనీసం గుణపాఠం నేర్చుకోలేదని నిందించింది. కర్నాటక ఎన్నికల్లో కలిసి పనిచేయను న్నట్లు బీఎస్పీ-జేడీఎస్ ప్రకటిం చాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ పొత్తు కొనసాగుతుందని బీఎస్పీ నేత సతీష్‌చంద్ర మిశ్రా, జేడీఎస్ నేత డానిష్ అలీ గురువారం వెల్లడించారు. మాయావతి ప్రతి అడుగూ రాజకీయమేనని, సీట్ల బేరసారాలు అమె లక్ష్యమని కాంగ్రెస్ నాయకుడు ఎంపీ రాజీవ్ గౌడ పీటీఐతో అన్నారు. మాయావతి నిర్ణయాల వల్ల ఉత్తర ప్రదేశ్‌లో రెండుసార్లు ఓట్లు చీలిపో యాయని, అయినా ఆమె గుణపాఠం నేర్చుకోవడం లేదని రాజ్యసభ ఎంపీ రాజీవ్ అన్నారు. యూపీలో కాంగ్రెస్ పార్టీ ముక్కోణపు పోటీని ఎదుర్కొంటే బీజేపీ స్వీప్ చేసిందని, మాయావతి 20శాతం ఓట్లు సాధించినా ఒక్క సీటు గెలుచుకోలేకపోయారని ఆయన ఆరోపించారు.

ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాటం చేద్దామని కాంగ్రెస్ పిలుపునిచ్చిందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మతోన్మాద ఎజెండా గల బీజేపీని ఓడించడానికి రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎన్నికలకు వెళ్లడానికి కలిసి రావాలని ఆయన కోరారు. తదు పరి ప్రధాని అభ్యర్థి ఎవరని ప్రశ్నిం చగా రాహుల్ గాంధీయేనని రాజీవ్ చెప్పారు. సేవ్ ఇండియా నినాదంతో వచ్చే ఎన్నికలను ఎదుర్కొంటామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఆమోదయోగ్యమైన రాహుల్ నాయ కత్వంలోనే ఎన్నికలకు వెళతామని పునరుద్ఘాటించారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించడానికి సంఘ్ పరివార్ పదేపదే ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

'నితీశ్.. చివరకు ఆ గతే పడుతుంది'



పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై లాలూ తనయుడు-ఆర్జేడీ యువ నేత తేజస్వి యాదవ్ సెటైర్లతో విరుచుకుపడ్డాడు. బీజేపీకి లొంగిపోయి బిహార్ గౌరవాన్ని కేంద్రం కాళ్ల దగ్గర పెట్టారని నితీశ్‌పై మండిపడ్డాడు. ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో వరుసగా ట్వీట్లు చేశారు. 'బీజేపీ కనుసన్నలో నితీశ్ పాలన నడుస్తోంది. అధికారంలో ఉన్నా జేడీయూ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం చేయలేకపోతోంది. ఈ పరిణామాలతో అసంతృప్తిగా ఉన్న నేతలు ఒక్కొక్కరుగా జేడీయూను వీడుతున్నారు. త్వరలో ఆ పార్టీ ఖాళీ కావటం ఖాయం. నితీశ్ మరోదారి లేక తన పార్టీని బీజేపీతో విలీనం చేసి.. హస్తినలో పాగా వేస్తారు. చివరకు ఏదో ఒక రాష్ట్రానికి ఆయన గవర్నర్ అయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు''అంటూ తేజస్వి పేర్కొన్నారు. కాగా, త్వరలో బీహార్‌లో ఉప ఎన్నికలు(రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి) ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ సూచనల మేరకు పోటీ చేయొద్దని జేడీయూ నిర్ణయించుకుంది.

ఇందులో అరారియా లోక్‌సభ స్థాన ఎంపీ తస్లీముద్దీన్ మరణంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. అయితే ఆయన తనయుడు, ఎమ్మెల్యే సర్ఫరాజ్ అలం ముందుగా పోటీ చేయాలని భావించారు. కానీ, జేడీయూ పోటీ నుంచి తప్పుకోవటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఆయన ఆర్జేడీలో చేరిపోయారు. ప్రస్తుతం అరారియా నుంచి సర్ఫరాజ్ ఆర్జేడీ తరపున పోటీచేయనున్నారు. ఇక మిగతా రెండు అసెంబ్లీ స్థానాల్లో కూడా పోటీ చేయబోమని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు వశిష్ట నారాయన్ సింగ్ శనివారం ప్రెస్ మీట్‌లో వెల్లడించారు.

2020 నాటికి

275 మిలియన్ల కేజీలకు చేరనున్న 'టీ' ఎగుమతులు



2017లో భారతీయ 'టీ' ఎగుమతులు రికార్డుస్థాయిలో 240.7 మిలియన్ కేజీలకు చేరుకుంది. ప్రధానంగా 1981లో 241.3 మిలియన్ కేజీల ఎగుమతైన టీ ప్రస్తుత టీ ఎగుమతులు రికార్డు సృష్టించినట్లు టీ బోర్డు వెల్లడించింది. టీ ప్రధాన దిగుమతుదారులైన ఐదు దేశాల్లో శ్రీలంక, చైనా దేశాలు భారత్‌కు పోటీగా ఎగుమతులు చేయడంతో అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను ప్రముఖ స్థానంలో నిలిచేందుకు తోడ్పడ్డారు. అమెరికాతో సహా పలు దేశాలు భారతీయ టీ పట్ల మక్కువచూపిస్తారు. కేజీ టీ ధర సరాసరి కంటే ఎక్కువగా మూడుడాలర్లకు ఎగుమతి చేయడం జరుగుతోంది. 2020నాటికి 275 మిలియన్ల కేజీల టీని ఎగుమతి చేయడంతో 15శాతం టీ ఎగుమతులు పెరుగుతాయని తెలుస్తోంది. 2016లో 222.5 మిలియన్లకేజీల టీని ఎగుమతి చేయడం జరిగింది. ఆ సమయంలో కేజీ టీని అత్యధికంగా 3.1 డాలర్లకు ఎగుమతి చేసారు. ముఖ్యంగా టీ ఎగుమతులు 8.2శాతం పెరిగి విలువలో 5.9 శాతంతో రూ.4731.7 కోట్లు విలువ పలికింది. డాలర్లలో టీ ఎగుమతులు 9.3శాతం పెరిగి 726.7 మిలియన్లకు చేరింది. 2017లో భారతీయ టీని ఎక్కువగా తూర్పు, దక్షిణ ప్రాంతాలనుండి అత్యధికంగా ఎగుమతులు చేసారు. ఎక్కువగా ఈజిప్టు 166శాతం దిగుమతి చేసుకుంది. శ్రీలంక 84.4శాతం, చైనా 50 శాతం టీ దిగుమతి చేసుకున్నట్లు నమోదైంది. ఇరాన్ 28మిలియన్ కేజీల టీని దిగుమతి చేసుకున్నారు. దీనితో ఇరాన్ దిగుమతులు 10మిలియన్ కేజీలుగా నమోదైంది. చైనా కూడా అత్యధికంగా 8.3 మిలియన్ కేజీలు బ్లాక్ టీని దిగమతి చేసుకుంది. యువతలో దీనికి ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఎగుమతులకు పెరగడానికి ప్రధానకారణం క్వాలిటీతోపాటు ప్యాకేజింగ్‌కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 2017నుండి భారతదేశానికి చెందిన టీని అమెరికా, రష్యా, ఆస్ట్రేలియ, జర్మనీ, చిలీ దేశాల్లో ఆహార ఉత్పత్తుల్లో ప్రధాన ప్రదర్శనలో భాగంగాఉంది. ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సబ్సిడీని 5శాతం నుండి 11శాతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం మరింత సహకరించిందని టీ బోర్డు చైర్మన్ ఈ సందర్భంగా వెల్లడించారు.

క్రిప్టో సంపన్నుల్లో లార్సన్ టాప్

- తొలిసారి జాబితా ప్రకటించిన ఫోర్బ్స్
- ప్రపంచ వ్యాప్తంగా 1,500 క్రిప్టోకరెన్సీలు
- వాటి మొత్తం విలువ రూ.35.75 లక్షల కోట్లు



న్యూయర్క్: క్రిప్టోకరెన్సీలో అత్యంత సంపన్నులైన వ్యక్తుల జాబితాను ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ఫోర్బ్స్ తొలిసారి విడుదల చేసింది. రిపుల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు క్రిస్ లార్సన్ దాదాపు 800 కోట్ల డాలర్ల విలువైన నికర సంపదతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆధారిత సీక్రెట్ అల్గారిథమ్స్‌ను ఉపయోగించి రూపొందించే క్రిప్టోకరెన్సీల విలువ ఇటీవలి కాలంలో గణనీయంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. ప్రపంచంలో అత్యంత సాధారణ క్రిప్టోకరెన్సీలుగా పేరు తెచ్చుకున్న బిట్‌కాయిన్, ఎథేరియం, ఎక్స్ఆర్‌పీ లాంటి కరెన్సీల సగటు విలువ 2017లో గణనీయంగా 14,409 శాతం పెరిగిందని, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1,500 రకాల క్రిప్టోకరెన్సీలు చెలామణిలో ఉన్నాయని, 2017 ఆరంభం నుంచి వీటి మొత్తం విలువ 31 రెట్లు పెరిగి 55 వేల కోట్ల డాలర్ల (రూ.35,75,000 కోట్ల)కు చేరుకున్నదని ఫోర్బ్స్ పత్రిక వెల్లడించింది. క్రిప్టోకరెన్సీ పరంగా అత్యంత సంపన్నులైన వ్యక్తుల జాబితాలో జోసఫ్ లుబిన్ (నికర సంపద 100 కోట్ల డాలర్ల నుంచి 500 కోట్ల డాలర్లు), చాంగ్‌పెంగ్ జావో (110 కోట్ల నుంచి 200 కోట్ల డాలర్లు), కామెరాన్ అండ్ టేలర్ వింక్‌లెవోస్ (90 కోట్ల నుంచి 110 కోట్ల డాలర్లు), మాథ్యూ మెల్లెన్ (90 కోట్ల నుంచి 110 కోట్ల డాలర్లు)తో పాటు బ్రియాన్ ఆర్మ్‌స్ట్రాంగ్, మాథ్యూ రొస్జెక్, ఆంథోనీ డీ ఇయోరియో, బ్రాక్ పియర్స్, మైఖేల్ నొవోగ్రట్జ్, బ్రెండన్ బల్మర్, డాన్ లారీమర్, వాలెరీ వవిలోవ్, చార్లెస్ హాస్కిన్సన్, బ్రాడ్ గార్లింగ్‌హౌస్, బ్యారీ సిల్బెర్ట్, విటాలిక్ బుటెరిన్, టిమ్ డార్పర్, సంగ్ చి-హ్యూంగ్ తదితరులు ఉన్నారని ఆ పత్రిక ప్రకటించింది. కనీసం 35 కోట్ల డాలర్ల సంపదను కలిగివున్న సంపన్నులతో ఈ జాబితాను రూపొందించామని, ఈ జాబితాలో చోటు దక్కించుకున్న వ్యక్తుల సగటు వయసు 42 ఏళ్లుగా ఉన్నదని ఫోర్బ్స్ వివరించింది.

నీటి బుడగ లాంటిదే..

త్వరలో క్రిప్టోకరెన్సీల విలువ జీరో: గోల్డ్‌మన్ సాచ్స్

బిట్‌కాయిన్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రిప్టోకరెన్సీలన్నీ నీటి బుడగ లాంటివేనని, త్వరలోనే వీటి విలువ సున్నాకు పడిపోడం ఖాయమని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాచ్స్ స్పష్టం చేసింది. క్రిప్టోకరెన్సీ మార్కెట్‌ను 1990వ దశకం చివర్లో తెరమీదికి వచ్చిన ఇంటర్నెట్ సంక్షోభంతో పోల్చింది. ప్రస్తుతమున్న క్రిప్టోకరెన్సీలు దీర్ఘకాలం పాటు మనుగడ సాగించలేవని, వీటికి ప్రత్యామ్నాయాలు వచ్చిన వెంటనే క్రిప్టోకరెన్సీలన్నీ కనుమరుగైపోతాయని గోల్డ్‌మన్ సాచ్స్ పరిశోధన విభాగం అధిపతి స్టీవ్ స్ట్రాంగిన్ పేర్కొన్నారు. క్రిప్టోకరెన్సీలు విలువ కోల్పోవడం వలన దాదాపు 50 వేల కోట్ల డాలర్ల (రూ.32.50 లక్షల కోట్ల) సంపద ఆవిరైపోతుందని ఆయన తెలిపారు.

క్రిప్టోకరెన్సీలు ఎప్పటిలోగా కనుమరుగవుతాయో స్పష్టంగా చెప్పలేమని, ఎటువంటి కారణాలు లేకుండా విలువ పెరిగిన ఆ కరెన్సీలు గత కొంత కాలం నుంచి క్రమంగా పతనమవుతున్నాయని, అన్ని రకాల క్రిప్టోకరెన్సీలు ఒకేరకంగా విలువ కోల్పోతుండటం ఆందోళనకరమని ఆయన అన్నారు. లావాదేవీలు నెమ్మదిగా జరగడం, నిర్వహణా వ్యయం చాలా ఎక్కువగా ఉండటం, భద్రతా పరమైన సవాళ్లు గణనీయంగా పెరిగిపోవడం క్రిప్టోకరెన్సీలకు సమస్యగా మారిందన్నారు. ఒకవేళ క్రిప్టోకరెన్సీలు మళ్లీ పుంజుకుని వాటి విలువ పెరిగినప్పటికీ గత వైభవం మాత్రం దక్కబోదని స్ట్రాంగిన్ స్పష్టం చేశారు.

విజ్ఞానం

అల్ట్రాసౌండ్‌తో

40శాతం లివర్‌కేన్సర్లు గుర్తింపు




అల్ట్రాసౌండ్, రక్త పరీక్షతో లివర్‌కేన్సర్‌ను ఇట్టేపసిగట్ట వచ్చునని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సౌత్‌వెస్ట్రన్ మెడికల్ సెంటర్ వెల్లడించింది. 40 శాతం లివర్‌కేన్సర్‌ను ప్రథమ దశలోనే అల్ట్రాసౌండ్ ఇమేజ్‌తో నిర్ధారణ చేయవచ్చునని తెలిపిన ఈ బృందంలో భారతీయ శాస్త్రవేత్త కూడా ఉండటం గమనార్హం. ఇప్పటివరకు ఉన్న పరీక్షలో లివర్ కేన్సర్ రోగిని బ్రతికించడమే ప్రధానుద్దేశంగాఉండేది. తాజాగా చేపట్టిన ఈ అధ్యయనంలో కేన్సర్ రోగి నిర్ధారణతోపాటు చికిత్స చేయడంతో మరిన్ని సంవత్సరాలు జీవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ప్రొఫెసర్ జి అమిత్‌సింగాల్ వెల్లడించారు. లివర్‌కేన్సర్ కారణంగా హెపటో సెల్యులార్ కార్సినోమాతోపాటు హెపటైటిస్ సి ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలంగా ఆల్కాహోల్ వినియోగం, ఫ్యాటీ లివర్‌వ్యాధులు, డయా బెటిస్, ఒబెసిటీతో లివర్‌కేన్సర్ వచ్చే అవకాశాలుఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాధి ఉన్నవారికి పొత్తికడుపు పైన వాపు, నొప్పి,శరీర బరువు తగ్గడం, ఎపిటైట్, విసర్జన తెల్లగాఉండటం ప్రధానలక్షణాలుగా ఉంటాయి.

భవిష్యత్తులో అగ్నిపర్వతాల బూడిదతో నిర్మాణాలు..!



అగ్నిపర్వతాల నుండి వెలువడే బూడిద భవనాలకట్టడాలకు వినియోగించే కాంక్రీట్‌గా పనికొస్తుందని దీనివలన ఖర్చుకూడా భారీగా తగ్గుతుందని తెలు స్తోంది. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చేపట్టిన అధ్యయనంలో ఇప్పటివరకు వినియోగిస్తున్న సిమెంట్‌కు బదులు అగ్నిపర్వతాలనుండి బహిర్గతమయ్యే బూడిద వినియోగంతో కాంక్రీట్‌కు అయ్యే ఖర్చుతగ్గుతుందని తెలుస్తోంది. సుమారు 16శాతం ఖర్చుతగ్గుతుందని అంచనా.. అగ్నిపర్వతపుబూడిద చిన్నచిన్నకణాలతో కూడి పౌడర్‌గా తయారవుతుంది. దీన్ని సిమెంట్‌తో కలిపి 50శాతం నిర్మాణంలో ఉపయోగించడంతో నిర్మాణాలు మరింత పటిష్టంగా ఉంటాయని తెలుస్తోంది.

యువి కిరణాలతో ఫ్లువైరస్ నిర్వీర్యం



మనిషి కణజాలానికి ఎటువంటి హాని చేయకుండా ఫ్లు వైరస్‌లను నిర్వీర్యం చేసే ప్రత్యేకమైన అల్ట్రావయలెట్ కిరణాలను శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. 200 నుండి 400నానోమీటర్ల బ్రాడ్‌స్పెక్ట్రమ్ అల్ట్రా వయలెట్ సి కిరణాలను బాక్టీరియా, వైరస్‌లను మరింత పెరగకుండా చంపివేస్తుందని తెలు స్తుంది. యువి కిరణాలు మనిషి ఆరోగ్యంపైప్రతికూల ప్రభావం చూపు తాయి. వీటివలన స్కిన్ కేన్సర్, కాటరాక్ట్ వృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. ఇది బహిరంగ ప్రదేశాల్లో దాని ఉపయోగాన్ని నిరోధిస్తుందని కొలంబియాయూనివర్సిటీ ఇర్వింగ్ మెడికల్ సెంటర్ రేడియాలజిస్ట్ వెల్లడించారు.



రద్దయిన నోట్ల లెక్కింపు కొనసాగుతోంది..!

ఢిల్లీ: పెద్ద నోట్లు రద్దు చేసి 15 నెలలు గడిచినప్పటికీ రిజర్వు బ్యాంకుకు తిరిగి వచ్చిన నోట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది. రద్దయిన నోట్లు మొత్తం ఎన్ని వచ్చాయో తెలియజేయాల్సిందిగా సహచట్టం(ఆర్టీఐ) ద్వారా ఓ పిటిషన్‌దారుడు కోరాడు. దీనిపై స్పందించిన ఆర్‌బీఐ.. బ్యాంకుల నుంచి వచ్చిన రద్దయిన నోట్ల లెక్కింపు కొనసాగుతూనే ఉందని వెల్లడించింది. జూన్ 30, 2017 వరకు రూ.15.28ట్రిలియన్ రద్దయిన నోట్లు వచ్చాయి. ఎప్పటి లోగా నోట్ల లెక్కింపు పూర్తవుతుందనే ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు ఆర్‌బీఐ నిరాకరించింది. మొత్తం 59 సోఫెస్టికేటెడ్ కరెన్సీ వెరిఫికేషన్ అండ్ ప్రాసెసింగ్(సీవీపీఎస్) యంత్రాలతో నోట్లు లెక్కిస్తున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. అయితే.. ఏయే ప్రాంతాల్లో నోట్ల లెక్కింపు జరుగుందనే విషయాన్ని మాత్రం చెప్పేందుకు విముఖత వ్యక్తం చేసింది. ఎనిమిది సీవీపీఎస్ యంత్రాలతో బ్యాంకుల్లో నోట్ల లెక్కింపు జరుగుతుండగా.. ఏడు సీవీపీఎస్ యంత్రాలతో ఆర్‌బీఐ రీజనల్ కార్యాలయాల్లో నోట్ల లెక్కింపు జరుగుతోంది. 2016, నవంబర్ 8న రూ.500, రూ.1000 నోట్లను మోదీ సర్కారు రద్దు చేసిన విషయం తెలిసిందే. 2016-17 వార్షిక నివేదిక ప్రకారం రూ.15.28లక్షల కోట్ల రద్దయిన నోట్లు తిరిగి బ్యాంకులకు వచ్చి చేరాయి. నోట్ల రద్దు చేసే సమయానికి 1,716.5కోట్ల రూ.500నోట్లు చెలామణీలో ఉండగా.. 685.8కోట్ల వెయ్యి నోట్లు ఉన్నాయి.

బ్యాంక్ ఏటీయంలో పిల్లల కరెన్సీ

కాన్పూర్: కాన్పూర్ ఏటీయంల్లో పిల్లలు ఆడు కునే కరెన్సీ వస్తోంది. ఈ సంఘటనతో దేశం లోని ఏటీఎమ్‌లపై ప్రజల్లో అభద్రతాభావం నెల కొంది. నగరంలోని ఓ ప్రాంతంలో ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఏటీయంలో ఈ నకిలీ నోటు దర్శనమిచ్చింది. ఈ సంఘటనపై వినియోగ దారుడు స్పందిస్తూ "నేను రూ.10,000 డ్రా చేసుకోవడానికి ఏటీయంకు వెళ్లాను. అయితే ఏటీఎమ్ నుంచి వచ్చిన రూ.500 నోట్లలో ఒక నోటుపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని రాసి ఉంది. ఆ నోటును అక్కడే ఉన్న గార్డ్‌కు చూపించాను. గార్డ్ దీన్ని రిజిస్టర్ చేశాడు" అని చెప్పాడు. ఇదే విషయమై సౌత్ కాన్పూర్ ఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తు నిమిత్తం ప్రస్తుతం ఆ ఏటీయంను నిలిపివేశామన్నారు.

రసగుల్ల సృష్టికర్త పోస్టల్ కవర్

కోల్‌కతా: స్వీట్స్‌లో రసగుల్లాది ప్రత్యేక స్థానం. ఈ స్వీట్ తయారీ చేపట్టి ఈ ఏడాదితో 150 ఏళ్లు పూర్తవుతున్నాయి. గతేడాదే జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ గుర్తింపు కూడా పొందింది. ఈ సందర్భంగా రసగుల్లా తయారీదారుడు నవీన్ చంద్ర దాస్ స్మృత్యర్థం పోస్టల్ కవర్‌ను తీసుకురానున్నట్లు ఆశాఖ తెలిపింది. 2020లో చంద్రదాస్ 175వ జయంతి సందర్భంగాఈ పోస్టల్ కవర్ వస్తుందన్నారు.1866లో స్వీట్ షాప్ ప్రారంభించిన నవీన్ చంద్ర.. 1868లో రసగుల్లాలను తయారు చేయడం మొదలుపెట్టారు. బెంగాల్‌లో మొదలైన రసగుల్ల ప్రస్థానం నేడు ప్రపంచమంతా పాకిపోయింది.

ఆటలతో ఎముకలకు పుష్టి

యుక్తవయసులో శరీరం, ఎముకల ఎదుగుదల చురుకుగా, వేగంగా సాగుతుంది. ఒకవేళ దీనికి ఏదైనా అవాంతరం తలెత్తితే ముమ్మందు జీవితాంతం ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఎముక సాంద్రత తగ్గిపోయి.. ఎముకలు క్షీణించటం, తేలికగా విరిగిపోవటం వంటి ముప్పులు పెరుగుతాయి. అందువల్ల యుక్తవయసులో తగినంత శారీరకశ్రమ, వ్యాయామం చేసేలా పిల్లలను ప్రోత్సహించటం ఎంతో మంచిది. ఇవి కుదరకపోతే కనీసం ఆరుబయట ఆటలు ఆడేలా చూసినా మేలే. దీంతో ఎముకల్లోకి క్యాల్షియం బాగా చేరుకుని, ఎముక పుష్టికి తోడ్పడుతుంది. తాజా అధ్యయనం ఒకటి దీన్ని మరోసారి బలపరిచింది. ఫుట్‌బాల్ ఆడటం వల్ల యుక్తవయసు మగపిల్లల్లో ఎముకల వృద్ధి మెరుగ్గా ఉంటున్నట్టు బ్రిటన్‌లోని ఎక్సెటర్ విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొంటోంది. ఈత కొట్టటం, సైకిల్ తొక్కటం వంటి వాటి కంటే కూడా ఫుట్‌బాల్‌తోనే మరింత మెరుగైన ఫలితం కనబడుతుండటం విశేషం. అధ్యయనంలో భాగంగా 12-14 ఏళ్ల భావి క్రీడాకారులను ఎంచుకొని ఏడాది పాటు పరిశీలించారు. ఈత, సైకిల్ క్రీడాకారులతో పోలిస్తే వీరిలో ఎముకలోని ఖనిజాల మోతాదు (బీఎంసీ) మరింత ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. వారానికి 9 గంటల సేపు ఫుట్‌బాల్ సాధన చేసేవారినే తాము పరిశీలించినప్పటికీ.. వారానికి 3 గంటల సేపు ఫుట్‌బాల్ ఆడినా గణనీయమైన ఫలితం కనబడుతుందని పరిశోధకులు చెబుతున్నారు. తీవ్రమైన శారీరకశ్రమను కలగజేస్తూ, కండరాలపై బాగా ప్రభావం చూపే టెన్నిస్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ వంటి క్రీడలు కూడా ఇలాంటి ప్రభావమే చూపగలవని పేర్కొంటున్నారు. కాబట్టి వీలైనప్పుడల్లా పిల్లలను ఆటలు ఆడేలా ప్రోత్సహించటం మంచిది. ఇవి భవిష్యత్తు ఆరోగ్యానికి సోపానాలుగా పనిచేస్తాయి. పెద్దయ్యాక మరింత బలంగా, దృఢంగా ఉండేందుకు కూడా తోడ్పడతాయి.



ఒత్తిడిని తగ్గించుకోండి ఇలా..

ప్రస్తుత ఉరుకులు పరుగులు జీవితంలో ఒత్తిడి అందరికీ ఎదురవుతున్న సమస్య. ప్రతి ఒక్కరు ఎదో రకమైన ఒత్తిడి సమస్యలనుండి బాధపడుతూనే ఉన్నారు. దీర్ఘకాల ఆరోగ్యం కోసం ఒత్తిడిని సమర్ధవంతంగా ఎదుర్కోవడం ఎంతైనా అవసరం. ఇందుకోసం కొన్ని సూచనలు..



వర్క్ నుండి బ్రేక్ తీసుకోవడం

విధి నిర్వహణ మధ్యలో విరామం తీసుకోకపోవడం, చురుకైన జీవన శైలి లేకపోవడం ఒత్తిడి పెరిగిపోవడానికి ప్రధాన కారణం. గంటల తరబడి కదలకుండా కూర్చోవడం కాకుండా, ప్రతి రెండు మూడు గంటలకొకసారి చైర్ పైనుండి లేసి చిన్న వాక్ చేయడం శ్రేయస్కరం. వీలయితే తేలిక పాటి స్ట్రెచ్ ఎక్సర్‌సైజులు చేయడం మరి మంచిది. ఇలా చేయడం వలన రక్తప్రసరణ మెరుగుపడి, చురుగ్గా ఉండేందుకు దోహదపడుతుంది ఎంత చురుగ్గా ఉన్నారంటే ఒత్తిడికి అంత దూరంలో ఉన్నారన్నమాట.

శ్వాశ, ధ్యానం చేయడం

ఒత్తిడి క్షణాలను సమర్ధవంతంగా ఎదుర్కొనే మరొక మార్గం లోతుగా శ్వాస తీసుకోవడం. ఎంత ఒతిడిలో ఉన్న సరే ఒక్కసారి కళ్ళు మూసుకొని లోతైన శ్వాస తీసుకుంటే కాసింత ఉపశమనం కలగడం సర్వ సహజం. ఒత్తిడికి కారణమైన సమస్యని గుర్తించి, దాన్ని నయం చేయడంలో ధ్యానం చాలా ఉపయోగ పడుతుంది. ఇది ఇంకా ఆత్మ విశ్వాసాన్ని పెంచడంలో, శక్తి యుక్తులను పెంచుకోవడంలో కూడా బాగా ఉపయోగపడుతుంది.

స్విమింగ్, వ్యాయామాలు

క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయడం వలన చాల ప్రయోజనాలున్నాయి. వీటివల్ల మొత్తంమీద ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు యవ్వనంగా కూడా కనపడుతారు. వయసు పైబడటాన్ని కూడా వ్యాయామాలు ఆలస్యం చేస్తాయి. ఎక్సర్‌సైజును మించిన స్ట్రెస్ బస్టర్ లేదంటే అతిశయోక్తి కాదు. వాకింగ్, జాగింగ్, జిమ్‌లో బరువులెత్తడం ఎదైనా చేయండి. ముఖ్యంగా స్విమ్మింగ్ ది ఒత్తిడిని తగ్గించడంలో ప్రత్యేక పాత్ర ఉంది. స్విమ్మింగ్ ఒంట్లో ఉన్న అన్ని కండరాలను ఉత్తేజ పరుస్తుంది.

మీకు నచ్చిన ఆటలు ఆడడం

ఆటలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచే సాధనాలు. ఒక గంట మీకు నచ్చిన ఆట ఆడితే ఒత్తిడి రోజునుంచి ఉపశమనం లభించడం ఖాయం. అలాగే స్పోర్ట్స్ పట్టుదలను, పోరాట పటిమను, ధైర్య సాహసాలను పెంచుతాయి కూడా. క్రమం తప్పకుండా ఆటలు ఆడడం వంటి లక్షణాలు మీ ప్రమేయం లేకుండా మీ దైనందిన జీవితంలో భాగమైపోతాయి. తద్వారా మీరు ఒత్తిడిని చాలా సులువుగా ఎదుర్కొంటారు.

సమస్యలు పంచుకోవడం

సమస్యలు పంచుకుంటే తరిగిపోతాయని ఊరకే అనలేదు పెద్దలు. మనలోపల దాచుకున్నంత కాలం అవి ఇంకా పెద్దవి అవుతూనే ఉంటాయి. ఒక్కసారి మనసువిప్పి ఆప్తులతో పంచుకుంటే తెలికగా ఉండడమే కాదు, పరిష్కార మార్గాలు కూడా మెరుగవుతాయి. కొన్నిసార్లు ఒత్తిడిలో చాలా సులభమైన పరిష్కార మార్గాలు కూడా తట్టవు. అలాగే మిమ్మల్ని ఇష్టపడే వారు మీ సమస్యల పరిష్కారం కోసం వారి శక్తి మేర ఏదైనా చేయొచ్చు.

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే మార్గాలు


ఆత్మ విశ్వాసం పెంపొందించు కోవటం వలన సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కోవడంతోపాటు విజయాలు మీ సొంతం అవుతాయి. మీ గురించి ప్రపంచానికి తెలియ జేయాలి అనుకుంటే కొన్ని చిట్కాల ద్వారా మీలో ఆత్మ విశ్వాసాన్ని పెంచు కోవచ్చు. ప్రతిరోజు కొత్తగా మీ రోజును ప్రారంభించవచ్చు.

ఇతరులు ఏమనుకుంటారో అని ఆలోచించకండి

చుట్టూ ఉండే వాళ్లు మీ గురించి ఏమి అనుకుంటున్నారో అని ఆలోచించకండి. ఇలా ఆలోచించటం వలన మీ ఆత్మ విశ్వాసం దెబ్బతింటుంది. మీ గురించి ఆలోచించే దాని కన్నా, వారు మీ గురించి ఏమి అనుకుంటున్నారో అని ఎక్కువ ఆలోచిస్తారు. వారేం అనుకుంటున్నారో అని ఆలోచించకుండా, మీ ప్రాధాన్యతల గురించి ఆలోచించండి.

ఆత్మవిశ్వాసాన్ని అభ్యసించండి

అభ్యాసన లేదా సాధన ద్వారా మీరు మంచి ఫలితాలను పొందుతారు. అందువల్ల ఆత్మవిశ్వాసాన్ని అభ్యసించండి. చిన్నప్పటి నుండి మీపై మీకు నమ్మకం లేదా? అయినా ఏమీ పరవాలేదు. దశల వారిగా ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోవచ్చు.



కమ్యూనికేషన్ నైపుణ్యం, వస్త్రధారణ, భంగిమ, శిష్టాచారాలు, సాంఘిక నైపుణ్యాలను మెరుగుపరచుకోండి. ఆత్మ విశ్వాసాన్ని కలిగి ఉండే వ్యక్తులను గమనించి, వారిని ఆచరించండి.

ఆకతాయిలకు బుద్ధి చెప్పండి

మన అపజయాన్ని కోరేవారు, పతనాన్ని కోరుకునే ఆకతాయిలు ఎల్లపుడు మన చుట్టూ ఉంటూనే ఉంటారు. మీరు ఘటికులని, ఆకతాయి పనులకు మీరు జంకరాని వారికి తెలిసేలా చేయండి. చిన్న చిన్న విజయాలు మీకు ప్రయోజనాన్ని చేకూర్చడంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి.

జ్ఞానాన్ని పెంచుకోండి

ప్రతిరోజు కొత్త విషయాలను నేర్చుకోండి. రోజూ కొత్త విషయాలు నేర్చుకోవటం, వాటిపై అవగాహన పెంచుకోవటం వలన మీ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది కూడా మీకు సంతృప్తి నిస్తుంది.

ఊపిరితిత్తులు భద్రంగా ఉండాలంటే..



ధూమపానం చేసేవారు ప్రతిరోజు మూడు టమోటాలు, మూడు యాపిల్స్ తింటే ఊపిరి తిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చునని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతే కాదు వీటిని తీసుకోవడం వల్ల అంతకుముందే పాడైన ఊపిరి తిత్తులను వీటి ద్వారా నయం చేసుకో వచ్చుట. మామూలుగా ధూమపానం ప్రియుల ఊపిరితిత్తులు కొంతకాలానికి పనిచేయడం మానేస్తాయట. 900మంది మీద సుదీర్ఘకాలం శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి ఒక నిర్ధారణకు వచ్చారు. 900 మంది ధూమపానం అలవాటు ఉన్నావారే. వీరిని రెండు గ్రూపులుగా విభజించి ఒక గ్రూపుకు మామూలు ఆహారంతో పాటు ప్రతిరోజు మూడు టమోటాలు, మూడు ఆపిల్స్ ఇచ్చారు. వేరొక గ్రూపునకు సాధారణ ఆహారం మాత్రమే ఇచ్చారు. కొన్ని రోజుల తర్వాత వీరి ఆరోగ్యాన్ని పరిశీలిస్తే టమోటా, ఆపిల్స్ తిన్న వారి ఊపిరి తిత్తుల క్షీణిత తగ్గిన విషయాన్ని గుర్తించారు. సాధారణ ఆహారాన్ని తీసుకున్న వారు మాత్రం వారి ఊపిరితిత్తులు మరింత ఇబ్బందికర పరిస్థితుల్లోకి వెళ్ళిపోవడం గమనించారు. టమోటా, ఆపిల్స్ కూడా తాత్కాలికంగానే ఊపిరితిత్తులను కాపాడుతాయే తప్ప పూర్తిస్థాయిలో పనిచేయవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గంధంతో చికిత్స



★ గంధాన్ని అరగదీసి కళ్లమీద రాసుకుంటే కళ్ల ఎరుపులు, మంట తగ్గుతాయి.
★ రోజ్ వాటర్‌లో గంధం కలిపి ముఖానికి రాసుకుంటే ముఖం మీద రాష్ వుంటే పోతుంది.
★ పాలతో గంధాన్ని అరగదీసి ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా తయారవుతుంది.
★ మంచి గంధం అరగదీసి రోజు రెండుసార్లు, మూడుసార్లు ముఖానికి రాసుకుంటే మొటిమలు పోతాయి.
★ స్నానం చేసే నీళ్లలో గంధం నూనె అయిదారు చుక్కలు వేసుకొని స్నానం చేస్తే చర్మ వ్యాధులు రావు. శరీరం సునాయాసంగా ఫ్రెష్‌గా వుంటుంది.
★ చందనాది తైలం వల్ల తలనొప్పి కళ్లు మంటలు తగ్గుతాయి.
★ వేడి చేసి పిల్లలకు కురుపులుగా వస్తే గంధం అరగదీసి రాస్తే కురుపులు తగ్గుతాయి

ఆమె రూటే సెపరేటు..



ఆటైనా, పాటైనా, హీరోయిన్‌గానైనా, ఆ మాటకొస్తే అతిథి పాత్రలో మెరవడానికైనా, ప్రతినాయకిగా మారడానికి రెడీ అంటారీ భామ. హీరో శింబుతో కలిసి రొమాన్స్ చేసిన తొలి చిత్రం పోడాపోడీ పెద్దగా పేరు తెచ్చి పెట్టలేదు. అందుకే రాశి లేని నటి అనే ముద్ర పడింది. అయినా డోంట్‌కేర్ అంటూ నటిగా ముందుకు సాగిన ఆమెకు బాలా చిత్రం తారైతప్పట్టేలో తన సత్తా చాటుకునే అవకాశాన్ని కల్పించింది. ఆ చిత్రం ప్రేక్షకాదరణను అంతగా పొందకపోయినా వరలక్ష్మీ నటనకు మాత్రం కోలీవుడ్ ఫిద్యా అయ్యిపోయింది. ఆమెకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. ప్రస్తుతం ఒక్క తమిళంలోనే మూడు చిత్రాలు చేతిలో ఉన్నాయి. అందులో ఒకటి ధనుష్‌తో కలిసి నటిస్తున్న మారి-2 చిత్రం. ఈ సినిమాలో సాయిపల్లవి, టోవినో థామస్, వరలక్ష్మీ శరత్‌కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారని ప్రచారం జరిగింది. వీరిలో వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రతినాయకిగా కనిపించనున్నారట. ఇది చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. ఈ చిత్రానికి యువన్‌శంకర్‌రాజా సంగీతాన్ని అందిస్తున్నారు. ఒకవైపు నచ్చిన పాత్రల్లో నటిస్తూ, మరోవైపు మహిళా హక్కుల కోసం, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పోరాడుతున్నారు. అందుకు సేవ్ శక్తి పేరుతో స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి మహిళలకు నేనున్నానంటూ భరోసానిస్తున్నారు. ఇలా తన రూటే వేరు అంటూ సహ హీరోయిన్లలో ప్రత్యేకంగా నిలుస్తున్నారు.

గురువారం మార్చి ఒకటి.. అంటున్న నాగశౌర్య



ఛలో సినిమాతో మంచి విజయం అందుకున్న నాగశౌర్య స్పీడు పెంచాడు. ఇప్పటికే ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న కణం షూటింగ్ పూర్తి చేసిన ఈ యంగ్ హీరో మరిన్ని సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. గతంలో నువ్వు లేక నేను లేను, తొలిచూపులోనే లాంటి సినిమాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న కాశీ విశ్వనాథ్ తరువాత నటుడిగా బిజీ అయ్యారు. దాదాపు 15 ఏళ్ల తరువాత నాగశౌర్య సినిమాతో ఆయన తిరిగి మెగాఫోన్ పట్టనున్నారు. ఈ సినిమాకు మహేష్ బాబు సూపర్‌హిట్ సినిమా దూకుడులోని 'గురువారం మార్చి ఒకటి' పాట పల్లవిని టైటిల్‌గా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఛలో సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న ఈ యంగ్ హీరో ఈ నెలాఖరున సాయి శ్రీరామ్ దర్శకత్వంలో ఓ సినిమా ప్రారంభించనున్నాడు. ఈ సినిమా తరువాత మరోసారి సొంత బ్యానర్ ఐరా క్రియేషన్స్‌లో శ్రీనివాస్‌ను దర్శకుడిగా పరిచ యం చేస్తూ నర్తనశాల సినిమాలో నటించ నున్నాడు. ఈ రెండు సినిమాలు పూర్తయిన తరువాతే కాశీ విశ్వనాథ్ దర్శకత్వంలో గురువారం మార్చి ఒకటి సినిమా ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.

జిల్‌జిల్ జిగేల్ రాజా..

సుకుమార్ సినిమా అంటే తప్పకుండా ఓ ఐటెంసాంగ్‌కు చోటుంటుంది. హుషారెత్తించే ప్రత్యేక గీతాలు ఆయన సినిమాల్లో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగిస్తుంటాయి. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రంగస్థలంలో కూడా హుషారైనఐటెంసాంగ్‌ను తెరకెక్కించారు. ఇందులో బెంగళూరు సోయగం పూజా హెగ్డే నర్తించింది. ఈ గీతాన్ని హైదరాబాద్‌లో వేసిన ప్రత్యేక సెట్‌లో ఐదు రోజుల పాటు చిత్రీకరించారు. జానీ మాస్టర్ నృత్యరీతుల్ని సమకూర్చారు . జిల్‌జిల్ జిగేల్ రాజా అనే పల్లవితో సాగే ఈ గీతానికి చంద్రబోస్ రచన చేశారు. సుకుమార్ గత చిత్రాల తరహాలోనే రంగస్థలంలోని ఐటెంసాంగ్ యువతను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం చెబుతున్నది. 1985 నాటి ఓ పల్లెటూరి నేపథ్యంలో వినూత్న కథ, కథనాలతో ఈ చిత్రాన్నితెరకెక్కిస్తున్నారు. సమంత కథానాయిక. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ సి.హెచ్ ఈ చిత్రాన్నినిర్మిస్తున్నారు. జగపతిబాబు, అనసూయ, ఆది పినిశెట్టి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.

సంక్రాంతి బరిలోకి ఎన్టీఆర్-త్రివిక్రమ్ మూవీ..



సంక్రాంతి సీజన్ ముగిసి నెలరోజులు కూడా కాలేదు. అప్పుడే నెక్స్ట్ సంక్రాంతికి బెర్తులు కన్‌ఫర్మ్ చేసుకుంటున్నారు మన టాలీవుడ్ స్టార్స్. వచ్చే సంక్రాంతిపై ముచ్చటగా ముగ్గురు హీరోలు అప్పుడే కన్నేశారట. 'నాన్నకు ప్రేమతో' సినిమాతో మూడేళ్ల క్రితం సంక్రాంతి బరిలో మెప్పించిన ఎన్టీఆర్.. గత రెండేళ్లుగా సెప్టెంబర్‌లో వచ్చి రెండు విజయాలు అందుకున్నాడు. ఈ ఏడాది కూడా త్రివిక్రమ్ సినిమాతో తిరిగి సెప్టెంబర్‌పై కన్నేశాడు తారక్. అయితే ఇప్పటికే పట్టాలెక్కాల్సిన త్రివిక్రమ్ సినిమా మార్చి నుంచి సెట్స్‌కు వెళుతుండడం.. జక్కన్న తరహాలోనే చెక్కుడు అలవాటున్న త్రివిక్రమ్ దర్శకుడు కావడంతో సెప్టెంబర్‌కు ఈ మూవీ రావడం కష్టమేనంటున్నారు. ఈ క్రమంలో హడావుడిగా వచ్చి రిస్క్ చేయడం కంటే సేఫ్ గా సంక్రాంతి బరిలోకే దిగాలనుకుంటున్నాడట తారక్. ఎన్టీఆర్ మూవీ రిలీజ్ డేట్ మారుతుండడంతో ఎప్పటిలాగే సంక్రాంతికి రసవత్తర పోరు నెలకొనబోతోంది. మహేశ్ బాబు, ప్రభాస్ సినిమాలు కూడా సంక్రాంతికి రానుండటమే ఇందుకు కారణం. 'భరత్ అనే నేను' ఏప్రిల్‌లో విడుదల కానుండగా కొంత విరామం తీసుకుని వంశీ పైడిపల్లి సినిమా మొదలెట్టనున్నాడు ప్రిన్స్. మహేశ్ కెరీర్‌కు ఇది 25వ సినిమా కావడంతో సంక్రాంతి వంటి పెద్ద పండక్కు రావాలని భావిస్తున్నాడు. మరోవైపు ప్రభాస్ ప్రతిష్ఠాత్మక చిత్రం 'సాహో' కూడా సంక్రాంతికే రానుందని తెలుస్తోంది. దీంతో ఈ ముగ్గురు హీరోల నడుమ సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఉండబోతోంది. ప్రస్తుతానికైతే ఈ ముగ్గురు హీరోల కమిట్మెంట్స్ ఇలా ఉన్నాయి. మరి ముగ్గురూ సంక్రాంతికి రావటం ఖాయమా? లేక మార్పులు-చేర్పులు ఏమైనా ఉంటాయో చూడాలి..!

విశాలాంధ్ర సినిమా



'మహానటి' పై 'అజ్ఞాతవాసి' ప్రభావం!



టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా నిలబడే ప్రయత్నం చేస్తున్న ఆ అందాల భామ లేటెస్ట్‌గా పవన్ సినిమాతో పోగొట్టుకున్న ఇమేజ్‌ను రాబోయే బయోపిక్‌తో మళ్ళీ పొందాలనుకుంటోందట. భారీ అంచనాలున్న సినిమాలకు ఏ మాత్రం అంచనాలు తప్పినా.. అందులో నటించిన వారిపై బాగా ఎఫెక్ట్ పడుతుంది. అలాంటి వాళ్లలో ముందు వరుసలో ఉంది కథానాయిక కీర్తి సురేశ్. అమ్మడు నిన్నమొన్నటి వరకూ టాలీవుడ్‌లో వరుస సక్సెస్‌లతో కథానాయికగా మంచి పేరు తెచ్చుకుంది. 'అజ్ఞాతవాసి'లో పవన్ కల్యాణ్ సరసన హీరోయిన్‌గా నటించిన కీర్తికి ఆ సినిమా దారుణమైన పేరును తెచ్చింది. వరుస విజయాలతో పొందిన ఇమేజ్ మొత్తం ఆ సినిమాతో డామేజ్ అయింది. 'అజ్ఞాతవాసి'లో కీర్తి నటనకు తెగ విమర్శలొచ్చాయి. ఆ ఎఫెక్ట్ సావిత్రి బయోపిక్ 'మహానటి'పై కూడా పడింది. ఈ అమ్మడితో 'మహానటి' గా నటింపచేయడం ఏమిటనే కామెంట్స్ సైతం వినవచ్చాయి. 'అజ్ఞాతవాసి' సినిమా ప్రభావం కీర్తిపై అంతగా పడిందన్న మాట. అంతకు ముందు ఫస్ట్‌లుక్‌లో అదుర్స్ అన్నవారు సైతం విమర్శలు మొదలు పెట్టడం కీర్తికి మింగుడు పడలేదు. మార్చ్ 29న విడుదల తేదీని ప్రకటించిన 'మహానటి' టీమ్ వర్క్ పూర్తి కాకపోవడంతో కొంచెం వెనక్కి వెళ్ళాలనుకుంటోందట. గ్రాఫిక్స్ వర్క్‌కు టైమ్ పట్టేలా ఉండడంతో.. మే లేదా జూన్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారట. 'అజ్ఞాతవాసి' చిత్రం వల్ల ఎఫెక్టయిన కీర్తి కెరీర్‌ను 'మహానటే' నిలబెడుతుందని అంటున్నారు సినీజనం. మరి 'మహానటి' తో కీర్తి సురేశ్ కెరీర్ మళ్ళీ గాడిలో పడుతుందేమో చూద్దాం.

శ్రీదేవి కూతురి కోసం సాహసం..!



ధడక్ సినిమాతో వెండితెరకు పరిచయం అవుతున్న అతిలోక సుందరి వారసురాలు జాన్వీ కపూర్ కోసం ఆ సినిమా హీరో ఇషాన్ కట్టర్ సాహసం చేశాడు. తన కోసం వెయిట్ చేస్తున్న జాన్వీ ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఏకంగా బాల్కనీ నుంచి కిందకి దూకేశాడు. ధడక్ షూటింగ్ సమయంలో ఇషాన్, జాన్వీల మధ్య మంచి స్నేహం ఏర్పడింది. అందుకే తన కో స్టార్ ను షూటింగ్ కు తీసుకెళ్లేందుకు స్వయంగా జాన్వీ.. ఇషాన్ దగ్గరకు వెళ్లింది. ఆ సమయంలో ఇషాన్ జిమ్ లో ఉండటంతో బయటకు రావటం కాస్త ఆలస్యం అయ్యింది. ఈలోగా కారులో జాన్వీ ఉన్న సంగతి అక్కడ ఉన్నవారికి తెలియటంతో చుట్టూ జనాలు గుమిగూడారు. మీడియా కూడా వచ్చేయటంతో విషయం తెలుసుకున్న ఇషాన్ పెద్ద సాహసమే చేశాడు. ఏకంగా ఫస్ట్ ఫ్లోర్ బాల్కని నుంచి దూకేశాడు. ఈ లోగా జాన్వీ బాల్కని దగ్గరకు కారు తీసుకురావటంతో ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇషాన్ చేసిన రిస్క్‌ను కొంతమంది ప్రశంసిస్తుంటే మరికొందరు మాత్రం ఏదైన ప్రమాదం జరిగి ఉంటే షూటింగ్ ఆగిపోయి ఉండేది, హీరోలు ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని అభిప్రాయ పడుతున్నారు.

పవన్‌కి స్పెషల్ థాంక్స్: నితిన్



నితిన్, మేఘా ఆకాష్ జంటగా శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. మాటల మాంత్రికుడు, దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందిస్తుండగా, శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో ప్రముఖ నిర్మాత ఎన్. సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని కృష్ణ చైతన్య దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఇది నితిన్‌కు 25వ చిత్రం కావటం విశేషం.

ఈ చిత్రం ఫస్ట్‌లుక్ ను పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ తన ట్విట్టర్‌లో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై తాజాగా రియాక్ట్ అయ్యాడు హీరో నితిన్. నా అభిమాన కథానాయకుడు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ గారు ఈ చిత్రం ప్రచార చిత్రాలను ట్విట్టర్ ద్వారా విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ విషయాన్ని చెబుతూ తన ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు హీరో నితిన్.

ఉగ్రవాదుల కోసం కొనసాగుతున్న వేట

నలుగురు ఉగ్రవాదుల హతం

మరో ఇద్దరు భద్రతాసిబ్బంది, పౌరుడు మృతి



సుంజ్వాన్ : జమ్మూ -కాశ్మీర్‌లోని సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్‌లో చొరబడిన ఉగ్రవాదుల ఏరివేత కోసం సైనిక కార్యాచరణ కొనసాగుతోంది. ఆర్మీక్యాంపులోకి నిన్న జైషే మహ్మద్ ఉగ్రవాదులు చొరబడిన విషయం తెలిసిందే. ఉగ్రవాదుల కోసం అర్ధరాత్రి నుంచి వేట కొనసాగుతోందని ఆర్మీ అధికారులు తెలిపారు. ఆర్మీ క్వార్టర్స్ నుంచి కుటుంబసభ్యులను వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిన్న ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైన్యం .. ఈరోజు మరో ఉగ్రవాదిని హతమార్చింది. నిన్న ఉగ్రవాదుల కాల్పుల్లో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ రోజు మరో ఇద్దరు భద్రతా సిబ్బంది, ఓ పౌరుడు మరణించారు. దీంతో ఇప్పటి వరకూ ఈ ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 6కు చేరింది. ఆర్మీ క్యాంపులోకి చొరబడిన ఉగ్రవాదుల ఏరివేతకు 30 గంటలుగా సైనిక కార్యాచరణ కొనసాగుతోంది. మరో ఇద్దరు ముగ్గురు ఉగ్రవాదులు ఆర్మీ క్యాంపులో ఉన్నట్లు భావిస్తున్నారు. ఉగ్రదాడి నేపథ్యంలో సైన్యం హైఅలర్ట్‌ను ప్రకటించింది. ఆర్మీ క్యాంపునకు సమీపంలోని పాఠశాలలను మూసివేశారు. ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఈ ఉదయం జమ్మూకు చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఉగ్రదాడి నేపథ్యంలో పంజాబ్-జమ్మూ-కాశ్మీర్ సరిహద్దు గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.



దేశీయ పర్యాటకుల్లో చాలామంది పనికిమాలినవారే

ఉత్తరాదివారి వల్లే గోవాలో పారిశుద్ధ్య సమస్య

గోవా మంత్రి సర్దేశాయ్ వివాదాస్పద వ్యాఖ్యలు

పనాజీ: గోవాకు వచ్చే దేశీయ పర్యటకుల్లో ఎక్కువ మంది పనికిమాలినవారేనంటూ ఆ రాష్ట్ర మంత్రి విజయ్ సర్దేశాయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన పర్యటకుల వల్ల.. గోవాలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. "రాష్ట్ర జనాభా కన్నా.. ఏటా ఇక్కడికి వచ్చే పర్యటకుల సంఖ్య ఆరు రెట్లు ఎక్కువగా ఉంది. వీళ్లంతా పనికిమాలినవారు. గోవాలో ప్రస్తుత సమస్యలకు ఉత్తరాది రాష్ట్రాలే కారణం. అక్కడి నుంచి వచ్చేవారు గోవాను మరో హర్యానాల మార్చాలనుకుంటున్నారు. కొన్ని రోజులు పాటు రాష్ట్రంలో గడిపివెళ్లే వీరికి.. ఎలా అవగాహన కల్పించేది? ఆదాయం, సామాజిక, రాజకీయ అవగాహన, ఆరోగ్య సూచీల విషయంలో.. దేశంలోని మిగతావారి కన్నా గోవా ప్రజలు చాలా ముందున్నారు. పర్యటకుల కన్నా మనం ఉన్నతులం" అని సర్దేశాయ్ వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలపై దుమారం రేగడంతో సర్దేశాయ్ వివరణ ఇచ్చుకున్నారు. తాను దేశీయ పర్యటకులందరినీ పనికిమాలినవారని అనలేదని.. కొన్ని వర్గాల వల్ల మాత్రం సమస్యలు ఎదురవుతున్నట్లు చెప్పానని అన్నారు. తనవి విద్వేషపూరిత వ్యాఖ్యలు కాదని, గోవా ప్రజల మనోగతాన్ని వెల్లడించానని చెప్పారు.

కాషాయం పూసుకుంటే చేతులు కలపను'

రజనీతో పొత్తుపై కమల్



చెన్నై : 'రజనీ రాజకీయ రంగు కాషాయం (బీజేపీ) కాదని భావిస్తున్నా. అదే జరిగితే ఆయనతో కలిసి పనిచేయడం జరగదు. మేమిద్దరం మంచి స్నేహితులమే కానీ, రాజకీయాలు వేరు. ప్రస్తుతానికి దీనిపై స్పష్టత లేదు.' అని విలక్షణ నటుడు కమలహాసన్ అన్నారు. కమల్ అమెరికాలోని హార్వర్డ్ యూనివర్శిటీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రజనీ రాజకీయ ప్రవేశం గురించి ప్రస్తావించారు. అవసరమైతే ఇతరులతో కలిసి పనిచేస్తారా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. అలాంటి పరిస్థితి ఉండదని చెప్పారు. ఒకవేళ తన పార్టీకి సరైన మెజార్టీ రాకపోతే అది ప్రజలు ఇచ్చిన తీర్పుగా భావించి, ప్రతిపక్షంలో కూర్చుంటానని అన్నారు. అదే సమయంలో రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే తన సమయం వచ్చే వరకూ వేచి చూస్తానని తెలిపారు. ప్రజలతో కలిసి నడిచేందుకే తాను కొత్తగా పార్టీని ప్రారంభిస్తున్నాను.. తప్ప రాజకీయ నాయకులతో కలిసి పనిచేసేందుకు కాదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులు చక్కగా లేవని తమిళ తాజా రాజకీయాలను ఉద్దేశించి అన్నారు. కమల్, రజనీ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తమిళనాడుకు రెండు కళ్లు లాంటివారైన వీరిద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. ఆ స్నేహాన్ని రాజకీయాల్లోనూ కొనసాగిస్తూ తమిళనాడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీనిపై గతంలో కమల్ స్పందిస్తూ.. ఇద్దరి ఆలోచనలు, అభిప్రాయాలు ఒక్కటే అయితే కలిసి పనిచేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు.

ఈ నెల 21 నుంచి కమల్ తమిళనాడులో పర్యటించనున్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే. అబ్దుల్ కలాం స్వస్థలమైన రామేశ్వరం నుంచి తన పర్యటనను ప్రారంభించనున్నారు. అదే రోజున తన పార్టీకి సంబంధించిన వివరాలను ప్రకటిస్తానని తెలిపారు. అంతేకాదు.. తమిళనాడులోని అన్ని జిల్లాల్లోనూ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోనున్నట్లు వెల్లడించారు కమల్.

అవినీతికి చిరునామా బీజేపీ

- ముగ్గురు సీఎంలు మారారు
- నలుగురు మంత్రులు జైలుకెళ్లారు
- సిద్ధరామయ్య అవినీతి రహిత పాలన
- కర్ణాటక ఎన్నికల ప్రచారంలో రాహుల్



కొప్పాల్(కర్నాటక) : కర్నాటకలో ఎన్నికల వేడి రాజుకుంది. ఇంకా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకుండానే ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో తలమునకలయ్యాయి. అధికారం నిలబెట్టుకోవడానికి కాంగ్రెస్ ఆరాటపడుతుంటే...ఎలాగైనా గెలిచి తీరాలని ప్రధాన ప్రతిపక్షం బీజేపీ నానాఎత్తులు వేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదివారం కర్ణాటకలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. బీజేపీపై విమర్శలు గుప్పించారు. అవినీతికి చిరునామా బీజేపీ అని నిందించారు. సిద్ధరామయ్య ప్రభుత్వం అవినీతికి ఆమడ దూరంలో ఉందని చెప్పుకొచ్చారు. ఈ ఐదేళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క కుంభకోణం చోటుచేసుకోలేదని రాహుల్ నమ్మబలికారు. కర్ణాటకలో గతంలో బీజేపీ హయాంలో అవినీతిలో ప్రపంచ రికార్డు నెలకొల్పిందని రాహుల్ విమర్శించారు. రాహుల్‌గాంధీ ఉత్తర కర్ణాటకలో ప్రచారం చేస్తున్నారు. బీజేపీ హయాంలో ఒకదాని తర్వాత మరో కుంభకోణం జరుగుతూ వచ్చాయన్నారు. జన ఆశీర్వాద యాత్ర పేరుతో రాహుల్ కొప్పాల్ జిల్లాలో రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. 'ఎన్నికలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకీ, సిద్ధరామయ్యకు అండగా నిలవండి. మరోసారి మన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురండి. మీ కోసం ఎంతదాకైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని రాహుల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్ణాటక, ఇతర రాష్ట్రాల కాంగ్రెస్ నాయకులతో కలిసి రాహుల్ బస్సు యాత్ర చేశారు. రాహుల్ నిర్వహించిన రోడ్‌షోలు, బహిరంగ సభలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి రాహుల్ ప్రయత్నించారు. రోడ్‌షోల సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా ప్రజలు భారీగా నిలబడి స్వాగతం పలికారు. కొంతదూరం బస్సులోనూ... కొంతదూరం కాలినడకన రాహుల్ ప్రయాణించారు. ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్ర చేశారు. రాహుల్ వెంట సీఎం సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు జి.పరమేశ్వర నడిచారు. పాదయాత్ర సమయంలో రాహుల్‌ను కలిసేందుకు అభిమానులు ఎగబడటంతో భద్రతా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల జరిగిన బహిరంగ సభల్లో బీజేపీ, ప్రధాని నరేంద్రమోడీపై రాహుల్ నిప్పులు చెరిగారు. మోడీ తన సొంత పార్టీ రికార్డును విస్మరించి కర్ణాటకలో అవినీతి గురించి మాట్లాడుతున్నారని హేళన చేశారు. బీజేపీ హయాంలో ముగ్గురు ముఖ్యమంత్రులు పనిచేశారని, నలుగురు మంత్రులు జైలుకెళ్లారని గుర్తుచేశారు. అయినా మోడీ ఇక్కడికి వచ్చి అవినీతి గురించి, తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. 2008 నుంచి ఐదేళ్లలో బీఎస్ యడ్యూరప్ప, సదానందగౌడ, జగదీష్ షెట్టార్‌లు సీఎంలుగా పనిచేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో అవినీతి బీజేపీని దూరంగా ఉంచాలని, కాంగ్రెస్ పార్టీకి మరోసారి పట్టం కట్టాలని ఆయన ప్రజలను వేడుకున్నారు. కర్ణాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రైలు ఢీ : ఐదు ఏనుగులు మృతి



గువహతి : రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని ఐదు ఏనుగులు మృతి చెందాయని ఆదివారం అటవీ అధికారులు తెలిపారు. హబియాపూర్ లుంబ్డింగ్ రిజర్వు ఫారెస్టు వద్ద గౌహతి-సిల్చార్ ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టడంతో రైలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. ఏనుగులు తిరిగే ప్రదేశంలో రైలు 20 కిమీ వేగంతో వెళుతోందని, ఇంజను దెబ్బ తిందన్నారు. విద్యుదాఘాతం, వేగంగా వచ్చే రైళ్లు, విషాహారం, మానవుల దాడి, ఇతర ప్రమాదాల్లో గతేడాది 70 ఏనుగులు మృతి చెందాయని అటవీ అధికారులు వెల్లడించారు.

పేలుడులో బాలునికి తీవ్ర గాయాలు

కోల్‌కతా: కాలేజ్ హోటల్‌లో దొరికిన వస్తువుతో ఆడుకుంటున్న బాలుడు రింతుషా ఆ వస్తువు పేలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కోల్‌కతా వైద్య కళాశాలలో అతనికి చికిత్స అందిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఆ ప్రదేశంలోకి బాలుడు ఎందుకు వచ్చాడో తెలియడం లేదని, అక్కడ పడేసి ఉన్న బ్యాగు నుంచి గుండ్రంగా ఉన్న వస్తువుతో ఆడాడన్నారు. ఆ భవనం చాలా ఏళ్లనుంచి నిర్జనంగా ఉందని, దానిలో అసాంఘిక కార్యకలాపాలు జరుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని కోల్‌కతాలోని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

భారత్ - నేపాల్ సరిహద్దులో యూపీ హోంగార్డులు

లక్నో/కాన్పూర్ : ఉత్తరప్రదేశ్ హోం గార్డులను భారత్- నేపాల్ సరిహద్దు లోని సహస్త్ర సీమ బల్ (ఎస్ఎస్‌బీ)కు పంపే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఎస్ఎస్‌బీ సరిహద్దు రక్షణతోపాటు విపత్తు నివారణా సహాయ చర్యలు చేపడతారు. కేంద్ర అధికారులతో సమావేశమైన రాష్ట్ర అధికారులు 1200 మంది హోంగార్డులను జవాన్లుగా పంపేందుకు నిర్ణయం తీసుకున్నామని హోంగార్డు డీజీ సూర్య కుమార్ శుక్లావెల్లడించారు. ఎస్ఎస్ఏఎస్ రైఫిల్స్‌తో వీరికి శిక్షణ నివ్వనున్నామన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో బాలికపై అత్యాచారం

మీర్జాపూర్ : ఆరేళ్ల బాలికపై 16ఏళ్ల యువకుడు అత్యాచారం చేశాడని పోలీసులు వెల్లడించారు. ఇంట్లో ఒక్కతే ఉండగా గొస్సైపూర్‌లో ఈ ఘటన జరిగిందని ఆదివారం తెలిపారు. యువకుడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ ఏకే సింగ్ తెలిపారు. నిందితుడిపై పోక్సో (పీవోసీఎస్‌వో) చట్టం ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ఒంటరిగా ఇంటిలో ఉండటాన్ని గమనించిన నిందితుడి ఇంట్లో కెళ్లి ఈ దారుణానికి ఒడి కట్టాడని, తల్లిదండ్రులు ఆమెను ఆసుపత్రికి తరలించారన్నారు.

మావోయిస్టు దంపతులు అరెస్టు

తిరువల్లూర్ : కర్ణాటకలో ఆటోమాటిక్ ఆయుధాల తర్ఫీదునిస్తున్న మావోయిస్టు దంపతులను అరెస్టు చేశామని ఆదివారం పోలీసులు వెల్లడించారు. వారి నుంచి ఆయుధాలు, లాప్‌ట్యాప్, స్మార్ట్‌ఫోన్, మావోయిస్టు సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 2003 నుంచి తప్పించుకు తిరుగుతున్న మావోయిస్టు నాయకుడు డి. దశరథన్ అతని భార్య షెన్‌భాగవల్లి అలియాస్ కలిమొంజితో పాటు వారికి ఆశ్రయమిస్తున్న దశరథ్ తమ్ముడు వెట్రి వీరపాడ్యన్ కూడా అరెస్టు చేశామన్నారు.

ప్రాంతీయ రచయితలకు ప్రాధాన్యం లేదు

కోల్‌కతా : ప్రాంతీయ రచయితలకు ప్రాధాన్యం, గౌరవం దక్కడం లేదని ప్రసిద్ధ బెంగాలీ రచయిత సంజీబ్ ఛటోపాధ్యాయ వాపోయారు. విదేశీ రచయితలపై చూపుతున్న ప్రేమ దేశ రచయితలపై ఉండటంలేదని, రానున్న రోజుల్లో బెంగాలీ రచయితల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఒక చర్చలో తెలిపారు. కొన్ని వేల పుస్తకాలను మాత్రమే అమ్మగలుగుతున్నామని అయితే వాటితో కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో వారి కుటుంబసభ్యులు మరేదయినా వృత్తి చేపట్టాలని రచయితలపై ఒత్తిడి తెస్తున్నారని ఆనంద పుష్కర బహుమతి గ్రహీత సంజీబ్ వెల్లడించారు.

దీనదయాళ్ నుంచి స్ఫూర్తి పొందాలి : ప్రధాని

న్యూఢిల్లీ : పేదల సేవలో తరించాలన్న హిందుత్వ వాది దీనదయాళ్ ఉపాధ్యాయ మాటల నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని మోడీ పిలుపు నిచ్చారు. ఆయన వర్ధంతి సందర్భంగా పేదలకు, అట్టడుగువర్గాలకు సాయపడి. గ్రామాల్లో ఆయన స్ఫూర్తిని రగిలించాలన్నారు. 1916 సెప్టెంబరు 25న జన్మించిన ఆయన భారతీయ జనసంఘ్ నేతల్లో ఒకరు కాగా, కాల క్రమేణా బీజేపీగా రూపొందింది. వరుస క్రమంలో చివరిగా ఉన్న వారిని కూడా అభివృద్ధి పథంలో నిలపడానికి అంత్యోదయ సిద్ధాంతాన్ని ఆయన రూపొందించారు. 1968 ఫిబ్రవరి 11న ఆయన మృతి చెందారు.

స్క్రాప్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

ముంబై : తుక్కు దుకాణంలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగిందని బ్రిగేడియన్ అధికారి తెలిపారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని, స్క్రాప్ దుకాణంలో ఎగసిపడిన మంటలు చుట్టుపక్కలనున్న దుకాణాలకు కూడా ఎగబాకాయన్నారు. ప్యాకింగ్, నిల్వఉంచిన చమురు, రసాయనాలు, తుక్కు సామానులు మంటల్లో ఆహుతయ్యాయన్నారు. 17 అగ్నిమాపక శకటాలు మంటలను అదుపులోకి తెచ్చాయన్నారు. అనధికార భవనాలను కూల్చివేసి విద్యుత్ సరఫరాను నిలుపుచేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

వడగండ్లవాన : రైతు మృతి

ముంబై : అకాల వడగళ్ల వర్షంతో పంటలు దెబ్బతిన్నాయని, ఒక రైతు మృతి చెందాడని ఆదివారం ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయని, అరగంట సేపు తీవ్రంగా కురిసిన వర్షానికి గోధుమ, నారింజ, ద్రాక్ష పంటలు దెబ్బతిన్నాయని రాష్ట్ర రెవెన్యూ అధికారులు వెల్లడించారు. పంటనష్టంపై విపత్తు నివారణా శాఖ త్వరలో నష్టాన్ని అంచనా వేస్తుందన్నారు. వడగళ్లవానలో గాయపడిన 70 ఏళ్ల రైతు మృతిచెందాడని జల్నా జిల్లా కలెక్టర్ శివాజీ రావు అధికారికంగా ప్రకటించారు. వశిం, ఔరంగాబాద్‌ల్లో మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో వడగళ్లవర్షం కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

రూ.991కే విమానయానం: గోఎయిర్

న్యూఢిల్లీ : గోఎయిర్ విమానయాన సంస్థ తక్కువ చౌక విమానయాన పథకాన్ని ప్రకటించింది. తాము కేవలం రూ.991కే విమానయానం అందించనున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్ కింద ఔత్సాహిక ప్రయాణికులు ఫిబ్రవరి 20 వరకు తమ ప్రయాణ టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకునే వారికి అదనంగా 10 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్టు సంస్థ వెల్లడించింది. ఈ పథకంలో భాగంగా హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రూ.1,731కే విమానయానం అందిస్తున్నట్టుగా తెలిపింది. హైదరాబాద్ నుంచి చెన్నైకి రూ.1,399 టికెట్ ధరను నిర్ణయించింది. మరిన్ని నగరాలకు కూడా ఈ సదుపాయం అందుబాటులో ఉంచినట్లు సంస్థ తెలిపింది.

సైనిక స్థావరాల్లో భద్రతకు రూ.1487 కోట్లు

ఢిల్లీ: దేశ సరిహద్దుల్లో తరచూ ఉద్రిక్తతలు నెలకొంటున్న పరిస్థితుల్లో జమ్మూకాశ్మీర్ సహా దేశవ్యాప్తంగా సైనిక స్థావరాలను బలోపేతం చేసేందుకు రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సైనిక స్థావరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు రూ.1487 కోట్లను విడుదల చేస్తూ రక్షణశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత పనులను 10 నెలల్లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2016లో పఠాన్‌కోట్ వైమానిక దళ స్థావరంపై ఉగ్రదాడి అనంతరం సైనిక స్థావరాల భద్రతపై సమీక్షించేందుకు లెఫ్టినెంట్ జనరల్ ఫిలిప్ కంపోస్ నేతృత్వంలో ఓ కమిటీని కేంద్రం నియమించింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు రక్షణ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది

కేరళలో తగ్గుతున్న శ్రామిక జనాభా

2017 ఆర్థిక సర్వే వెల్లడి



తిరువనంతపురం : కేరళలో శ్రామికజనాభా తగ్గిపోతోంది. అత్యధిక ఆయుఃప్రమాణాలు కలిగిన, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు కలిగి జనాభా పరివర్తన దిశగా సాగి వృద్ధ జనాభా సంఖ్య గణనీయంగా పెరుగుతున్న కేరళలలో పనిచేసే వారి సంఖ్య తగ్గిపోతోందని రాష్ట్ర ఆర్థిక సమీక్ష 2017 తెలిపింది. కేరళ జనాభాలో వృద్ధ జనాభా (60 ఏళ్లు, ఆపైబడిన వారి) సంఖ్య పెరుగుతోంది. 1961లో 6 శాతంగా ఉన్న ఈ జనాభా శాతం 2011లో 13 శాతానికి పెరిగిందని ఆ సమీక్ష పేర్కొన్నది. ఆయుఃప్రమాణాలు పెరగడం, ఆరోగ్యసంరక్షణ సదుపాయాలు అందుబాటులోకి రావడం కారణంగా వయస్సుపైబడిన వారి శాతం పెరుగుతోందని ఆ సమీక్ష తెలిపింది. ఆర్థిక సమీక్షా నివేదికను ఇటీవల రాష్ట్ర శాసనసభ ముందు ఉంచారు. కాగా, 15-59 ఏళ్ల మధ్య వయస్కులలో శ్రామిక జనాభా సంఖ్య పెరుగుతున్నప్పటికీ వృద్ధి రేటు తక్కువగానే ఉన్నదని ఆ నివేదిక వెల్లడించింది. "ఈ విధమైన ధోరణే కొనసాగినట్లైతే, సమీప భవిష్యత్‌లో శ్రామిక జనం కనిపించరు. పనిచేయలేని (0-14సంవత్సరాల) వారికన్నా వీరి సంఖ్యే ఎక్కువగా ఉంటుంది" అని ఆ సర్వే హెచ్చరించింది. ప్రభుత్వం భరిస్తున్న అత్యధిక సామాజిక భద్రత వ్యయాన్ని వినియోగించుకుంటున్నందున వృద్ధుల (60 సంవత్సరాలు ఆ పైబడిన) శాతం గణనీయంగా పెరిగిపోతోంది. 0-14 ఏళ్ల మధ్య జనాభా 1961లోని 43 శాతం నుంచి 2011లో 23 శాతానికి పడిపోయింది. 2011 జనాభా లెక్కల ప్రకారం కేరళలో ప్రతి చదరపు కిలోమీటరుకు నివసించే జనాభా 860 మంది. గడిచిన 40 సంవత్సరాలుగా జనాభా సంఖ్యను చూస్తే ఉత్తర మలప్పురం జిల్లా అత్యధిక జనాభాతో కొనసాగుతోంది. ఆ తరువాత స్థానాలలో తిరువనంతపురం, ఎర్నాకుళం ఉన్నాయి. వయానంద్ జిల్లాలో అతిస్వల్ప జనాభా ఉన్నది. ఆ తరువాత స్థానాల్లో ఇడుక్కి, కాసరగడ్, పతనంతిట్ట ఉన్నాయని ఆ నివేదిక పేర్కొన్నది.

వైద్యంలో భారత్ బెస్ట్

- 2016లో 2లక్షల మంది విదేశీయులకు ఆరోగ్య సంరక్షణ వీసాలు
- చికిత్స కోసం అమెరికా, బ్రిటన్, రష్యా నుంచి రాక : సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ : వైద్యపరంగా భారతదేశ ప్రతిష్ఠ పెరుగుతోంది. 2016 సంవత్సరంలో 2 లక్షల మందికిపైగా భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ పొందారు. ఈ విధంగా ఆరోగ్య సంరక్షణ పొందిన వారిలో పాకిస్థాన్‌కు చెందిన 1,678 మంది, అమెరికాకు చెందిన 296 మంది వున్నారు. వైద్యపరంగా భారతదేశానికి ప్రతిష్ఠపెరుగుతోందనటానికి ఇది సూచికగా చెప్పవచ్చు. హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2016 సంవత్సరంలో 54 దేశాలకు చెందిన మొత్తం ఈ 2,01,099 మెడికల్ వీసాలను జారీచేశారు. ఈ రంగానికి సంబంధించి తన వీసా విధానాన్ని భారత్ 2014లో సరళీకరించింది. వైద్య విలువలు భారత్‌లో బాగున్నాయని, అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో వైద్య సదుపాయాలు ఉన్నాయని, చికిత్స కూడా అంతే మెరుగ్గా వున్నదని, చికిత్స వ్యయం తక్కువగా ఉన్నదని వ్యాపారరంగానికి సంబంధించిన ఒక చాంబర్ నిర్వహించిన సర్వే తెలిపింది. భారత్‌లో వైద్యపరమైన పర్యాటకం దాదాపు మూడు బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. 2020 నాటికి ఇది 7-8 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందని ఆ సర్వే పేర్కొన్నది. 2016లో విదేశీయులకు జారీచేసిన మెడికల్ వీసాలకు సంబంధించి అత్యధికంగా 99,799 బంగ్లాదేశ్ జాతీయులకు జారీచేశారు. ఆ తరువాత స్థానంలో ఆఫ్ఘనిస్థాన్ (33,955), ఇరాక్ (13,465), ఒమన్ (12,227), ఉజ్బెకిస్థాన్ (4,420), నైజీరియా (4,359) తదితర దేశాలు ఉన్నాయని హోం మంత్రిత్వ శాఖ గణాంకాలు తెలిపారు. పాకిస్థాన్ జాతీయులు 1,678 మంది, అమెరికా పౌరులు 296 మంది, బ్రిటన్‌కు చెందిన 370 మంది, రష్యాకు చెందిన 96 మంది, ఆస్ట్రేలియాకు చెందిన 75 మందికి మెడికల్ వీసాలు జారీచేశారు. ఇందులో ఎక్కువ మెడికల్ వీసాలను ఈ-వీసా కేటగిరి క్రింద జారీచేసినట్టు హోం మంత్రిత్వ శాఖ అధికారులు పీటీఐకి తెలిపారు.

రైల్వే ట్రాక్‌మ్యాన్‌లకు 'రక్షక్'


మరింత భద్రతపై రైల్వే బోర్డు దృష్టి

న్యూఢిల్లీ : రైల్వే ట్రాక్‌మ్యాన్‌లకు మరింత భద్రత కల్పించడంపై రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టికేంద్రీకరిస్తోంది. అందులో భాగంగా భద్రతా సిబ్బందికి 'రక్షక్' పరికరాలను అందజేయాలని నిర్ణయించింది. నిర్వహణ కార్మికులు విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరగడాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి వ్యక్తిగత భద్రత పరికరాలను అందజేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ప్రస్తుతం వారికి ఇస్తున్న బూట్లు, రెయిన్‌కోట్లు, గ్లోవ్స్, చలికోట్లు, పరికరాల కిట్‌కి అదనంగా వీటిని ఇస్తారు. ఈ ప్రతిపాదనకు రైల్వే బోర్డు గత వారం ఆమోదం తెలిపింది. చేతితో పట్టుకునే వాకీ-టాకీ పరికరాన్ని వారికి అందజేస్తారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద అత్యధిక సాంద్రత కలిగిన ప్రాంతాలలో మొట్టమొదట వీటిని వినియోగిస్తారు. ఈ పరికరాలు రైళ్ల చేరికపై ఎల్ఈడీ సూచికతో పాటు బజర్, వైబ్రేషన్‌తో ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తుంటాయి. ట్రాక్‌మ్యాన్‌లు రైలు పట్టాలపై అటూఇటూ తిరగడానికి ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నారు. "రైలు పట్టాలపై విధులు నిర్వహిస్తున్నప్పుడు ట్రాక్‌మ్యాన్‌లు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరగడాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి రక్షక్ తరహా రక్షణ వ్యవస్థ అత్యవసరం. ఈ వ్యవస్థను సత్వరమే అమలు చేయాల్సిన అవశ్యకత ఉన్నది" అని జోనల్ రైల్వేలకు రైల్వే బోర్డు రాసిన లేఖ పేర్కొన్నది. ఈ వ్యవస్థ ఇంకా ప్రాయోగిక దశలోనే ఉన్నందున ఇప్పటికిప్పుడే రైల్వే నెట్‌వర్క్ అంతటా ఈ వ్యవస్థను అమలు చేయడం సాధ్యంకాదనీ, అయినప్పటికీ త్వరితగతిన అమలు చేయాలని సూచించింది.

గగనతలంలో తప్పిన ప్రమాదం

ఎదురెదురుగా విమానాలు..!

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



ముంబై: గగనతలంలో సుమారు 27వేల అడుగుల ఎత్తులో రెండు విమానాలు ఎదురెదురుగా వచ్చాయి. దీంతో వెంటనే విమాన పైలట్లు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎయిర్‌ఇండియా, విస్తారా విమానాలు గగనతలంలో ఎదురెదురుగా అతి సమీపంలోకి వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు విస్తారా విమాన పైలట్లను డీజీసీఏ(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) తొలగించింది. అసలేం జరిగిందంటే.. 152 మంది ప్రయాణికులతో ఢిల్లీ నుంచి పుణె వెళ్తున్న యూకే 997 విస్తారా విమానం 27వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోంది. అదే సమయానికి ఎయిరిండియాకు చెందిన ముంబయి నుంచి భోపాల్ వెళ్లే ఎయిర్‌బస్ ఏ-631 విమానం ఎదురుగా వచ్చింది. రెండు విమానాలు 27వేల అడుగుల ఎత్తులోనే ప్రయాణించాయి. సెకన్ల వ్యవధిలోనే రెండు విమానాలు ఎదురెదురుగా వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన విమాన పైలట్లు ప్రమాదం జరగకుండా చాకచక్యంగా వ్యవహరించారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) సమాచారం ప్రకారం విస్తారా 29వేల అడుగుల ఎత్తులో ప్రయాణించాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా విస్తారా పైలట్లు వ్యవహరించినందుకు గాను డీజీసీఏ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎదురెదురుగా వచ్చిన సమయంలో విమానాల మధ్య దూరం కేవలం 100 అడుగులు మాత్రమే.

ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) విచారణ చేపట్టింది. ఇదే తరహా ఘటన గత నెల 28న కూడా జరిగింది. హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్ వెళ్తున్న ఇండిగో ఏ-320, సింగపూర్ నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ బోయింగ్ 777 విమానం కూడా ఇలాగే గగనతలంలో ఎదురెదురుగా వచ్చాయి. క్షణాల్లో పెను ప్రమాదం తప్పింది.



వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి

నిధుల విడుదలపై శ్వేతపత్రం

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్


విశాలాంధ్ర - కర్నూలు : ప్రత్యేక హెూదా కంటే ప్రత్యేక ప్యాకేజీ మేలు అంటున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులపై తక్షణం శ్వేతపత్రం విడుదల చేయాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలులోని సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం ఎన్నో ప్రతిపాదనలు పంపినప్పటికీ మూడేళ్లలో కేవలం రూ.1050 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయన్నారు. కర్నూలు, అనంతపురంతోపాటు ఇతర జిల్లాల్లో జాతీయ ప్రాధాన్యత కలిగిన 11 విద్యా సంస్థల అభివృద్ధికి రూ.1200 కోట్లు అవసరమన్నారు. కడప ఉక్కు, కర్నూలు ట్రిపుల్ ఐటీ, విశాఖ రైల్వేజోన్, మరో పోర్టు, విజయవాడ, విశాఖ మెట్రో రైలు తదితర ప్రాజెక్టులు, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఈ రెండు ప్రాంతాల అభివృద్ధి కోసం రాజకీయ పార్టీలు తమ జెండాలు, అజెండాలు పక్కనబెట్టి కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు నన్మూర్తి, జిల్లా అధ్యక్షులు తిమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నాయకులు నాగరాజు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ

విశాలాంధ్ర- చీరాల : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర మహాసభ నేడు ప్రకాశం జిల్లా చీరాలలో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కిర్ల కృష్ణారావు తెలిపారు. చీరాలలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఆయన మహాసభ వివరాలను మీడియాకు వెల్లడించారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో సోమవారం జరిగే మహాసభకు వివిధ జిల్లాల నుంచి అన్ని విభాగాలకు చెందిన 1000 మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు హాజరవుతున్నారన్నారు. ఉదయం 10 గంటలకు పట్టణంలో కార్మికుల ప్రదర్శన ఉంటుందన్నారు. 11లకు ప్రారంభమయ్యే మహాసభకు స్థానిక ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, రాష్ట్ర పురపాలకశాఖ సంచాలకులు కె కన్నబాబు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్డీ సర్దార్, పట్టణ కార్యదర్శి బి సామ్యేల్, ఎ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా లక్ష్యం

కేంద్ర సహాయ మంత్రి ఆర్కే సింగ్



విశాలాంధ్ర - మచిలీపట్నం : దేశంలో అన్ని ప్రాంతాలకు 2019 సంవత్సరం నాటికి 24 గంటల పాటు నిరతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు కేంద్ర విద్యుత్, నూతన పునరుద్దరణీయ ఇందన వనరులశాఖ సహాయ మంత్రి ఆర్.కె.సింగ్ అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం వచ్చిన ఆయన ఆదివారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. సౌభాగ్య పథకం ద్వారా దేశంలో 4 కోట్ల గృహ కనెక్షన్ల మంజూరుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ విద్యుత్ కనెక్షన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొంటే సంబంధిత అధికారులు గ్రామాలకు వచ్చి కనెక్షన్ ఇస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 4 సోలార్ ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. 675 కేవీ హై కెపాసిటీ ట్రాన్స్‌మిషన్ లైన్ మంజూరు చేసినట్టు చెప్పారు. రూ.900 కోట్లతో దీనదయాళ్ గ్రామీణ యోజన పథకం కింద మారుమూల ప్రాంతాలకు డిస్ట్రిబ్యూషన్ కనెక్షన్ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు కంబంపాటి హరిబాబు మాట్లాడుతూ పునర్విభజన చట్టంలోని అన్ని హామీలు నెరవేర్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ కోతలు అధికంగా ఉండేవని ప్రస్తుతం నిరంతర విద్యుత్ సరఫరాకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసేందుకు కావాల్సిన నిధుల మంజూరుకు కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. దుగ్గరాజపట్నం ఓడరేవు, కడప స్టీల్‌ప్లాంట్, రైల్వేజోన్‌కు సంబంధించిన కొన్ని సాంకేతిక అంశాలు పరిశీలనలో ఉన్నాయని, అవి పరిష్కారమైతే ఈ సంస్థల ఏర్పాటుకు తగు చర్యలు చేపడతామని హరిబాబు అన్నారు.

సింహపురిలో అవార్డు సింహాసనం లాంటిది

విశాలాంధ్ర - నెల్లూరు (సిటీ) : సింహపురిలో అవార్డు తీసుకోవడం సింహాసనాన్ని అధిష్టించినంత అనుభూతి పొందానని సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి అన్నారు. నెల్లూరులోని నగర పురమందిరంలో ఆదివారం సాయంత్రం సిరివెన్నెలకు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు స్మారక అవార్డును నిర్వాహకులు అందజేశారు. అవార్డు గ్రహీత సిరివెన్నెల మాట్లాడుతూ కళాకారులకు కొలువైన నెల్లూరు గడ్డ నుంచి ఎందరో మహానుభావులు బయటకొచ్చారన్నారు. ఉన్నతమైన భావాల ద్వారా తన కవితా, రచన, వచనలతో ఎందరినో మంత్రముగ్దులను చేసిన డాక్టర్ నాగభైరవ అవార్డు స్వీకరించడం గర్వంగా ఉందన్నారు. కళాకారులకు పుట్టినిల్లు నెల్లూరు నేల అని పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎంతోమందిని సినీ పరిశ్రమకు అందించిన జిల్లా మన కిల్లా అన్నారు. నవ్యాంధ్రలో సినీ పరిశ్రమ నెల్లూరుకు రావాలని ఆయన అభిలాషించారు. మాజి మంత్రి మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ నాగభైరవ పురస్కారాన్ని సిరివెన్నెలకు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తుంగా శివప్రసాద్ రెడ్డి, నలబోతు బలరామయ్య నాయుడు తదితరులు సిరివెన్నెలను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.

గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అభిరామ్‌కు చోటు



విశాలాంధ్ర - రేపల్లె : గుంటూరు జిల్లా రేపల్లెలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి గుత్తికొండ వెంకట అభిరామ్‌కు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. 2016 డిసెంబర్ 25న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో సిలికాన్ ఆంధ్ర-డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నాట్యప్రదర్శనలో వెంకట అభిరామ్‌కు ఈ గౌరవం దక్కింది. దేశంలోని ప్రముఖ దేవాలయాల్లో కూచిపూడి, జానపద నృత్యంలో ఇప్పటి వరకు 200 వరకు ప్రదర్శనలు ఇచ్చిన వెంకట అభిరామ్ చదువులోనూ ముందున్నాడు. ఈ సందర్భంగా వెంకట్ అభిరామ్‌ను పాఠశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మహేష్, కరస్పాండెంట్ అపర్ణ, కోఆర్డినేటర్లు పద్మలత, వాణి ప్రసన్న ప్రత్యేకంగా అభినందించారు.

16న ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం

విశాలాంధ్ర - డోన్ : విజయవాడలోని దాసరి నాగభూషణం భవనంలో ఈ నెల 16వ తేదీన అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు తెలిపారు. కర్నూలు జిల్లా డోన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు ప్రజలకు ఎన్నో హామీలు గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇలా అనేక సమస్యలపై సమితి సమావేశాల్లో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు వివరించారు.

ఫిషింగ్ హార్బర్ మిస్సింగ్ !

- జాడ లేని సర్వే నివేదికలు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- మత్స్యకారులకు తప్పని అవస్థలు



విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : అత్యధిక తీర ప్రాంతం కలిగిన నెల్లూరు జిల్లాలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఎన్నికల హామీలకే పరిమితమవుతోంది. ప్రభుత్వం సమగ్ర సర్వే చేసినా నిర్మాణానికి నిధులు విడుదల చేయకపోవడంపై మత్స్యకారులు రగిలిపోతున్నారు. జిల్లాలో 170 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. కావలి నుంచి సరిహద్దు ప్రాంతమైన తడ వరకు తీరంలోని 118 మత్స్యకార గ్రామాల్లో 1.5 లక్షల మంది మత్స్యకారులు సముద్రంపై చేపలవేట ఆధారంగా కుటుంబాలను పోషిస్తుంటారు. మోటరైజ్డ్, తెప్పలు, పడవలు మొత్తం 10 వేల వరకు ఉన్నాయి. ఏడాదికి సుమారు 80 వేల టన్నుల మత్స్య సంపద వస్తుంది. నిల్వ చేసుకునే అవకాశం లేక విదేశాలకు తరలిస్తున్నారు. మత్స్యకారులకు ఎంతో కీలకమైన ఫిషింగ్ హార్బర్ నిర్మాణం మాత్రం రాజకీయ నేతల ఎన్నికల హామీలకే పరిమితమవుతోంది. గతంలో ముత్తుకూరు మండలంలోని తీరప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ ఉండేది. కృష్ణపట్నం పోర్టు నిర్మాణం కోసం దానిని తొలగించారు. ఈ నేపథ్యంలో మత్స్యకారుల కోరికతో రాష్ట్ర ప్రభుత్వం అల్లూరు మండలంలో హార్బర్ నిర్మించేలా హామీ ఇచ్చింది. జువ్వలదిన్నెలో 76.89 ఎకరాల్లో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అనువైన ప్రదేశం ఉన్నట్టు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రభుత్వం తన నివేదికలో హార్బర్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర సర్వే కూడా పూర్తిచేసింది. సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది. పట్టించుకునే వారు కానరాక ఈ ప్రాజెక్టులో అడుగు ముందడుగు పడలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హార్బర్ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 1.5 లక్షల మందికి, పరోక్షంగా మరో లక్షమందికి ఉపాధి దొరకుతుందని ఆశపడుతున్నారు.

మత్స్యకారుల కష్టాలెన్నో..

ఫిషింగ్ హార్బర్ ప్రత్యేకంగా లేకపోవడంతో ప్రస్తుతం పడవలు, బోట్లు నిలుపుకునేందుకు జాడ కానరాని పరిస్థితి. విశాఖపట్టణం, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతా దూరం వెళ్లాలంటే సమయం వృథా కావడంతో పాటు ఖర్చుతో కూడుకున్నపని. బోటు నిల్వ చేసి ఇంటికి రావాలంటేనే పది రోజుల సమయం పడుతుంది. అనేక అవస్థలు పడుతున్న మత్స్యకారులు ఏళ్ల తరబడి హార్బర్ నిర్మాణం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

అడ్డంకి ఎక్కడ..

రాష్ట్ర ప్రభుత్వం వాప్‌కోస్ లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం గతంలో సర్వే చేయించింది. అదే సంస్థతో రెండో సారి సర్వే అనంతరం సమగ్ర నివేదిక సిద్ధం చేసింది. హార్బర్ నిర్మాణం ఎక్కడ చేపట్టాలి, ఎన్ని బెర్తులు తదితర సమగ్ర వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదికను కేంద్రప్రభుత్వానికి పంపాలి. నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు మంజూరు చేయాల్సి ఉంది. మిగిలిన సహాయాన్ని కేంద్ర ప్రభుత్వాన్ని కోరవచ్చు. సాగరమాల పథకం కింద కేంద్ర నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని మత్స్యకార సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నివేదికను కేంద్రప్రభుత్వానికి పంపలేదని తెలుస్తోంది. హార్బర్ నిర్మాణంతో మా కష్టాలు తీర్చమంటూ మత్స్యకారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కృష్ణాజిల్లాలో యువ దంపతుల ఆత్మహత్య

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : ఏడాది క్రితం పెళ్లి చేసుకున్న దంపతులు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం కృష్ణాజిల్లా నూజివీడు మండలంలో తీవ్ర సంచలనం కలిగించింది. నూజివీడు మండలంలోని పల్లెర్లమూడి గ్రామానికి చెందిన కలిదిండి నాగార్జున (26), కలిదిండి భవానీ (22) తమ గృహంలో పాల్పడ్డారు. భవానీ ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి. రూరల్ ఎస్ఐ చిరంజీవి కథనం ప్రకారం.. నాగార్జున, భవానీలకు ఏడాది క్రితం వివాహమైంది. శనివారం రాత్రి దంపతులు తమ గదిలో నిద్రించగా, నాగార్జున తల్లిదండ్రులు మరో గదిలో నిద్రించారు. ఆదివారం ఉదయం ఎన్నిసార్లు పిలిచినా గది తలుపులు తెరవకపోవడంతో తల్లిదండ్రులు కిటికీలో నుంచి చూశారు. ఇరువురు ఉరి వేసుకుని ఉండటంతో కన్నీరుమున్నీరు అయ్యారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భవాని రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని.. ఎవరికైనా అంగ బలం, అర్థబలం ఉండాలని, తమకు అంగ బలం ఉన్నప్పటికీ అర్థబలం లేదని భవానీ పేర్కొంది. మృతదేహాలను పోస్టుమార్టం కోసం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కనీస వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరి

స్కీం వర్కర్ల సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె లీలావతి




విశాలాంధ్ర - వేలేరుపాడు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో అమలు చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర పథకాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె లీలావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా వేలేరుపాడు మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం కారం కుమారి, కౌలూరి సైదా అధ్యక్షతన స్కీం వర్కర్ల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. స్కీం వర్కర్స్‌తో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తుందన్నారు. కనీస వసతులకు దూరంగా అతి తక్కువ గౌరవ వేతనాలతో ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్నా వారి ఉద్యోగ భద్రతను ప్రభుత్వం పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. బిల్లులు, వేతన బకాయిల కోసం పోరాటాలు చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. లక్షల్లో జీతాలు పెంచుకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు చిరు ఉద్యోగుల గురించి ఆలోచించక పోవడం బాధాకరమన్నారు. స్కీం వర్కర్స్‌కు నెలకు రూ.18 వేలు వేతనం పెంచాలన్నారు. జనవరి 23వ తేదీన స్కీం వర్కర్ల సమ్మెను తప్పుబడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలోని స్కీం వర్కర్లకు నోటీసులు ఇవ్వడం సరైన చర్య కాదన్నారు. నోటీసులతో సంఘాలను బయట పట్టలేరని, ఇదే పరిస్థితి కొనసాగితే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యులు సీహెచ్ సీతామహాలక్ష్మి, తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి జిల్లా అధ్యక్షులు నర్రాటి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో స్కీం వర్కర్స్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తరచూ తీసుకువెళుతున్నా వారికి కనివిప్పు కలగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కారం దారయ్య, బాడిశ రాము, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి పత్రా లీలావతి, ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి కరాటం సీతామహాలక్ష్మి, మడకం ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

ఆయేషా తల్లిదండ్రులను విచారణ చేసిన సిట్

- ఆరు గంటలపాటు కొనసాగిన విచారణ
- కీలక వివరాలు నమోదు
- న్యాయం చేయాలని కోరిన షంషాద్‌బేగం, ఇక్బాల్ బాషా



విశాలాంధ్ర - తెనాలి : రాష్ట్రంలో సంచలనం కలిగించిన బీ ఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా హత్య కేసు పునర్విచారణలో ఆదివారం సిట్ అధికారుల బృందం ఆయేషా తల్లిదండ్రులను ఆరు గంటలపాటు విచారణ చేసింది. ఈ కేసులో సత్యంబాబు పాత్ర లేదంటూ ఆయేషా తల్లి షంషాద్ బేగం మొదటి నుంచీ వాదిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారి, డీఐజీ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అధికారులు గుంటూరు జిల్లా తెనాలిలోని ఆయేషా ఇంటికి వెళ్ళారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు షంషాద్ బేగం, ఇక్బాల్ బాషాను విచారణ చేశారు.. ఆయేషా హత్యకు సంబంధించిన కీలక వివరాలు నమోదు చేసుకున్నట్టు సమాచారం. ఆ సమయంలో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంత మయ్యారు. అనంతరం ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, ఇక్బాల్ భాషా మాట్లాడుతూ సిట్ అధికారి శ్రీకాంత్‌పై తమకు విశ్వాసం ఉందన్నారు. కేసును నిష్పక్షపా తంగా దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అసలు దోషులను పట్టుకోలేకపోయినా ఫర్వాలేదని, గతంలో మాదిరిగా మరో అమాయకుడిని బలి చేయవద్దని కోరారు. అసలు దోషులెవరో అందరికీ తెలుసని, తాము చెబుతున్న వారిని విచారణ చేస్తే అసలు నిందితులు బయటకు వస్తారన్నారు. తమ కుమార్తె హత్య కేసులో హాస్టల్ వార్డెన్ పద్మతోపాటు ఆమె భర్త, మరో ముగ్గురు విద్యార్థినుల ప్రమేయం ఉందని ఆరోపించారు. తెనాలిలో విచారణ చేసిన సిట్ బృందంలో డీఎస్పీలు హిమావతి, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం. 7

(చట్టం నెం. 30/2013లోని సెక్షన్ 19(1) మరియు రూలు 25(1) ప్రకారము)

Rc. G1/271/2016 Dt. 06-02-2018 **రూఢీ ప్రకటన** Gazette No.16/KST/2018, Dt : 06-02-2018

(2013వ సంవత్సరము 30వ చట్టం సలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియామవళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా కృష్ణాజిల్లా, గన్నవరం, వెదురుపావులూరు గ్రామ భూములను ప్రజాప్రయోజనాల నిమిత్తము అనగా లింక్ రోడ్డుతో విజయవాడ ఇన్నర్ రింగ్ రోడ్డుతో కలుపుట కొరకు భూమి కావలయునని శ్రీయుత కలెక్టర్ కృష్ణాజిల్లా వారు భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టంలో 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత కలెక్టర్ కృష్ణాజిల్లా వారు సంతృప్తి చెంది, ఈ దిగువ కృష్ణా షెడ్యూల్ దాఖలా భూములను ప్రజాప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీయుత కలెక్టర్, కృష్ణాజిల్లా 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజాప్రయోజనమునకై అనగా విజయవాడ రింగ్ రోడ్డును లింక్ రోడ్డుతో కలుపు నిమిత్తము అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేయుచున్నారు.

షెడ్యూలు

జిల్లా : కృష్ణా మండలము : గన్నవరం గ్రామం : వెదురుపావులూరు

క్రమ సంఖ్య	రీ.సర్వే. నెం	సబ్ డివిజన్	పూర్తి విస్తీర్ణం	పట్టా/ అసైన్డ్	పుంజ/ సంజ	భూసేకరణ విస్తీర్ణం	అనుభవదారునిపేరు/ పట్టాదారుని పేరు
1	491	4(పి)	0.37	పట్టా	మాగాణి	0.02	షేక్ ఇస్రావుల్లా
		5(పి)	0.07	పట్టా	మాగాణి	0.04	చాగంటి మంగమ్మ
		6(పి)	0.27	పట్టా	మాగాణి	0.07	దాగంటి మంగమ్మ
2	492	1	0.2	పట్టా	మాగాణి	0.09	షేక్ కమల్ అహ్మద్
		2	0.67	పట్టా	మెట్ట	0.25	కడియాల వెంకట కృష్ణారావు
		3	6.5	పట్టా	మాగాణి	0.01	వెలగా మాధవరావు
		9	0.51	పట్టా	మెట్ట	0.17	పాలడుగు కృష్ణ
		14	1.19	పట్టా	మెట్ట	0.21	దొకుపర్తి సరస్వతి గరిమెళ్ళ సుబ్బారావు
3	493	4	0.34	పట్టా	మెట్ట	0.10	జంగిరాల శ్రీకృష్ణమ్మ
		11	1.01	పట్టా	మెట్ట	0.20	పాలడుగు చంద్రశేఖర్‌రావు
4	494	10	0.21	పట్టా	మెట్ట	0.03	అబ్దుల్ దవలత్
		11	0.19	పట్టా	మెట్ట	0.03	అబ్దుల్ దవలత్
		12	0.53	పట్టా	మెట్ట	0.07	కడియాల తిరుపతమ్మ షేక్ సుబాని
		13	0.26	పట్టా	మెట్ట	0.03	గుట్ట చేటి సరోజిని
		14	0.5	పట్టా	మెట్ట	0.05	కొరివి సురేష్‌కుమార్
5	498	11	0.17	పట్టా	మెట్ట	0.08	కొప్పుల జయరాజు
		12	0.47	పట్టా	మెట్ట	0.11	కడియాల వెంకటేశ్వరరావు కడియాల సుభాష్‌చంద్రబోస్
		16	0.33	పట్టా	మెట్ట	0.04	కడియాల వెంకటేశ్వరరావు
6	499	8	1.15	పట్టా	మెట్ట	0.12	కడియాల వెంకటేశ్వరరావు కడియాల ప్రవీణ్‌కుమార్
		10	0.55	పట్టా	మెట్ట	0.08	ఆర్ల శివపార్వతి
7	500	16	0.31	పట్టా	మెట్ట	0.09	కొమ్మినేని కృష్ణారావు
		17	0.33	పట్టా	మెట్ట	0.07	కొమ్మినేని కృష్ణారావు గరిమెళ్ళ పూర్ణచంద్రరావు
		18	0.37	పట్టా	మెట్ట	0.10	గరిమెళ్ళ పూర్ణచంద్రరావు
		19	0.29	పట్టా	మెట్ట	0.05	వేమూరి అప్పారావు
		20	0.9	పట్టా	మెట్ట	0.08	కొమ్మినేని కృష్ణారావు వాకా కొండయ్య
8	502	1	0.24	పట్టా	మాగాణి	0.01	కొమ్మినేని శివనాగేశ్వరరావు కొంగర బసవయ్య
		2	0.12	పట్టా	మాగాణి	0.01	కడియాల పార్వతి కొమ్మినేని శివనాగేశ్వరరావు
		4	0.26	పట్టా	మాగాణి	0.02	అట్ల రామస్వామి
		5	0.13	పట్టా	మాగాణి	0.04	కడియాల పార్వతి
		8	0.99	పట్టా	మాగాణి	0.27	కాకాని మహేశ్వరరావు
9	503	1	0.81	పట్టా	మాగాణి	0.06	బొప్పన రవిప్రసాద్
		4	0.13	పట్టా	మాగాణి	0.03	బొప్పన రవిప్రసాద్
		5	0.12	పట్టా	మాగాణి	0.03	బొప్పన రవిప్రసాద్
		6	0.18	పట్టా	మాగాణి	0.09	బొప్పన రవిప్రసాద్
		7	1.41	పట్టా	మాగాణి	0.07	కొండపాతూరి వెంకటజగన్నాథం కొండపాతూరి వెంకటేశ్వరరావు
10	504	2	4.12	పట్టా	మాగాణి	0.36	కడియాల వెంకట కృష్ణారావు
11	507	1	0.77	పట్టా	మాగాణి		కడియాల వెంకటేశ్వరమ్మ
		2	1.15	పట్టా	మాగాణి	0.09	గరిమెళ్ళ కృష్ణారావు గరిమెళ్ళ రామకృష్ణ భారతీదేవి
		మొత్తం				**3.56**	

భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నూజివీడు కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి, లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/- **బి. లక్ష్మీకాంతం**

కలెక్టర్, కృష్ణాజిల్లా

మాజీ సీఎం 'నల్లారి' మౌనమెందుకో..

- ఉమ్మడి రాష్ట్ర చివరి సీఎంగా ముద్ర
- విభజన గడియలో కీలక పాత్ర

విశాలాంధ్ర- మదనపల్లె : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా క్లిష్ట సమయంలో శక్తివంతమైన పాలన అందించిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తాజా పరిణామాల్లో ఎక్కడా కానరాకపోవడం చర్చనీయాంశమ వుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో తాజాగా ప్రత్యేక హెూదా, పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై అనేక పరిణామాలు చోటు చేసుకున్న ప్పటికీ విభజన సమయంలో కీలక నేతగా వ్యవహరించిన తాజీ మాజీ సీఎం ఒక్కమాట కూడా మాట్లాడలేని పరిస్థితికి వెళ్ళడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కర్షక పరిషత్ ఛైర్మన్ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగి ఆయన సంస్కరణలతో పాలనలో తనదైన ప్రత్యేక ముద్ర వేశారు. రాజకీయ చరిత్రలో ముఖ్యమంత్రిగా పనిచేసి పదవీ విరమణ తర్వాత కనీసం 5 సంవత్సరాలైనా ప్రజల్లో ఆ నేత ప్రభావం ఉండటం సహజం. అయితే కిరణ్‌కుమార్‌రెడ్డి తాజా మాజీ సీఎం అయినప్పటికీ ఒక్క నియోజకవర్గంపైన కూడా ప్రభావం చూపకపోవడం గమనార్హం.

రాష్ట్ర విభజన ఆఖరి దశలో తెలంగాణ, ఆంధ్రాలో ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసి పడ్డాయి. సమైక్యాంధ్ర కోసం తుది వరకు పోరాడుతానం టూ నల్లారి కాంగ్రెస్ అధిష్టానాన్ని ఎదిరించినా విభజన జరిగిపోయింది. ఈ నేపథ్యంలో జై సమైక్యాంధ్ర పార్టీ స్థాపించిన ఆయన రాష్ట్రంలోని అన్ని సీట్లలో పోటీ చేసినా చివరకు సొంత నియోజకవర్గం పీలేరులో కూడా విజయం సాధించకపోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. 2014 ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత నల్లారి అనుచరులు ఒక్కొక్కరూ వైసీపీ, టీడీపీల్లోకి వలస వెళ్ళారు. అనంతరం నల్లారి ఎక్కడా పెద్దగా కనబడటంగానీ, మాట్లాడిన దాఖలాలు కానరాలేదు. పీలేరు నియోజకవర్గంలో కేవలం రెండు కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ ఆయన మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సరైన సమయంలో స్పందిస్తానంటూ బదులిచ్చి వెళ్ళిపోయారు. రూ.1,950 కోట్లతో పీలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తూ 20 సంవత్సరాలు ముందుకు తీసుకెళ్ళిన ఘనత ఆయనకే దక్కిందనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలతో పాటు పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ప్రభుత్వ విద్యాసంస్థలకు కార్పొరేట్ తరహా భవంతులు నిర్మించారు. ఇంత చేసిన ఆయన రాజకీయ శూన్యత నుంచి ఎందుకు బయటపడలేకపోతున్నారనేది ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

తన తండ్రి దివంగత నేత, మాజీ మంత్రి నల్లారి అమర్నాథరెడ్డి రాష్ట్రంలోనే అప్పట్లో శక్తివంతమైన నేతగా ఎదిగారు. ఆయన మరణించకపోతే ముఖ్యమంత్రి పదవి వరించేదనేది రాజకీయ విశ్లేషకుల వ్యాఖ్య. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒక దశలో ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించిన ఘనత అమర్నాథరెడ్డికే దక్కింది. ఇంతటి చరిత్ర కలిగిన నల్లారి కుటుంబం రాజకీయ స్తబ్దత చర్చకు తెరదించుతూ ఆయన సోదరుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొని తన కుటుంబానికి రాజకీయ ప్రత్యర్థి అయిన పెద్దిరెడ్డికి దీటుగా సవాల్ విసురుతున్నారు. టీడీపీలో కిషోర్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే, కుమారునికి ఎంపీ టికెట్ ఖాయమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంతో చరిత్ర కలిగిన తన కుటుంబం రాజకీయ పరిస్థితి దిక్కుతోచనిస్థితిలో పడ్డ సమయంలో కిషోర్‌కుమార్‌రెడ్డి సరైన సమయంలో సరైన నిర్ణయమే తీసుకున్నారనే వాదన లేకపోలేదు. ఇదే క్రమంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ భవిష్యత్‌పై రకరకాల వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కిషోర్ లేదా ఆయన కుమారుడు పీలేరు నుంచి పోటీచేస్తే కిరణ్‌కుమార్‌రెడ్డి ఎక్కడి నుంచి బరిలో దిగుతారనేది చర్చ. ఈ క్రమంలో బీజేపీలో చేరతారని పుకార్లు తెరపైకి వచ్చాయి. బీజేపీకి ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతతో లేక తనకు రాజకీయాలు నేర్పిన కాంగ్రెస్ పార్టీకి మరింత దూరం కాలేకనో మౌనంగా ఉన్నారనేది కొందరి వాదన. త్వరలో కాంగ్రెస్ పార్టీలో రాజకీయ పునఃప్రవేశం చేస్తారనే ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి హెూదాలో తెలంగాణ ఉద్యమం, జగన్ అరెస్టు సమయంలోనూ చిన్న ఘటనలకు ఆస్కారం లేకుండా సమర్థవంతమైన పాలన కొనసాగించిన కిరణ్ శూన్యతకు తెరదించి క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారో లేదోననే చర్చ నడుస్తోంది.

కూలిన రష్యా విమానం : 71 మంది దుర్మరణం

మాస్కో: రష్యాకు సరటోవ్ ఎయిర్‌లైన్స్ విమానం ఆదివారం కూలిపోయింది. ఇందులో 68మంది ప్రయాణికులు, ఆరుగురు విమాన సిబ్బంది మొత్తం 71 మంది ఉన్నారు. ఇందులో మాస్కో లోని డుమోడెడ్వో అంతర్జాతీయ విమా నాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రాడార్‌లో విమానం జాడ అదృశ్య మైంది. సరటోవ్ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తున్న ఏఎన్148 రకం విమానం మాస్కో లోని అర్గునోవ్ అనే గ్రామం సమీపంలో కూలిపోయింది. ఈ విమానం ఓరస్క్ నగరానికి వెళ్లాల్సి ఉంది. అధికారులు కూడా ప్రమాదం జరిగిన విషయాన్ని ధ్రువీ కరించారు. సహాయక బృంద ాలు ఘటనా స్థలానికి బయల్దేరాయి. రష్యా ప్రభుత్వం ఈ ఘటనపై క్రిమినల్ దర్యాప్తును ప్రారంభించింది. ప్రమాదానికి గురైన ఏఎస్ 148 రకం విమానం కొత్తదే. దీనిని సర్వీసులోకి తీసుకొని కేవలం ఎనిమిదేళ్లే అవుతోందని ఎయిర్‌లైన్స్ సంస్థ తెలిపింది. దీనిని అంతర్జాతీయ సర్వీసులకు కూడా నడిపారు. దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఘటనలో మృతులకు సంతాపం తెలిపారు. రష్యా ట్రాన్స్‌పోర్టు మంత్రి మాక్సిమ్ సొకలోవ్ ఘటనా స్థలానికి బయల్దేరారు. మొత్తం 71 మంది మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు.

డంకెన్ డ్రైవ్‌లో 105 మందిపై కేసులు

విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్: డ్రంకెన్ డ్రైవ్ విషయంలో పోలీసులు ఎన్ని తనిఖీలు చేసినా.. ఎన్ని కేసులు పెట్టినా యువతలో మార్పు కనిపిం చడం లేదు. మరోవైపు తనిఖీలు చేస్తున్న పోలీసులపైనే వారు ఎదురుదాడికి దిగుతున్నారు. ప్రతి వారం మాదిరిగానే శనివారం అర్ధరాత్రి పోలీసులు జూబ్లిహిల్స్ చెక్‌పోస్టు వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 105 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు 42 కార్లు, 61 మోటర్‌సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు. అయితే పట్టుబడిన వారిలో ఇద్దరు యువతులున్నారు. వారిలో ఒకరిపై కేసు పెట్టడంతో ఆమె పోలీసులతో వాగ్వివాదానికి దిగ్గింది. మరోఘటనలో ఓ యువకుడు దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు అతనిని అరెస్టు చేశారు.



ప్రజాసమస్యలు పట్టని మోడీ

- కార్పొరేట్ల సేవలో తరింపు
- హోదాపై మభ్యపెట్టిన టీడీపీ, బీజేపీ
- సీపీఎం నేత ప్రకాశ్‌కారత్

విశాలాంధ్ర-భీమవరం: దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి చిత్తశుద్ధి లేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్ విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 25వ మహాసభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌తో మోడీ చిత్తశుద్ధి వెల్లడైందని కారత్ పేర్కొన్నారు. బడ్జెట్‌పై ఎన్నో సందిగ్ధతలు నెలకొన్నాయని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు అనుమానంగా ప్రస్తావించారని మరి రైతుకు స్వామినాథన్ సూచించినట్లు గిట్టుబాటు ధర ఎప్పుడొస్తుందని ప్రశ్నించారు. బడ్జెట్‌లో ఇందుకోసం కేటాయింపుల్లేవని విమ ర్శించారు. తమ హక్కుల కోసం రైతాంగం దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తోందని స్వామినాథన్ కమిషన్ నివేదికలో కీలకమైన వాటిని విస్మరించడం దారుణమని కారత్ అన్నారు. 50 లక్షల మందికి పైగా ఉపయోగపడుతుందని చెపుతున్న ఆరోగ్య బీమా ప్రైవేట్ ఆసు పత్రులకు, ప్రైవేట్ బీమా కంపెనీలకు ఉపయోగ పడుతుందని విమర్శించారు. ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని, వైద్య సేవల్ని ప్రజలకు అందుబాటులోకి తేవడానికి బదులుగా కార్పొరేట్ సేవలకే మోడీ ప్రభుత్వం తహతహలాడుతోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై టీడీపీ చేస్తున్న పోరాటాన్ని విలేకరులు ప్రస్తావించగా టీడీపీ ఇప్పుడే నిద్రలేచిందని, వామ పక్షాలు నాలుగేళ్లుగా దీనిపై పోరాటం చేస్తున్నాయని గుర్తు చేశారు. బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న టీడీపీ నాలుగేళ్లుగా ప్రజల్ని మభ్యపెట్టిందని, వామపక్షాలిచ్చిన బంద్‌కు అనూహ్యమైన స్పందన రావడంతో పార్లమెంట్‌లో డ్రామాలాడుతోందని కారత్ చెప్పారు. ఏపీకి న్యాయం చేయాలని సీపీఎంతో పాటు ఇతర వామపక్షాలు పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. సర్జికల్ దాడుల తర్వాత ఉగ్రవాదాన్ని నిర్మూలిం చామని మోడీ ప్రభుత్వం పేర్కొందని వాస్తవానికి అందుకు భిన్నమైన పరిస్థితులు నేడు నెలకొన్నాయన్నారు. ఆర్మీ క్యాంప్‌పై నిన్న జరిగిన దాడిలో ఆరుగురు సైనికులు మృత్యువాతపడ్డారని చెప్పారు. ఈ విధమైన దాడి జరగడం ఇది రెండో సారి అని ఈ తరహా ఘటనల వల్ల సైనికులు ప్రాణాల్ని కోల్పోవడంతో పాటు సామాన్య ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని కారత్ ఆందోళన వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌తో చర్చలు జరపడానికి మోడీ ప్రభుత్వం తిరస్కరిస్తోందని అయితే చర్చలే ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపుతాయని ఆయన స్పష్టం చేశారు. రాబోయే సాధారణ ఎన్నికల వ్యూహంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ హైదరాబాద్‌లో జరిగే అఖిల భారత మహాసభల్లో పార్టీ వ్యూహం ఖరారవుతుందని దాని ఆధారంగా భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని చెప్పారు. మతోన్మాద బీజేపీని ఓడించడమే తమ ప్రధాన లక్ష్యమని, త్రిపురలో జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు తప్పదని కారత్ స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోసం పోరాటం

- సీఎం చంద్రబాబుతో ఎంపీల భేటీ
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం
- కేంద్రంపై ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టీకరణ



విశాలాంధ్ర-అమరావతి : విభజన హామీల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరు కొనసాగిస్తామని తెలుగు దేశం పార్టీ స్పష్టం చేసింది. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీ ఎంపీలు భేటీ నిర్వహించి భవిష్యత్ ప్రణాళికపై చర్చించారు. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో జరిగిన ఈ భేటీలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్, ఎంపీలు గల్లా జయదేవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావులు పాల్గొన్నారు. పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన తీరు, కేంద్రం అనుసరిస్తున్న వైఖరి, ఇతర ప్రధాన అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా వెనకాడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతిపక్షాల వ్యవహార శైలిని సైతం ప్రజలకి తెలియచేయాలని సూచించారు. అలాగే కేంద్రం నుంచి ఒణగూరిన లబ్ధిని అంకెలతో సహా మీడియాకి వివరించాలని ఆదేశించారు. అనంతరం సీఎం నివాసం వద్ద గ్రీవెన్స్ సెల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీలు, రాష్ట్ర అధ్యక్షుడు వివరించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్ మాట్లాడుతూ విభజన హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని అన్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదాకి సమానమైన ప్యాకేజి అంటూనే నేటికి ఏ విధమైన లబ్ధి చేకూర్చ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ ఎంపీలు పార్లమెంటులో పోరాటం సాగిస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాల రాజకీయ పక్షాలు సైతం నవ్యాంధ్ర ఇబ్బందులు అర్థం చేసుకొని కేంద్రం ఆదుకోవాలని డిమాండు చేయటం రాష్ట్ర సంక్షేమానికి సహకారం అందించటమేనని కొనియాడారు. 18 అంశాలతో కూడిన లేఖను కేంద్రానికి అందించామని అన్నారు. 27 పేజీల లేఖలో బీజేపీ నేతలు చెబుతున్న లెక్కలలో వాస్తవం లేదని అన్నారు. రూ.24 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చింది ఏమిలేదని వాపోయారు. రాజధాని అమరావతి, విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ వంటి వాటిని పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారులకు లక్ష కోట్లు ఇవ్వలేదని, రూ.5 కోట్లు మాత్రమే వచ్చాయని చెప్పారు. 18 అంశాలలో ప్రధానమైన వాటిని నెరవేర్చాలని డిమాండు చేశారు. ప్రతిపక్షం స్వప్రయోజనాల కోసం పాకులాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను విస్మరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలే అంతిమంగా తెలుగుదేశం పార్టీ లక్ష్యమని, ఆ దిశగా తమ పోరాటం కొనసాగుతుందని కళా వెంకట్రావ్ స్పష్టం చేశారు.

సర్వం కోల్పోయాం.. సాధించుకునేందుకు పోరాటం : ఎంపీ గల్లా జయదేవ్

విభజన వల్ల ఆస్తులన్నీ కోల్పోయామని, ఒక్క పరిశ్రమ లేదని, ఆదాయం లేదని, పట్టణాలు లేవని, పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఎక్కడుందనేది ప్రశ్నార్థకంగా మారిందని ఎంపీ గల్లా జయదేవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే తాము పోరాటం చేస్తున్నామని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా ఎదిగే వరకూ కేంద్రం సహకరించాలని కోరారు. బీజేపీ మద్దతుతోనే పార్లమెంటులో విభజన బిల్లు ఆమోదం పొందిందని, అది కేంద్రం గుర్తుంచుకోవాలని అన్నారు. జీఎస్‌టీ అమలు తర్వాత కూడా చాలా రాష్ట్రాలు రాయితీలు పొందుతున్నాయని, అలాంటప్పుడు ఏపీకి రాయితీలు ఇవ్వటంలో ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. ఈఏపీ ప్రాజెక్టుల్లో సహాయం చేస్తామన్నారని, నేటికి వాటిపై స్పష్టత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తలసరి ఆదాయం ఆధారంగా వెనుకబడిన జిల్లాలను ఆదుకుంటామన్నారని, ఆ చర్యలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టులో పునరావాస చట్టం ప్రకారం పెరిగిన రూ.33 వేల కోట్ల అంచనాలపై స్పష్టత ఇవ్వటం లేదని అన్నారు. మొత్తం 19 అంశాలపై తాము పోరాడుతున్నామని చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్, అమరావతి నిర్మాణం, రెవెన్యూ లోటు అంశాలను వదిలేసి బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సంక్షేమం జాతీయ అంశం అయిపోయిందని, ఇతర పక్షాలు కూడా మన పట్ల అనుసరిస్తున్న తీరు చూసి బీజేపీని నమ్మగలమా అంటున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ ఇచ్చిన 27 పేజీల లేఖలో ఏ ఒకటి వాస్తవం లేదని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

విభజన హామీలు అమలు చేయాలి : ఎంపీ రామ్మోహన్ నాయుడు

రాష్ట్రానికి న్యాయం కోసమే చట్టం ఉందని, విభజన హామీలు అమలు చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు డిమాండు చేశారు. ఎన్నిసార్లు ఢిల్లీ గడపను ముఖ్యమంత్రి తొక్కాలని, ఎన్నిసార్లు నివేదికలు ఇచ్చుకుంటూ వెళ్లాలని ప్రశ్నించారు. తమ పోరాటంలో వెనుకడుగువేయమని, కచ్చితమైన ప్రకటన వస్తేనే రాజీ పడతామని అన్నారు. పొరుగు రాష్ట్రాల మాదిరిగానే తాము కలలు కంటున్నామని, తమకు చేయూతను ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని చెప్పారు. అంతా కలిసి కట్టుగా ఉండి పోరాటం చేయాలని పిలుపు ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలు మీడియా సమావేశం నిర్వహించి తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని జాతీయ సంస్థలను ఇచ్చామని చెబుతున్నారని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఇచ్చేవే ఏపీకి వచ్చాయని తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా ఇళ్లు వచ్చాయని, అది ఏపీ ఆవాస్ యోజన కాదుకదా, మరి రాష్ట్రానికి ప్రత్యేకంగా ఇచ్చింది ఏముందన్నారు. రైల్వే జోన్ కోసం 20 ఏళ్లుగా పోరాడుతున్నామని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలు విడుదల చేసిన 27 అంశాల నివేదికలో అది ఉందా అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఆందోళన చేయడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగమని, ప్రతిపక్ష పార్టీ మూర్ఖంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. కొందరు జేఏసీ అంటున్నారని, మన పోరాటంలో నిజముంది అందుకే దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలు మనకు దన్నుగా నిలిచాయని వివరించారు. ఇలాంటి పోరాటాల్లో అంతా కలిసి కట్టుగా వెళ్లాలని అన్నారు. నాలుగేళ్లలో రూ.400 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇచ్చే నిధుల విషయంలో స్పష్టత ఉండాలన్నారు. విభజన హామీలు అమలు జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. అనంతరం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు ఇస్తున్న నిధులు ఏపీకి ఇస్తున్నారా అని ప్రశ్నించారు. బీజేపీ చెబుతున్న 27 పేజీల లేఖలో ఉన్న అభివృద్ధి నిధులు మిగతా రాష్ట్రాలకు ఇవ్వటం లేదా అని అన్నారు. రెవెన్యూ లోటు చెల్లింపు కోసం ఫార్ములా అంటున్నారు ఇదెక్కడి చోద్యమని వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదాలో ఉండే అంశాలు ప్యాకేజీలో ఉండాలని చెప్పామని, వాటిలో ఉన్న వాటినే అమలు చేయాలంటున్నామని అన్నారు. రహదారి ప్రాజెక్టులకు కేంద్రం ఖర్చు చేసింది రూ.6 వేల కోట్లేనని, ఈ ప్రాజెక్టుల మొత్తం కేంద్రం తన జేబులో నుంచి భరించేది కాదని ఘాటుగా ప్రశ్నించారు. ప్యాకేజీలో లెక్కలు చూస్తే రాష్ట్రానికి వచ్చింది రూ.400 కోట్లు మాత్రమేనని అన్నారు. ఇడ్లీ, వడ ఆర్డర్ ఇచ్చినట్టు కేంద్రాన్ని అడగలేమని, పద్ధతి ప్రకారం నడుచుకోవాలని పేర్కొన్నారు. పందొమ్మిది అంశాలు ఎలా నెరువేరుస్తారో కార్యాచరణ ప్రకటన చేయాలని డిమాండు చేశారు.

లెక్కలకు పొంతన లేదు : పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాష్ట్ర విభజన తరు వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లెక్కలకు, ఏపీ ప్రభు త్వం చెబుతున్న లెక్కలకు పొంతన లేకుండా ఉందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. విభజన హామీ లోని అంశాలను సాధించేందుకు ఏపీలో జాయింట్ ఫ్యాక్ట్ కమిటీ(జేఎఫ్‌సీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందు లో భాగంగా ఇప్పటికే జయప్రకాష్ నారాయణను కలిసిన ఆయన ఆదివారం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమా ర్‌తో పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. వివిధ అంశాలపై చర్చించిన వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులతో కలిసి నిజని ర్ధారణ కమిటీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న లెక్కల్లో ఎవరు అబద్ధం చెబుతున్నారనే విషయం బయట పడుతుందన్నారు. అదే సమయంలో విభజన హామీలు ఎలా సాధించాలనే కార్యాచరణ కూడా రూపొందించి ముందుకు సాగనున్నట్లు వివరించారు. ఈ కమిటీ ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేకుండా ఆర్థిక రంగ నిపుణులతోపాటు వివిధ రంగాల నిపుణులు సమేకమై పని చేస్తుందన్నారు. త్వరలోనే ఇందులో ఎవరెవరు ఉంటారనే విషయాలు వెల్లడిస్తామని, ప్రస్తుతానికి జయప్రకాష్ నారాయణతోపాటు ఉండవల్లి అరుణ్‌కుమార్ కూడా ఉంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న లెక్కలను శ్వేతపత్రం ద్వారా విడుదల చేస్తే నిజనిర్ధారణ కమిటీ వాస్తవాలను వెలికితీస్తుందని, దీంతో అసలు అబద్ధాలు ఎవరు చెబుతున్నారనే విషయం కూడా ప్రజలకు తెలు స్తుందన్నారు. ఈ ప్రత్యేక ప్యాకేజీ నిధుల విషయంలో అపోహలు ఉన్నాయని, అందుకే నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఒక్కరైతే అబద్ధం చెబుతున్నారనే విషయం స్పష్టంగా ఉందని, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాను మద్దతిచ్చినందున తనకు కూడా ఇందులో భాగస్వామ్యం వర్తిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ కమిటీలో జనసేన ఉండబోదని స్పష్టం చేశారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఏ రాజకీయ నాయకులు కలిసినా అక్కడ ఏం జరుగుతుంది, ఇక్కడ ఏం జరుగుతుంది, ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే అంశాలపై పవన్ తనతో మాట్లాడకుండా నేరుగా అసలు ఎవరు అబద్ధం ఆడుతున్నారు సార్ అని అడగడం వల్లనే ఆయనతో పని చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. సామాన్యునికి ఉపయోగపడే దృక్పథం ఆయనలో బలంగా ఉందనే నమ్మకంతో ఉన్నానని, జేఎఫ్‌సీలో పని చేయడానికి తాను మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నట్లు తెలిపారు. పోలవరం విషయంలో శ్వేతపత్రం పవన్ కంటే ముందే తానే అడిగానని, పవన్ అడగ్గానే ఆయన ప్రభుత్వంలో భాగస్వామ్యం కాబట్టి ఇస్తారని, ప్రజలకు వాస్తవం తెలుస్తుందని అనుకున్నానని అన్నారు. ఇది రాజకీయం కాదు ప్రజాసంక్షేమం, పవన్ కల్యాణ్ ఇప్పుడు అసలుసిసలు రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టినట్లు తాను భావిస్తున్నట్లు ఉండవల్లి చెప్పారు. ఇప్పుడైనా టీడీపీ, బీజేపీలు పవన్ చేస్తున్న ఈ ప్రయత్నానికి సహకరించాలని కోరారు. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా విడుదల చేసిన నిధుల లెక్కలను ఈనెల 15లోగా సమర్పించాలని పవన్ ప్రభుత్వాన్ని కోరారు.



అమితాభిమానంతో హీరో ఉక్కిరిబిక్కిరి

విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్: తన ఫ్యాన్స్ చూపిన అమితాభామానంతో ఓ స్టార్ హీరో ఉక్కిరిబిక్కిరియ్యారు. ఒక షోరూమ్‌ను ప్రారంభించేందుకు వచ్చిన బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హాష్మి దాన్ని ప్రారంభించకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌లోని టోలిచౌకి పోడియం మాల్‌లో ఓ షోరూంను ప్రారంభించేందుకు శనివారం రాత్రి 8.30 ప్రాంతంలో ఇమ్రాన్ నగరానికి చేరుకున్నారు. ఆయనతో పాటు బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనానెహ్వాల్, బాలీవుడ్ నటి రియాచక్రవర్తి ఉన్నారు. ఇమ్రాన్ షోరూం వద్దకు చేరుకున్న వెంటనే అప్పటికే గంటల తరబడి వేచివున్న అభిమానులు ఒక్కసారిగా కారు వద్దకొచ్చి ఇమ్రాన్‌తో కరచాలనం కోసం ఎగబడ్డారు. దీంతో ఆయన కారులో నుంచి కిందకు దిగే పరిస్థితి కూడా లేకపోయింది. ఇమ్రాన్‌తో పాటు ఉన్న సెక్యూరిటీగార్డులు సైతం జనాన్ని అదుపు చేయలేకపోయారు. దీంతో చేసేదేమీ లేక అతికష్టం మీద కారు వెనక్కుతీసుకుని షోరూమ్‌ను ప్రారంభించకుండానే ఇమ్రాన్ వెనుదిరగాల్సి వచ్చింది.

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు కృషి

సీపీఎం రాష్ట్ర మహాసభ తీర్మానం



విశాలాంధ్ర-భీమవరం: ఆంధ్రప్రదేశ్ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు అభ్యుదయ, ప్రజానుకూల, లౌకిక విధానాలతో ప్రజలకు ఊరట కలిగించగలిగే వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర 25వ మహాసభ తీర్మానించింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సామాజిక న్యాయ సాధనకు, యువత ఉజ్వల భవిష్యత్తుకు, మహిళా సాధికారితకకు రాష్ట్రంలోని వామపక్ష, ప్రజాతంత్ర, అభ్యుదయ, సామాజిక, శక్తులన్నీ ఏకం కావాలని మహాసభ పిలుపునిచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న మహాసభల్లో రెండో రోజు ఆదివారం ఈ మేరకు తీర్మానాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంవిఎస్ శర్మ ప్రవేశపెట్టగా, పలు సూచనలు, చర్చల అనంతరంతరం తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తీర్మాన పాఠం ఇలా వుంది. తాము అధికారంలోకి వస్తే నవ్యాంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి సాధ్యం అన్న ప్రచారంతో గెలిచి అధికారాన్ని చేపట్టిన టీడీపీ ప్రజలను మోసం చేసిందని అటు బిజెపి ప్రత్యేకహోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీలు, రైల్వే జోన్ ఏర్పాటు, ఉక్కు పరిశ్రమ నిర్మాణం, రాజధాని నిర్మాణానికి నిధులు, బడ్జెట్ లోటును భర్తీ చేయ డానికి ప్రత్యేక నిధుల విడుదల వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను దారుణంగా వంచించిందని విమర్శించింది. మిత్ర పక్షంగా ఉంటూ విభజన హామీల అమలును సాధించడంలో టీడీపీ ఘోరంగా విఫలమైందని, రాష్ట్రం వెనుకబాటుకు టీడీపీ, బీజేపీలు బాధ్యత వహించాలని మహాసభ డిమాండు చేసింది. పెట్టుబడులను ఆకర్షించే పేరుతో విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అంతులేని రాయితీలనిస్తూ స్వదేశీ పరిశ్రమలను మూసివేత దిశగా పావులు కదుపుతోందని విమర్శించిది. అగ్రకుల దురహంకార దాడులు, దళిత, ఆదివాసీ, బలహీనవర్గాలపై పెరుగుతున్నాయనీ, మహిళా సాధికారత మాటలకే పరిమితమైందనీ, గిరిజన హక్కులకు రక్షణ కరువైందని విమర్శించింది. దళితులపై, మహిళలపై సాగుతున్న దాడులను, అత్యాచారాలను, నేరాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. పై నుండి కింది దాకా అవినీతి విచ్చలవిడిగా సాగుతోంది. లంచం లేనిదే ఏపనీ కావడం లేదని మహాసభ అభిప్రాయపడింది. ప్రజా ఉద్యమాలను 144 సెక్షన్, పోలీసు యాక్ట్ 30లతో అణచేస్తున్నారని ముందస్తు అరెస్టులు, అక్రమ కేసులు మితిమీరుతున్నాయని. బాధితులపై కేసులు, అక్రమ అరెస్టులు సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి, అభ్యుదయ, ప్రజానుకూల, లౌకిక విధానాలతో ప్రజలకు ఊరట కలిగించగలిగే ప్రత్యామ్నాయం నేటి తక్షణ అవసరమనీ. ఈ ప్రాతిపదికగా రాష్ట్రంలోని వామపక్ష పార్టీలను, వామపక్ష భావాలుగల వ్యక్తులను, వర్గ, ప్రజా శక్తులను, సామాజిక, అభ్యుదయ సంస్థలను, శక్తులను ఒకే వేదికపైకి సమీకరించి బలమైన ఉద్యమాలు నిర్మించాలని సభలో ఏకాభిప్రాయానికి వచ్చారు. చర్చల్లో వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాచరణను ప్రకటించారు.

కార్యాచరణ ప్రణాళిక: రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి విభజన చట్టంలోని హామీల అమలు, కేంద్రం నుండి నిధుల సాధనకు కృషి చేయాలనీ. కరవు ప్రాంతాలకు నీటి ప్రాజెక్టులపై ఉద్యమాలు చేయాలనీ, విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు, గ్యాస్‌లో రాష్ట్రంలో వాటా సాధన, విద్యుత్ ఎరువుల ఉత్పత్తికి ప్రభుత్వంతో పోరాడాలని నిర్ణయిస్తూ మహాసభ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. రైతులకు కనీస మద్దతు ధర రైతు రక్షణ నిధి ఏర్పాటు, రుణ మాఫీ, ప్రైవేటు రుణ నియంత్రణ చట్టం కోసం పోరాటాలు చేయాలని పేర్కొంది. భూమి లేని నిరుపేదల కుటుంబానికి ఉచితంగా రెండు ఎకరాల భూమి-వ్యవసాయ కార్మికులకు సంవత్సరం పొడవునా పనులు, కనీస కూలి రోజుకు రూ.300 అమలు-పేదలకు ఉచిత విద్యుత్, ప్రతి ఇంటికీ టాయిలెట్, మంచినీరు, గ్యాస్ సరఫరాకు పోరాడాలని మహాసభ కార్యాచరణను రూపొందించింది.

ఇతర కులస్తులను ఎస్టీల్లో చేర్చడం తగదు

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి : రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక డిమాండ్



విశాలాంధ్ర-విశాఖ: ఇతర కులస్తులను గిరిజనుల్లోకి చేర్చే విధంగా నిర్ణయం తీసుకుంటే అధికార పార్టీ అధోగతిపాలవుతుందని, ఇలాంటి తప్పు టీడీపీ చేయదని భావిస్తున్నామని గిరిజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు వివేక్ నాయక్ అన్నారు. కారం శివాజీ, సత్యపాల్ కమిటీల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేయడాన్ని ఈ సందర్భంగా తప్పు పట్టారు. ఆదివారం గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో విశాఖలోని ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయ, మత్స్య, తదితర కులాలను ఎస్టీల్లో చేర్చాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టారు. మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చేందుకు మద్దతు ఇస్తామన్న పవన్‌కల్యాణ్ నిర్ణయాన్ని కూడా వ్యతిరేకించారు. ఈనెల 12 నుంచి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. ఈనెల 12న పాడేరు, అనంతగిరి, లక్కగూడెంలలో గిరి దీక్ష, 15న పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం, 17న కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుండా సురేంద్ర మాట్లాడుతూ గిరిజన కేటగిరిల్లో తప్పా ఓపెన్ కేటగిరిల్లో గిరి జనులకు ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కేటాయిస్తున్నారా అని ప్రశ్నిం చారు. గిరిజన నిర్ణయాన్ని ఏకమిటీ అయినా పరిగణలోకి తీసుకుందా అని అన్నారు. ఒక్క గిరిజన ప్రతినిధి కూడా లేకుండా అసెంబ్లీ తలు పులు మూసుకొని గిరిజన హక్కును కాలరాసే తీర్మానాలు తయారుచేసి కేంద్రానికి పంపడం దారుణమన్నారు. జిల్లా అధ్యక్షుడు లక్క చిట్టిబాబు మట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు కావస్తున్న ఆదివాసీయులు వెనకబడేఉన్నారన్నారు. కొన్ని గిరిజన తండాల్లో అంద కారంలోనే జీవిస్తున్నారని, ఊటనీరే తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. గిరిజన వనరులైన బాక్సైట్, కాఫీ వంటి వనరులను ప్రభుత్వం ఆదాయంగా చేసుకుంటూ గిరిజన హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందన్నారు. 32 ఉపకులాలు ఉన్న గిరిజనులందరూ ఏకమై ప్రభుత్వ ఆలోచనలు గట్టిగా తిప్పికొడతా మన్నారు. బోయిలు, మత్స్యకారులు ఒక్కో కులం వారు 40లక్షలు పైగా ఉన్నారన్నారు. వారందరికి ఎస్టీల్లో చేరిస్తే సహించేందిలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పసుపులేటి బాలరాజు, ఎం బాలరాజు, ఎం మణికుమారి, ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, కిడారి సర్వేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు కొప్పుల రామారావు, పలువురు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మోడీ.. కాంగ్రెస్‌పై విమర్శలా..!

- వాజ్‌పేయి, అద్వానీలను అవమానించలేదా
- ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే.. హామీలు అమలు చేయాల్సిందే
- చిరంజీవి చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరు
- నా పోరాటం వెనుక పార్టీ మద్దతు ఉంది
- కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు

న్యూఢిల్లీ-విశాలాంధ్ర బ్యూరో : బీజేపీ అగ్రనేతలు వాజ్‌పేయి, అద్వానీలను మోడీ చాలా అవమానించారని, ఇలాంటి వ్యక్తి కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పిస్తారా, ప్రధాని నరేంద్ర మోడీ ఆస్కార్‌కి మించిన నటుడని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు వ్యాఖ్యానించారు. ఆదివారం న్యూఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడీ లోక్‌సభలో స్పృహ లేకుండా కాంగ్రెస్‌ని ఉద్దేశించి అసత్యంగా మాట్లాడారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులను కాంగ్రెస్ పార్టీ అవమానించిందన్నది శుద్ధ అబద్ధమన్నారు. మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య మీద మోడీ అపారమైన జాలి, కరుణ చూపించిందనందుకు ధన్యవాదాలు అని అన్నారు. అంజయ్యని కాంగ్రెస్ చాలా అవమానించిందని మోడీ చెబుతున్నారని, లక్ష రూపాయల సూట్, కళ్ల అద్దాలు పెట్టుకుని అంజయ్య ఎప్పుడూ లేరని ఆయన తెలిపారు. అంజయ్య కూలీగా, సామాన్యుడిగా బతికేవారని అన్నారు. అంజయ్య 1957 నుంచి చనిపోయేంత వరకు కాంగ్రెస్‌లోనే ఉన్నారని చెప్పారు. ఆయనకి కుల బలం లేదని, కానీ ప్రజాబలం ఉందని వ్యాఖ్యానించారు. అంజయ్య మరణించిన తర్వాత కూడా ఆయనను కాంగ్రెస్ పార్టీ గౌరవించిందన్నారు. అయితే ఎస్సీ అయిన అంజయ్యని అవమానించారని మోడీ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పీవీ నరసింహారావు గురించి కూడా మోడీ చాలా బాధ పడ్డారని ఎద్దేవా చేశారు. పీవీ నరసింహారావుకి ధన బలం లేదు, కుల బలం లేదు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రోత్సాహం వలన ఆంధ్రప్రదేశ్‌కి నరసింహారావు ఎంతో మేలు చేశారని చెప్పారు. పీవీ నరసింహారావు పుట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్నారని అన్నారు. అద్వానీకి మనకంటే మోడీ గురించి ఎక్కువ తెలుసునని, అలాంటి ఆయనను బొటన వేలితో తొక్కి పెట్టారని ఆరోపించారు.

అద్వానీపై సీబీఐ కేసు పెట్టి ఈ వయసులో కూడా కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టేటప్పుడు బీజేపీ పనికిరాని డాక్యుమెంట్లు ఇచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీకి అప్పుడు 202 సీట్లు మాత్రమే ఉన్నాయని, కానీ బీజేపీ అప్పుడు అడ్డుపడి ఉంటే తెలంగాణ బిల్లు పాస్ అయ్యేది కాదని స్పష్టం చేశారు. రాజ్యసభలో తాను, తన మిత్రులు కలిసి బీజేపీ వారిని బిల్లును అడ్డుకోమని వేడుకున్నామని, కానీ ఆ రోజు కాంగ్రెస్ పాత్ర చాలా చిన్నదని, బీజేపీ పాత్ర చాలా పెద్దదని వ్యాఖ్యానించారు. వారి సవరణలన్నీ ఉపసంహరించుకుని బిల్లుకు మద్దతు పలికారని చెప్పారు. విభజన సమస్యలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, అవి అమలయ్యే వరకు తమ పోరాటం జరుగుతుందని కేవీపీ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని, విభజన చట్టంలో హామీలు అమలు చేయాలని, పోలవరం ప్రాజెక్టును అనుకున్న సమయంలో పూర్తి చేయాలన్న ముఖ్యమైన మూడు అంశాలపై కేంద్రాన్ని తాను డిమాండు చేస్తున్నానని కేవీపీ చెప్పారు. విభజన శాస్త్రీయంగా జరగలేదని బీజేపీ చెబుతోందని, అయితే ఆ అంశాన్ని విభజన జరిగిన సమయంలో బీజేపీ నేత సుష్మాస్వరాజ్ ఎందుకు ప్రశ్నించలేదని కేవీపీ ప్రశ్నించారు. తన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ నుంచి పూర్తి మద్దతు ఉందని, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా ఏపీ ప్రజల సమస్యలపై జరుగుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు చిరంజీవి ఈ విభజన హామీల అమలు పోరాటంలో పాల్గొనటం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు కూడా కేవీపీ బదులు ఇచ్చారు. చిరంజీవి చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని, ఆయన కూడా పోరాటంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్లమెంటులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జరిగిన పోరాటంలో ఏపీకి చెందిన కాంగ్రెస్ ఎంపీలు కూడా తనతోపాటు పాల్గొన్న విషయాన్ని కేవీపీ గుర్తు చేశారు.



దక్షిణాఫ్రికా జట్టుకు జరిమానా

జొహానెస్‌బర్గ్: భారత్‌తో జరిగిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా జట్టుకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) జరిమానా విధించింది. శనివారం వాండరర్స్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత టీమిండియా బ్యాటింగ్ చేసింది. నిర్ణీత సమయానికి మించి ఒక ఓవర్ ఆలస్యంగా వేసినందుకు ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ నిబంధనల ప్రకారం స్లో ఓవర్ రేట్ కారణంగా సఫారీ జట్టులోని ప్రతి ఆటగాడికి వారి మ్యాచ్ ఫీజులో 10శాతం, కెప్టెన్‌కు 20శాతం జరిమానా పడనుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత స్లో ఓవర్‌రేట్ కారణంగా జరిమానా విధిస్తున్నట్లు చేసిన ప్రతిపాదనకు ఎలాంటి వాదనలు చేయకుండానే తాత్కాలిక సారథి మార్‌క్రమ్ అంగీకరించాడు.

భారత్‌ను ఓడించడం
కష్టమే

దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ కెప్లర్ వెసెల్స్

జొహానెస్‌బర్గ్: విరాట్ కోహ్లీ సారథ్యంలోని భారత వన్డే జట్టును 2019 వన్డే ప్రపంచకప్‌లో ఓడించడం ఏ జట్టుకైనా కష్టమేనని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ కెప్లర్ వెసెల్స్ అభిప్రాయపడ్డారు. ఆరు వన్డేల సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌ల్లో సునాయాసంగా గెలుపొంది, నాలుగో వన్డేలో భారత్ పరాజయంపాలైన సందర్భంగా ఆయన స్పందించారు. 'ప్రపంచకప్‌లో తలపడే జట్లలో టీమిండియా ఫేవరెట్ అని చెప్పలేను. కానీ వాళ్లు గట్టి పోటీనిస్తారు. ప్రధాన ఆటగాళ్లు గాయాల బారిన పడకుండా ఉంటే అది ఆ జట్టుకు లాభం చేకూర్చే అంశం. వాళ్లను ఓడించడం అంత సులువైన విషయం కాదు.'అని కెప్లర్ అన్నారు.

రోహిత్ ఫుట్‌వర్క్ సమస్య

దక్షిణాఫ్రికా పర్యటనలో రోహిత్ శర్మ పరుగులు చేయకుండా వరుసగా విఫలమవడానికి అతని ఫుట్‌వర్కే పెద్ద సమస్యని మాజీ సారథి వివరించారు. సీమ్, బౌన్స్‌లకు సహకరించే పిచ్‌లపై అతని టెక్నిక్‌లో మార్పులు చేసుకోవాల్సిన అవసరముంది. భారత్‌తో పాటు ఆస్ట్రేలియాలో తన టెక్నిక్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని ఎందుకంటే అక్కడ బంతి బౌన్స్ మాత్రమే అవు తుందని సీమ్ అంతగా ఉండ దని అన్నారు. సీమ్, బౌన్స్ ఉన్న పిచ్‌లపై మాత్రమే అతడు ఇబ్బంది పడుతు న్నాడని చెప్పాడు.



పీవీ సింధుకు 'యోనెక్స్' క్షమాపణలు



న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్, ఒలింపిక్ విజేత పీవీ సింధుకు జపనీస్ సంస్థ యోనెక్స్ క్షమాపణలు చెప్పింది.సింధును స్పాన్సర్ చేస్తున్న జపనీస్ స్పోర్ట్స్ మెర్కండైజ్ గ్రూప్ యోనెక్స్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ శనివారం హ్యాక్ అయింది. దీనిని తమ అదుపులోకి తీసుకున్న హ్యాకర్లు సింధుకు షాకిచ్చే పోస్టు పెట్టారు. "గుడ్ బై పీవీ సింధు. భారత్ లాంటి పేద దేశాలకు మేం మద్దతు ఇవ్వబోం" అని యోనెక్స్ చేసినట్టు పోస్టు పెట్టారు. అంతేకాదు.. ఇకపై ఆర్థికంగా బలంగా ఉన్న జపాన్‌పై దృష్టి సారిస్తామని అందులో పేర్కొన్నారు.ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిన విషయం తెలుసుకున్న యోనెక్స్ వెంటనే పరిస్థితిని చక్కదిద్దింది. జరిగిన పొరపాటుకు సింధుకు క్షమాపణలు తెలిపింది. ఈ మేరకు యోనెక్స్ ఫ్యాన్స్ పేరుతో ఓ మెసేజ్ పెట్టింది. యోనెక్స్ ఖాతాలో తమకు తెలియకుండానే కొన్ని పోస్టులు పోస్టయ్యాయని పేర్కొంది. ఖాతా హ్యాక్‌కు గురైందని, హ్యాకర్లే వాటిని పెట్టారని తెలిపింది. ప్రస్తుతం సమస్య పరిష్కారమైందని చెబుతూ జరిగిన తప్పిదానికి క్షమాపణలు వేడుకుంది. యోనెక్స్ క్షమాపణలను తాను స్వీకరించానని, యోనెక్స్‌తో కొనసాగడం వల్ల తనకు ఎటువంటి ఇబ్బందీ లేదని సింధు పేర్కొంది. పీవీ సింధుతోపాటు సైనా నెహ్వాల్, లియాండర్ పేస్‌లను కూడా ఈ గ్రూపే స్పాన్సర్ చేస్తోంది.

అవకాశాలను చేజార్చుకున్నాం : విరాట్



జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో నాలుగో వన్డేలో ఆతిథ్య సఫారీ జట్టు చేతిలో ఓడిన తీరుపై విరాట్ కోహ్లీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను కుదించారు. లక్ష్యాన్ని 28 ఓవర్లకు 202 పరుగులు చేయాల్సిందిగా నిర్ణయిం చారు. మ్యాచ్ అనంతరం కోహ్లీ మాట్లాడుతూ.. 'లక్ష్యాన్ని కుదించడంతో ఈ వన్డే ఓ టీ20 మ్యాచ్‌లా మారింది. మాకు అనుకూలంగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోలేకపోయాం. మేము మ్యాచ్‌లో గెలుపొందేందుకు అనర్హులం' అని ఆవేదన వ్యక్తం చేశాడు. మ్యాచ్‌లో వచ్చిన ఛాన్స్‌లను పోగొట్టుకోకూడదు. ప్రత్యర్థులను కట్టడి చేయాలనుకుంటున్న తరుణంలో ఒకే ఓవర్లో డేవిడ్ మిల్లర్ రెండుసార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో విరాట్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఛేదనలో చాహల్ బౌలింగ్‌లో డేవిడ్ మిల్లర్ 6 పరుగులతో ఉండగా అతడి క్యాచ్‌ను శ్రేయాస్ అయ్యర్ వదిలేశాడు.. మళ్లీ అదే ఓవర్లో మిల్లర్ బౌల్డయినప్పటికీ.. అది నోబాల్‌గా తేలడంతో అతను మరోసారి బతికిపోయాడు. ఈ రెండు అవకాశాలే మ్యాచ్‌ను మలుపుతిప్పాయి.

క్యాచ్ చేజారడం కొంపముంచింది : ధవన్

జొహెన్నెస్‌బర్గ్: వాండరర్స్ వేదికగా జరిగిన నాల్గో వన్డేలో దక్షిణాఫ్రికా భారత్‌పై విజయం సాధించి సిరీస్ ఆశలను సజీవం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా భారీ స్కోర్ సాధించినా.. వర్షం కారణంగా మ్యాచ్ రెండుసార్లు వాయిదా పడటంతో సఫారీలకు అది అనుకూలించింది. అయితే ఇది మాత్రమే కాక.. భారత బౌలర్లు చేసిన కొన్ని తప్పులు కూడా సౌతాఫ్రికా విజయానికి దోహదపడ్డాయి. ఈ విషయంపై భారత ఓపెనర్ శిఖర్ ధవన్ స్పందించాడు. విజయం తమదే అని ధీమాగా ఉన్న మ్యాచ్‌ను ఒక ఓవర్ మలుపు తిప్పింది అని అతను అభిప్రాయపడ్డాడు. "మ్యాచ్ ఓటమికి ముఖ్య కారణం మిల్లర్ క్యాచ్‌ను చేజార్చడమే. అక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది, లేకుంటే పరిస్థితి మాకు అనుకూలంగా ఉండేది" అని మ్యాచ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ధవన్ అన్నాడు. "వర్షం ప్రభావం కూడా కచ్చితంగా ఉంది. గత మూడు మ్యాచ్ అద్భుతంగా రాణించిన మా స్పిన్నర్లు.. తడి పిచ్ కారణంగా ఈ మ్యాచ్‌లో బంతిని తిప్పలేకపోయారు. అది కూడా ముఖ్య కారణమే" అని ధవన్ పేర్కొన్నాడు.

అనుబంధ రంగాల ప్రోత్సాహంతోనే
'గ్రామీణం' పరిపుష్టి

- దల్వాయి కమిటీ సిఫారసులు అమలుచేయాలి
- ధరల స్థిరీకరణకు నిధులు పెంచాలి
- కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

న్యూఢిల్లీ: ఇటీవలికాలంలో వ్యవసాయం, ఇతర రంగాల ద్వారా వచ్చే ఆదాయాలు మందగించాయి. గ్రామీణప్రాంతాలలోని పేదలకు గ్రామా లలో పేదలు 25.7శాతం ఉండగా, పట్టణ ప్రాంతాలలో 13.7 శాతం ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2017-18లో వర్షాలు మెరుగ్గా ఉన్నప్పటికీ వ్యవసాయ రంగం వృద్ధి 2.1శాతం మాత్రమే ఉందని కేంద్ర గణాంక వ్యవస్థ పేర్కొంది. పంటలు గిట్టుబాటు ధర లేకపోవడంవల్ల అనేక రాష్ట్రాలలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. వ్యవసాయరంగంలో అసలు రైతుల సంఖ్య తగ్గి కౌలు రైతులు పెరిగారు. వ్యవసాయ ఆదాయ పడిపోవడం వల్ల ఇతర రంగాలలో ఆదాయం పెంచుకునేందుకు గ్రామీణులు మొగ్గు చూపుతు న్నారు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, చేనేత పరిశ్రమ తదితర వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రభు త్వం తగినంత ప్రాధాన్యతకల్పిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. అయితే అవసర మైన పెట్టుబడులు, పరికరాలు లేకపోవడం తరచుగా విద్యుత్తు కోతలు, నిపుణులైన పనివాళ్లు లేకపోవడంవల్ల ఇతర రంగాలలో వృద్ధి తగినంత జరగడంలేదు. గ్రామీణ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయేతర రంగాల ఉత్పత్తి మూడింట రెండు వంతులు ఉన్నప్పటికీ మొత్తం ఆదాయంలో అసంఘటిత రంగం నుంచి లభించే ఆదాయం 95శాతం ఉంటున్నది. గత ఏడాది ప్రవేశపెట్టిన వస్తుసేవల పన్ను వ్యవసాయేతర రంగాలను ముందుకు వెళ్లనివ్వకుండా చేస్తోంది. పెద్దనోట్లరద్దు కూడా ఈ రంగాన్ని దెబ్బ తీసింది. చిన్నచిన్న కుటీర పరిశ్రమలు బాగా దెబ్బతిన్నాయి. 2018-19 బడ్జెట్‌లో సైతం వ్యవసాయరంగం పురోగమించి రైతుల ఆత్మహత్యలు తగ్గడానికి దోహదంచేసే కేటాయింపులు జరగలేదు. వ్యవసాయేతర రంగాలపై శ్రద్ధ పెంచి వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తే రైతులు ఆత్మహత్యలు కొంతమేరకైనా తగ్గుతాయి. కేంద్రం ప్రవేశ పెట్టిన కృషి వికాస్ యోజన ప్రధానమంత్రి కృషి సంచయ్ యోజన, ఫసల్ బీమా యోజన తదితర ముఖ్యమైన పథకాలవల్ల వ్యవసాయ రంగం మెరుగుపడలేదు. ఆయా పథకాలకు కేటాయింపులు సక్రమంగా లేకపో వడం, మార్కెట్ సౌకర్యాలు కల్పించకపోవడం తదితర కారణాలవల్ల వ్యవసాయ ఆదాయం పెరగడం లేదు. ముఖ్యంగా కృత్రిమ ఎరువులు, పురుగు మందులు, విత్తనాల ధరలు పెరగడం, ఉత్పత్తులకు వచ్చే ఆదాయం పెట్టిన ఖర్చులకు మించి ఎక్కువగా రాకపోవడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వ్యవసాయరంగం నుండి వ్యవసాయేతర రంగాలకు 1980లలోనే బదిలీ అయింది. వ్యవసాయేతర రంగాలనుండి గ్రామీణ ఆదాయంలో 60శాతం ఆదాయం లభిస్తున్నది. నిర్మాణరంగం 74శాతం ఉపాధి కల్పిస్తుండగా పెద్దనోట్లరద్దు తర్వాత ఈ రంగం సైతం దెబ్బతింది. 2004-05, 2011-12 మధ్య కాలంలో ఈ రంగంలోనే ఎక్కువ ఆదాయం లభించింది. గ్రామాలలో ఇళ్లు, రహదారుల నిర్మాణం పెరిగితే ఒక మాదిరి నైపుణ్యం, అసలు నైపుణ్యంలేని కార్మికులకు ఉపాధి పెరుగుతుంది. అయితే నైపుణ్యం అవసరమయ్యే ఉద్యోగాల సృష్టి ముద్ర పథకం కింద మరింత పెరగవలసిన అవసరంఉంది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని నరేంద్రమోడీ ప్రభుత్వం మూడున్న రేళ్ల క్రితం ఇచ్చిన హామీనే తాజా బడ్జెట్‌లోనూ పేర్కొన్నది. ఆదాయం ఎలా రెట్టింపు అవు తుందో... వివరాలు ఇస్తే బాగుండేది. వ్యవ సాయ ఉత్పత్తుల నిల్వలకు గిడ్డంగులు, శీతల గిడ్డంగులు మార్కెట్ మౌలిక సదుపాయాలు కల్పించి వాటిని మార్కెట్లతో అనుసంధానం చేస్తే రైతుల ఆదాయం మెరుగుపడుతుందని దల్వాయి కమిటీ సిఫారసు చేసింది. వీలైన చోట వ్యవసాయానికి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో పోషక విలువలు కలిగిన గింజ ధాన్యాలను, ఇతర వస్తువులను చేర్చాలి. కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, సబ్సిడీపై తుంపర సేద్యం సౌకర్యం తదితరాలు కల్పించాలి. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎగుడు,దిగుడుగా ఉంటున్నందున ధరల స్థిరీకరణ పథకానికి అవసరమైన నిధులను అందించి మార్కెట్ హామీ పథకాన్ని దల్వాయి కమిటీ సిఫారసు మేరకు ప్రవేశపెట్టాలి. వ్యవసాయేతర రంగాలలో ఆదాయంపెంచే కుటీర, చిన్న పరిశ్రమల స్థాపనకు, వాటిఉత్పత్తుల మార్కెటింగ్‌కు తగినసదుపాయాలు కల్పించాలి.


పిటా మరోసారి చొక్కా లేకుండానే..



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): పిటా తౌఫాతౌపువా.. టోంగాకు చెందిన పిటా గుర్తున్నాడు కదా.. 2016 రియో ఒలింపిక్స్‌లో ఒంటి నిండా నూనె రాసుకుని.. చొక్కా లేకుండా.. నడుం చుట్టూ తమ సంప్రదాయ వస్త్రం ధరించి పరేడ్‌లో పాల్గొన్న పిటాతౌఫాతౌపువా తాజాగా మరోసారి ఇలాగే ఒలింపిక్ పరేడ్‌లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. తాజాగా దక్షిణకొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో వింటర్ ఒలింపిక్స్ జరుగుతోన్న సంగతి తెలిసిందే. భారత కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం ఈ ఒలింపిక్స్ అంగరంగ వైభవంగా ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా ప్రతి దేశానికి చెందిన ఆటగాళ్లు జాతీయ జెండాను పట్టుకుని పరేడ్‌లో పాల్గొనడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో టోంగా దేశానికి చెందిన పిటా రియో ఒలింపిక్స్‌లో ఎలా అయితే నూనె రాసుకుని, చొక్కాలేకుండా పతాకధారిగా కనిపించాడో అచ్చు అలాగే ఈ ఒలింపిక్స్‌లోనూ పరేడ్‌లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఎముకలు కొరికే చలిలో 34 ఏళ్ల పిటా ఇలా చొక్కా లేకుండా రావడంతో పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో పిటా హాట్‌టాపిక్‌గా మారిపోయాడు. రియో ఒలింపిక్స్ సమయంలో టోంగా గురించి దాదాపుగా సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చర్చ జరిగింది. మాకింకా పెళ్లి కాలేదంటూ.. కొంత మంది అమ్మాయిలు సందేశాలు కూడా పంపారు. ఇప్పుడు కూడా మరోసారి పిటాను చూసి ఫిదా అయిన అమ్మాయిల నుంచి ఎన్ని ప్రస్తావనలు వస్తాయో చూద్దాం..

సాంకేతికతతో మానవ ప్రవర్తనలో మార్పు

ప్రధాని మోడీ



అబుదాబి: సాంకేతిక పరిజ్ఞానంతో మానవ ప్రవర్తన ఆధునీకరించబడిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. 'టెక్నాలజీ ఫర్ డెవలప్‌మెంట్, దుబాయ్' అనే అంశంపై ప్రపంచ ప్రభుత్వ సదస్సులో ఆదివారం మోడీ కీలకోపన్యాసం చేశారు. 'ఇది నేను మాత్రమే కాదు 125 కోట్ల భారతీయులు కూడా గర్వించే విషయం. ప్రపంచ ప్రభుత్వ సదస్సు 6వ ఎడిషన్‌కు నన్ను ప్రధాన అతిథిగా ఆహ్వానించారు' అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా, భారత్‌లో మాతృ మరణాలు తగ్గాయని మోడీ చెప్పారు. 'గత 25 ఏళ్లలో భారత్‌లో మాతృ మరణాలు మూడోవంతు తగ్గగా, ప్రపంచవ్యాప్తంగా అర వంతు తగ్గాయి' అని ఆయన వివరించారు. క్షిపణులు, బాంబుల్లో ప్రపంచ పెట్టుబడులు భారీగా పెరుగుతుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగం అవుతుండటాన్ని హెచ్చరిస్తూ, అది కచ్చితంగా అభివృద్ధికి వినియోగించబడాలి. విధ్వంసానికి కాదని మోడీ పేర్కొన్నారు. కొంతమంది ప్రజలు సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ స్పేస్‌ను ఉగ్రవాదానికి ఉపయోగించే యత్నాలపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. కార్యకర్తలను నియామకానికి జిహాదీలు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడాన్ని ప్రస్తావించారు. సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణల ప్రభావాన్ని నొక్కి చెబుతూ సాంకేతిక పరిజ్ఞానం మానవ ప్రవర్తనను ఆధునీకరిస్తుందన్నారు. పెరుగుతున్న డిమాండు నూతన ఆవిష్కరణకు దారితీస్తుందన్నారు. 'సాంకేతిక పరిజ్ఞానం ఆలోచనలను వేగవంతం చేస్తుంది. సామాన్యుడికి సాధికారత కల్పిస్తుంది' అని ప్రధాని మోడీ తెలిపారు. 'మేము ఆరు 'ఆర్'లను అనుసరించాలి. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్, రికవరీ, రీడిజైన్, రీ-మాన్యుఫ్యాక్చర్‌లు అంటే అర్థం ఆనందానికి దారితీయడమే' అని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ప్రధాన మంత్రి గల్ఫ్ సహకార దేశాల సమితి నుంచి వచ్చిన వ్యాపార ప్రముఖులతో సమావేశమయ్యారు. భారత్‌లో ఆర్థిక అవకాశాలపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. గత మూడున్నరేళ్లలో చేపట్టిన సంస్కరణలను వివరించారు.

భారత్ గౌరవం పరిఢవిల్లుతోంది

ఆదివారం ఉదయం దుబాయ్ ఓపెరా హౌజ్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. 'ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు ఉన్నారు. భారత్ నుంచి వచ్చిన సుమారు 30 లక్షల మందికి యూఏఈ సొంత దేశంలో ఉంటున్న వాతావరణం కల్పించడం సంతోషంగా ఉంది. భారత్ వేగంగా అభివృద్ధి చెందు తోంది. ప్రపంచ స్థాయిలో భారత్ గౌరవం పరిఢవిల్లు తోంది. యూఏఈ ప్రగతి పథంలో భాగస్వాములు అవుతు న్నందుకు సంతోషం. భారత అభివృద్ధిలోనూ మీరూ(ప్రవాస భారతీయులను ఉద్దేశించి) భాగస్వాములు కావాలి' అని మోడీ పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణానికి యూఏఈ యువరాజు మోహమ్మద్ బిన్ సల్మాన్ అనుమతి ఇవ్వడం భారత సంస్కృతికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ప్రసంగానికి ముందు అబుదాబిలో తొలి హిందూ దేవాలయానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి 2వేల మందికి పైగా ప్రవాస భారతీయులు హాజరయ్యారు. అబుదాబిలోని అమరవీరుల యుద్ధ స్మారకం వద్ద ప్రధాని మోడీ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. యూఏఈ పర్యటనలో భాగంగా ఇంధన భద్రత, మౌలిక రంగాల్లో యూఏఈ సుమారు 11 మిలియన్ డాలర్ల మేర భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

విలువలకు కట్టుబడిన జర్నలిస్టు శ్రీకాంత్

సంస్మరణ సభలో వక్తలు



సంస్మరణసభలో మాట్లాడుతున్న అజిత, వేదికపై రామచంద్రమూర్తి, అశోక్, రామచంద్రయ్య, మంజరి తదితరులు

విశాలాంధ్ర బ్యూరో -హైదరాబాద్: జర్నలిస్టు దిగ్గజం, సాహితీవేత్త గుర్రంకొండ శ్రీకాంత్ సమాజం గురించి పట్టింపు ఉన్న వ్యక్తి, జీవితమంతా రచనలకే అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని వక్తలు కొనియాడారు. చివరి వరకు విలువలు, వ్యక్తిత్వాన్ని కాపాడుకున్న గొప్ప జర్నలిస్టు అని ప్రశంసించారు. ఇటీవల మృతి చెందిన శ్రీకాంత్ సంస్మరణ సభ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఆదివారం 99 టీవీ ఎడిటర్ అజిత అధ్యక్షతన జరిగిన జరిగింది. ఈ సభలో సీనియర్ జర్నలిస్టు, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి, వార్త పూర్వ సంపాదకులు టంకశాల అశోక్, మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, 99 టివి ఎడిటర్ కె.అజిత, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాజమౌళి చారి, టీయూడబ్ల్యూజే నేత పల్లె రవి, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, మంజరి హాజరయ్యారు. శ్రీకాంత్ సతీమణి కుసుమ శ్రీకాంత్, శ్రీకాంత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. శ్రీకాంత్ శిష్యబృందం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు. గుర్రంకొండ శ్రీకాంత్ దశాబ్ద కాలం పాటు వార్త ఇనిస్టిట్యూట్ ఆఫ్ జర్నలిజం (విఐజె) ప్రిన్సిపాల్ గా సేవలందించారు. ఆయన దగ్గర జర్నలిజం పాఠాలు నేర్చుకున్న వారిలో ఎక్కువ మంది అప్పటి జర్నలిజం విద్యార్థులు ఈ సంస్మరణ సభలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్రమూర్తి మాట్లాడుతూ శ్రీకాంత్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. శ్రీకాంత్ ఎలాంటి సంకోచం లేకుండా తన అభిప్రాయాలు ముక్కుసూటిగా చెప్పేవారని, వామపక్ష మేధావిగా శ్రీకాంత్ నిలిచిపోయారని కొనియాడారు. శ్రీకాంత్ జీవితమంతా రచనలకే అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని అభినందించారు. కాలుష్యానికి గురి కాకుండా చివరి వరకు విలువలు, వ్యక్తిత్వాన్ని కాపాడుకున్న గొప్ప జర్నలిస్టు శ్రీకాంత్ అని కొనియాడారు. శ్రీకాంత్ లాంటి వ్యక్తుల సంఖ్య జర్నలిజంలో పెరగాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. టంకశాల అశోక్ మాట్లాడుతూ చివరి వరకు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్న అరుదైన వ్యక్తి శ్రీకాంత్ అని చెప్పారు. శ్రీకాంత్ ను అనుసరించడమే కాదు ఆయన లక్షణాలను అలవర్చుకోవాలని జర్నలిస్టులకు సూచించారు. జర్నలిజం స్కూల్ ను స్కూల్ గా, కోర్సు మాదిరిగా నడపకుండా ఒక గురుకులం మాదిరిగా నడిపిన వ్యక్తి శ్రీకాంత్ అని, సిలబస్‌తో సంబంధం లేకుండా జర్నలిజాన్ని ఒక కల్చర్ మాదిరిగా విద్యార్థులకు నేర్పించారని చెప్పారు. సి.రామచంద్రయ్య మాట్లాడుతూ చట్టసభలో తాను మాట్లాడిన దానిలో ఏమైనా లోపాలుంటే వెంటనే తనను కలిసి వాటిపై స్పష్టత ఇచ్చేవారని గుర్తు చేసుకున్నారు. రాజమౌళి చారి మాట్లాడుతూ శ్రీకాంత్ పేరు మీద స్మారకోపన్యాసం ప్రారంభిస్తే బాగుం టుందని చెప్పారు. గొప్ప జర్నలిజం గురువు శ్రీకాంత్‌తో తాను కలిసి పనిచేయలేకపోవడం దురదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. పల్లె రవి మాట్లాడుతూ పరిమితమైన వనరులు ఉన్న రోజుల్లో కూడా ఎంతో మంది జర్నలిస్టులను తీర్చిదిద్దిన ఘనత శ్రీకాంత్‌కు దక్కిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన జర్నలిస్టులకు శ్రీకాంత్ పేరు మీద అవార్డు ఇస్తే బాగుంటుందన్నారు. అందుకు తాను పూర్తిగా సహకరి స్తానని చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.